
ఆంధ్రసచిత్రవార

పత్రిక



17-6-66


నవయుగ
ఆత్మా ఆర్ట్సు
చిలకా గోరింకా
నిర్మాత దర్శకుడు:
ప్రత్యగాత్మ

ఉత్తరాలు

కథలు

"భర్తలెలా వుండాలి?" కథ చాలా బావుంది. కాని ఎంతశాంతమూర్తియినా రామారావు తనభార్య ప్రవర్తనకు తనంతట తానే నాయుగు లిగిలించ వలసింది. ఈస్వవిషయం గురించి తనస్నేహితుని (రాజారావు) సలహా కోరేటటువంటి అమాయిక భర్త లుంటారా!? ఇంకో సంగతి "పాడుసరదా. మొగుడుచేత పాడు దెబ్బలు తినడంకూడా ఒకసరదాయేనా?" అన్న సుజాత మాటలతో కథముగిసింది కాని సుజాత మొగుడిచేత తను దెబ్బలు తిందామని చేసిన ప్రయత్నాలు ఫలించినందుకు తనకు తాను సంతోషపడి భర్తకు సగర్వంగా తెలియపర్చ వలసింది.

ఎమ్. రామారావు (జమ్‌షెడ్‌పూర్)

* * *

"ఆమె చేసిన నేరం" అనే కథలో మంచి యితివృత్తముంది. చాలవరకు ఆడపిల్లల పెళ్లి సంబంధాలు యిరుగు పొరుగువారి మాటలవలననే చెడిపోతున్నాయ్. ఒకసంబంధం కాకపోతే మరొకటి దొరుకు తుందనేది దీనిలోఅసలు యితివృత్తం.

మరొకటేమిటంటే, షికారుకు సుమతి, డాక్టర్—కేవలం టిఫిన్ బుట్ట మాత్రం వెంబడి తీసికెళ్లారు. కాని చెరువుగట్టున కూర్చో డానికి యిద్దరికీ రెండు తువాళ్లు ఎలా వచ్చాయో ఆశ్చర్య కరంగా వుంది.

బాపనపల్లె అర్జునయ్య (చిత్తూరు)

బాలసాహితి

బాల సాహితిలో వకాళ్వీనసిరుద్దిన్‌కథలు చాలాబాగుంటున్నాయి. 6—5—66 సంచికలో వెలువడిన కథలలో 'బడాయి' కంటె 'గాడిదవెల' కథ చాలానవ్వుతెప్పించింది. నళినీ మోహన్ గారికి మాఅభినందనలు.

ఈసంచికలోనిదే 'కథలాంటి నిజం' కథలో చిన్న తప్పు దొర్లి నందుకు చింతిస్తున్నాము. 16 వ పేజీలో—"హో. యస్. అలాగే" అని బలరామ్ ఎవర్నో పిలిచాడు అని ఉంది. పోనీ పిలవగావచ్చిన యువకుడిపేరు బలరామ్ అనుకుందామన్నాఇక్కడ సరిపడడం లేదు. బలరామ్‌కి బదులుగా నాగేందర్ అని ఉండాలి.

కలాసి సుధాకరరావు (కెసింగా)

వింతతెలుగు

1—4—66 ఆంధ్రసచిత్ర వారపత్రికలో శ్రీ మహీధర నళినీ మోహన్ వ్రాసిన "వింతతెలుగు" అన్న వ్యాసాన్ని చదివాను దానిలో "ఏభార్యఅయితే ఎన్ను ఆనందడోలికలలో వూపుతుందనితలిచవద్దావో ....", "ఏకొడుకైతే తలకి కొరివి పెడతాడని ఆశపెట్టుకొన్నానో.........." లాంటి వాక్యాలు వ్రాయడం తెలుగు సాంప్రదాయముకాదన్నారు. శారు. ఆవాడిగా వస్తూన్న తెలుగు రచనలో యిలాంటి యోగాలు కొల్లలు కొల్లలుగా వున్నాయి. ఇదేమీ కొత్త పోకడకాదు. మచ్చుకు "ఎవ్వనిచేజనించు జగమెవ్వని లోపలనుండు లీనమై.........." అను గజేంద్రమోక్షములోని పద్యముచాలునను కుంటాను. ఇకను "వాళ్ళవాన్న ఎవరైతే ఉన్నారో ఆయన పిలుస్తున్నారు." లాంటి వాక్యాల్లో మోస్తరు. ఈ వాక్యనిర్మాణపద్ధతిని అనుచితంగా ప్రయోగిస్తే ఏభాషలో నైనా ఎబ్బెట్టుగా వుంటుందనడం నిస్సంశయము. ఉదాహరణకు యీ విధమైన ప్రయోగము హిందీలో కూడా ఎబ్బెట్టుగా వుంటుంది. బాగా హిందీ తెలిసిన వాళ్ళు వాడరు కూడాను.

ఇంక "అవధానిగారు తావళంతిప్పుకుంటూ...." అన్నవాక్యంలో ఒకపాత్రకు "గారు" చేర్చడం, యింకోపాత్రకు "గారు" చేర్చకపోవడం చిత్రమైన ప్రయోగముగా కనిపిస్తోందని వ్రాశారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని వివిధప్రాంతాల్లోని వ్యావహారిక భాషననుసరించి వుంటుంది. కొన్నిజిల్లాలలోని వాడుక భాషప్రకారము ఆ పాత్రలు ఎంత మంచి వైనా ఎంతముసలివైనా "గారు" చేర్చక పోవడం పరిపాటి. దీనిలో అనమర్యాద యేమీలేదు.

ఇంక "టు టేక్ ఎడెసిషన్", "టుకమ్‌టు ఎ కంక్లూషన్" లాంటి ప్రయోగాలకు తెలుగులో యథార్థానువాదాలు, యింగ్లీషు భాషాప్రాబల్యము వల్ల వచ్చిన సహజ పరిణామాలుగా గుర్తించాలి. సర్వతోముఖంగా అభివృద్ధి చెందే ఏభాష యైనా యిలాంటి కొత్త ప్రయోగాలు అవలంబించడం కొంతవరకు అవసరం. "టు డిసైడ్"అన్న ప్రయోగానికి "టుకమ్ టు ఎ డెసిషన్"అన్నప్రయోగానికీ యింగ్లీషులో ఎలా అయితే తేడా వుందో తెలుగులో అనువాదలకు కూడా సూక్ష్మమైన తేడావుంది.

ఇంక, విభక్తుల విషయంలో తెలుగులో సంస్కృతం మోస్తరు కాకుండా రెండే రెండువిభక్తులుండాలని శ్రీ నళినీ మోహన్ గారు సూచించారు. హిందూదేశములోని యించుమించు అన్ని భాషల్లోనూ ఎనిమిది విభక్తులున్నాయి. తెలుగులోకూడా ఆ విధంగానే వ్యాకరణ సిద్ధాంతాల ప్రకారము ఎనిమిది విభక్తులు వున్నట్లు భావించడంలో అసమంజసమేమీ కనిపించవడం లేదు.

ఎం. వెంకటరామయ్య. (కలకత్తా)

వ్యాసాలు

మీరు జమునతో యిష్టాగోష్టి ప్రసారించినారు. ఆవ్యాసం చదివిన నాకు చికాకు కలిగించినది. మీరు "మనతో మాట"లో జమునకు శ్రీవారు నచ్చి వట్లున్నారని వ్రాశారు. ఎవరి శ్రీవారు వారికి నచ్చుట యెవరికినీ అపురూపము గాదు. నచ్చకపోయినను పెద్ద ఆశ్చర్యము పడవలసిన పనిగాదు.

ఎ. వి. ఆర్. రావు (రాయచూరు)

* * *

'సరాగమాల' శీర్షికను నిర్వహించి పాఠకులను రంజింపజేసిన శ్రీ వి. ఎ. కె. రంగారావుగారు మన చిత్రాలలోని నృత్యాలను గురించి చర్చించినందుకు వారికి నా అభినందనలు. అయితే వారు కొన్నిచోట్ల కేవలం రంధ్రాన్వేషకుగా నృత్యాలను విమర్శించారు.తప్పితే, సమయ సందర్భాల ప్రాముఖ్యతను వారు విస్మరించారని చెప్పకతప్పదు. "హరిశ్చంద్ర" చిత్రంలో ఎల్. విజయలక్ష్మి పాడిన తిల్లానా కర్ణాటక సంగీత ధోరణిలోయుంటే, నృత్యం కాచి వడపోసిన కూచిపూడి అని వారు పేర్కొన్నారు. అయితే ఇది నృత్యకారుని ప్రతిభకు తార్కాణమేగాని లోపంకాదని నా యుద్దేశ్యం. ఇంద్రసభలో నృత్యం జరిగినపుడు నృత్యం, గానం రెండూ కూచిపూడి ఫక్కీలోయుంటే 'రసాభాస' కాక తప్పదు. కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం రెండూ మిళాయించినపుడే, ఆ సన్నివేశానికి 'రససిద్ధి'చేకూరుతుంది. ఈనృత్యం నాట్యంతో కొంత పరిచయమున్నవారికి యుద్దేశింపబడినదని వారు పేర్కొన్నారు. అంటే శాస్త్రీయ నృత్యాలంటే ప్రేక్షకులకు మక్కువలేదనా, రంగారావుగారి యుద్దేశ్యం? నృత్యం, గానం వేనిలోను కొంచెమైనా ప్రవేశం లేకపోయినప్పటికినీ, రసోద్దీపనచేత సమయానికి తల ఆడించగలవాడు ఉత్తమ ప్రేక్షకుడు అని లాక్షణికుల వాక్యం. అందువలన కేవలం శాస్త్రీయ నృత్యాలలో ప్రవేశమున్నవారే ఆ నృత్యాల వలన ఆనందం అనుభవిస్తారని భావిస్తే, అది


ఇప్పటికే
లక్షకు
మించి
ట్రాన్సిస్టర్లు
తయారైనవి!
బుష్
ట్రాన్సిస్టర్లు
మూల్‌చందాని ఎలెక్ట్రికల్ అండ్ రేడియో ఇండస్ట్రీస్ లిమిటెడ్
MULCHANDANI

పొరపాటు. 'అమరశిల్పి జక్కన్న'లో "నగు మోము చూపించవా" పదంలో, సంగీత దర్శకులు పప్పులో కాలు వేశారని రంగా రావుగారు వ్రాశారు. అన్ని రకాల సంగీతాల తోను విశిష్ట గరిష్టులైన ఆ సంగీత దర్శ కునికి ఇలాంటి పదాలలో పొరపాటుపడటం అనేది అబద్ధం. ఈ సందర్భంలో రంగారావు

ఉత్తరాలు

గారిని ఒక విషయం అడగాలి. ఇదివరలో పద్మశ్రీ భానుమతి "వివాహబంధం" చిత్రంలో "నగుమోము గనలేని" అనే త్యాగరాజకృతిని, శాస్త్రీయంగాకాక, అశాస్త్రీయంగా గానం చేసినపుడు, రంగారావు గారు 'సరాగమాల'లో విమర్శించకుండా, సర్వ జనులను సంతృప్తిపరచటానికి అది సమంజసమేనని ఆమెను ఎందుకు బలపరిచారో నేను తెలిసికోవచ్చునా? "శ్రీకృష్ణపాండవీయం"లో 'మయసభ' నృత్యం భరతనాట్య పద్ధతిలోయున్నా, దానికి ఇవ్వబడిన హిందూస్తానీ శాస్త్రీయ సంగీతం ఎంతో మధురంగాయున్నది. భరతనాట్య శైలిలో ఆ నృత్యానికి సంగీతం ఇవ్వలేకకాదుగాని, అలా ఇస్తే ఆ నృత్యాలను తిలకించే రసజ్ఞులు 'రంగారావు'గారిలాంటి రంధ్రాన్వేషకులు మాత్రమే.

జి. పద్మలత (మంగళగిరి)

సీరియల్

నిరీక్షణ సీరియల్ మొదటినుండి రసవత్తరంగా, బలే బాగుంది. ఈవారం 13—5—66 44 వ పేజీలో ఆంజనేయులు స్వగతానికి అనుకున్నది. అర్థం కాక వ్రాస్తున్నాను.........— అది

"ఏ డీవూల్లో డాక్టరా, తల్లినడిగి రావడానికి వెళ్ళాడా, కొడుకిలాంటి ఆ ప్రాచ్యపు పనిచేశాడని తెల్సి ఆతల్లికాస్తా గుండె పగిలి చచ్చిందన్నమాట".

అసలు అంజనేయులుకు వేణుకు ఇంతవరకు పరిచయమే లేదు. అలాంటిది వేణుని డాక్టర్‌గా ఎలా తెల్సుకోగలిగాడు? బహుశః రచయిత్రి దృష్టిలో అతను డాక్టర్‌గా రూపొందాడు గనుక అలా వ్రాసియుండవచ్చు. కాబట్టి ఇకముందు ఇలాంటి చిన్న పొరపాట్లు రాకుండా నవరించు కోగలరని ఆశిస్తున్నాను.

ఇ. శ్యాంరావ్ (బొంబాయి)

* * *

కరుణనూ మన్మథనూ యిలా ఘోరంగా చంపేసి, చివరలో నవలను యిలా చీల్చి చెండాడారని కాస్త ముందుగాఏమాత్రం అనుమానం కల్గినా అసలా సీరియల్ చదవటమే మాని వేసేవాడిని. కరుణ రచయితకు కరుణ ఏమాత్రం ఉన్నట్లులేదు. ప్చ్! ఏం చేస్తాం. ఎలాగైనా చివరి వారాలుతప్ప మిగిలిన నవలంతా చాలా బావుంది.

ఓ. ఎస్. ప్రసాద్ (భీమడోలు)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 17—6—'66
పరాభవనామ సం॥ జ్యేష్ఠమాసం బ॥ చతుర్థి
సంపుటము : 58 సంచిక : 42
స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు

ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	24.50
అర్ధసంవత్సర చందా	12.25

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేనన్నీ, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీ లేని రచనలను ప్రచురణకి స్వీకరించ లేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

మనలో మాట

భారత కమ్యూనిస్టుపార్టీలోని అతివాద మితవాద వర్గాల మధ్య ఐక్యమత్యాన్ని సాధించడానికి జరుగుతున్న కృషిని, రాబోయే ఎన్నికలలో కాంగ్రెసుకు వ్యతిరేకంగా సర్వవామపక్షాలసమీకరణకు జరుగుతున్న ప్రయత్నాలను శ్రీ శ్రీకృష్ణ ఈవారం తమ 'న్యూఢిల్లీ లేఖ'లో వివరించారు...

* * *

సైన్స్‌కి సంబంధించిన వ్యాసం 'ఆలోచించే యంత్రాలు' ప్రచురణ పూర్తి అయిన వెంటనే తిరిగి 'వైజ్ఞానిక గాథాశతి' ప్రచురణ మామూలుగా కొనసాగుతుంది...

* * *

ప్రముఖ జానపద చిత్ర కథానాయకుడు, శతచిత్ర నటుడూ అయిన శ్రీకాంతారావుకు కోదాడలో జరిగిన సన్మాన విశేషాలను ఈ సంచికలోని 50,51,52 పేజీలలో చూడవచ్చు...

* * *

ప్రచురణార్హం కాని రచనలను తిప్పిపంపగోరే రచయితలు తమ రచనలతో బాటు స్టాంపులు అంటించిన 'సెల్ఫ్ ఎడ్రస్డ్ ఎన్వలప్'ను జతపరచవలసినదిగా గమనించ కోరుతున్నాము...

విషయానుక్రమణిక

ముఖచిత్రం: కొత్తనటి రత్నశ్రీ (ఫొటో : ప్రభాకర్)


రాజకీయ తంత్రాలు
ముఖ్య మంత్రి బ్రహ్మానంద రెడ్డి
కారు మేఘాలు కమ్ముకుంటున్నాయి
వెనుకవైపు కూడా ఓ కన్ను వేసి ఉంచటం ఎంతైనా మంచిది
అఖిల భారత కాంగ్రెస్ కార్యకలాపాలు
మద్రాసులో
చూడండి! ఇతడు నా జేబు కొటేస్తున్నాడు..
ఎవరు ఎవరి జేబు కొట్టేస్తున్నారు
తమ వ్యవహా
రాలలో జోక్యం కలిగించుకున్నదన్న ఆరోపణలకు ఇండియా సమాధానం
ఇటీవలి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అనంతరం మొరార్జీ బలం పెరిగింది.
—వార్త

శ్రీకృష్ణ

అతివాద మితవాద వర్గాలమధ్య అయికమత్యానికి ప్రయత్నాలు

1967లో జరిగే ఎన్నికల దృష్ట్యా భారత కమ్యూనిస్టుపార్టీలోని మాస్కో అనుకూలవర్గాలూ, పెకింగ్ అనుకూలవర్గాలూ ఒక రకమైన సఖ్యతను సాధించడానికి ప్రయత్నిస్తున్నాయి.

కొన్ని నెలలుగా ఈ రెండు వర్గాలూ సమావేశాలలో పాల్గొంటున్నా సాధించిందేమీ పెద్దగా కన్పించటంలేదు కానీ కేరళలో ఆహార కొరత విషయంలో జరిగిన అల్లర్లు, ఆగడాలను ప్రేరేపించడంలో ఈ రెండువర్గాలూ పాల్గొన్నాయి.

మాస్కో అనుకూలవర్గంవారిని పెకింగ్ అనుయాయులతో ఏదోవిధంగా ఏకీభావానికి రావలసిందిగా మాస్కో వొత్తిడి చేసింది.

ఫిబ్రవరి 12 వ తేదీన ప్రావ్దా శ్రీ రాజేశ్వర రావు చెప్పిన మాటల్ని ఆమోదించింది. ఆయన యిలా అన్నారు. "రెండువర్గాల వారికృషి అవసరం........ మన ఉద్యమం సవ్యంగా సాగాలంటే ప్రజలను కలత పెట్టే సమస్యలవైపు మనం దృష్టి విసారించి వాటి పరిష్కారానికి కలిసి కట్టుగా పోరాడాలి. గత ఆరుసంవత్సరాల లోనూ మనం ఎన్నో చర్చలను జరిపాం. కానీ మన శ్రమకు తగిన ఫలితం లభించ లేదు.వాస్తవంగా ఈరెండువర్గాల సంబంధాలలో చాలా చెడు పేరుకుపోయింది. పోరాటం సమయంలో అది తగ్గుతుంది.

శ్రీ రాజేశ్వరరావు మాస్కో అనుకూల వర్గంనాయకుడు ఎస్. ఎ. డాంగేకంటే మంచి స్థితిలోనే ఉన్నారు. ఆయన వ్యతిరేక వర్గంవారితో ఒక సమాధానానికి రావటానికి సమర్థులే. ఎందుకంటే ఆయనకు గతంలో విప్లవాత్మకమైన రికార్డువుంది.

1948—51 లో జరిగిన తిరుగుబాటు సమయంలో ఆయన భారత కమ్యూనిస్టుపార్టీ జనరల్ సెక్రటరీగా ఉన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆ సమయంలో దేశంలోనే గెరిల్లాయుద్ధాన్ని జరిపింది.

1924 లో బ్రిటిషు ఏజంటుగా ఎస్. ఏ. డాంగే సేవలను అందించటం పెకింగ్ అనుయాయులకు యిష్టం లేక పోయింది. చైనావారు సిటిసీ మాటికీ ఆయన్ను ఆక్షేపించటం ప్రారంభించారు. దానికితోడు పార్టీ నిధులు చేతికి వచ్చిన విషయంలో ఆయన తన పలుకుబడిని చాలా వరకూ పోగొట్టుకున్నారు.

భారతదేశంలోని అతివాద కమ్యూనిస్టులు కొంచెం మెత్తగా వ్యవహరించాలని రష్యా వారు అనుకుంటున్నారు. ఈ అతివాద పక్షాన్ని రష్యన్లు పోటీ కమ్యూనిస్టు పార్టీగా వర్ణిస్తున్నారు. ఈభారత అతివాద కమ్యూనిస్టులు తాష్కెంట్ ఒప్పందాన్ని మెచ్చుకోడమేగాక ఇండియా చైనా వివాదాలను కూడా పరిష్కరించుకోవాలని అంటున్నారు. భారత చైనా తగాదా ఎలా ఉన్నా తాష్కెంట్ ఒప్పందాన్ని కమ్యూనిస్టు చైనా ససేమిరా మెచ్చుకోడంలేదు. ఈ అతివాద కమ్యూనిస్టులకు తమ పార్టీని మాస్కో గుర్తించాలనే తాపత్రయమూ ఉంది. సుందరయ్య మాస్కో వెళ్ళినప్పుడు ఆయన ద్వారా అతివాద కమ్యూనిస్టులు ఈ విషయాన్ని కదిపి ఉండవచ్చు. 'లింక్'మాస్కో కమ్యూనిస్టులకు అనుకూలమైన పత్రిక. సుందరయ్య తన మిత్రులకు రాసిన ఉత్తరాల్ని గురించి ఈపత్రిక ఫిబ్రవరి 13 న ప్రస్తావించింది. ఆ ఉత్తరాలలో సుందరయ్య వైఖరిలో వచ్చిన మార్పు గోచరం అవుతున్నదనీ, అతివాద కమ్యూనిస్టులతో ఈ ఉత్తరాలు పెద్ద తగాదా లేవదీశాయనీ వ్రాసింది. పోతే సుందరయ్య యిప్పుడు పెకింగ్‌కు అనుకూలంగా ఉంటున్న యితర భారత కమ్యూనిస్టు నాయకులతో కూడా మంతనాలు జరుపుతున్నారని చెప్పుకుంటున్నారు. ఫిబ్రవరి 6 వ జరిగిన భారత కమ్యూనిస్టుపార్టీ 40 వ వార్షికోత్సవ సందర్భంలో మాస్కో అనుకూలవర్గంవారి పత్రిక 'న్యూ ఏజ్' ప్రత్యేక సంచిక నొకదాన్ని వెలువరించింది. చాలా రాష్ట్రాలలో ఉత్సవాలు జరిగాయి.

'న్యూ ఏజ్'లో సోవియట్‌యూనియన్, ఉత్తర యిరోపా, ఫ్రాన్సులలోని కమ్యూనిస్టుపార్టీలనుంచి వచ్చిన అభినందనలు ప్రచురింపబడినాయి. అయిక్యతను నొక్కి చెప్తూ చాలా సందేశాలు వచ్చాయి. దిగజారిపోయిన కమ్యూనిస్టుల పలుకుబడి దృష్ట్యా చూస్తే ఆ ఉత్సవాలు తగ్గింపబడటంలో ఆశ్చర్యం ఏమీలేదు.

మాస్కో అనుకూలవర్గం నాయకులు రష్యా వెళ్ళటం అన్నది భారత కమ్యూనిస్టు పార్టీ తన యుక్తులను మార్చుకొనేట్లుగా ప్రభావాన్ని పడేట్లు చేసింది. ముఖ్యంగా పార్టీలో పెరిగిపోతున్న చైనా అనుకూల వర్గానికి సంబంధించినంతవరకూ ఈరెండు వర్గాలనూ దగ్గరకు తీసుకురావాలని రష్యా చేస్తున్న ప్రయత్నం అందరికీ తెలిసిందే. భారతదేశంలోని కమ్యూనిస్టులంతా కలసి కట్టుగా వచ్చే ఎన్నికలలో తమ పాత్రను నిర్వహించాలని సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టుపార్టీలు వెలువరించిన సుదీర్ఘమైన నివేదికలో సోవియట్ నాయకులు చెప్పారు.ఐక్యతను సాధించటానికి కృషిచేయవలసిందిగా భారత కమ్యూనిస్టు పార్టీని సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కోరింది.

ప్రస్తుతం ఈ వర్గాల దృష్టంతా భారత ప్రభుత్వంవైపు తిరిగింది. పెకింగ్

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా

సర్వ వామపక్షాల సమీకరణ

అనుకూలవర్గంవారు ప్రభుత్వ విధానాల్ని విమర్శిస్తూ "బూర్జువా భూస్వాముల ప్రభుత్వాన్ని" కూలద్రోయటానికి ప్రయత్నిస్తుంటే, మాస్కోవర్గంవారు "శాంతియుతంగా" భారతదేశాన్ని కమ్యూనిస్టురాజ్యంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. అది కాంగ్రెసుతో వామపక్ష విభాగంద్వారా సాధించాలని చూస్తున్నారు. ఏప్రిల్ 24 తేదీన మాస్కో అనుకూలవర్గం పత్రిక 'న్యూ ఏజ్' ప్రభుత్వాన్ని, ముఖ్యంగా ప్రధానిని అసాధారణమైన రీతిలో తీవ్రంగా ఎదుర్కొంది.

అనుసరిస్తున్న విధానాన్ని గురించి మదింపు చేయడానికి మూడు మార్గాలు గోచరిస్తున్నాయి. (1) భారత కమ్యూనిజంలో చీలికల విషయంపై మాస్కో చెందుతున్న ఆందోళన, ఈ చీలికలతో పెకింగ్‌కి అనుకూలమైన వర్గం బలాన్ని పుంజుకుంటున్నది. (2) 1967 తో వచ్చే ఎన్నికలలో కాంగ్రెసుకు వ్యతిరేకంగా సర్వ వామపక్షాలనూ సమీకరింపవలసిన అవసరం.

(3) తాను ఏమిచేయలేకపోతున్నాననీ, తన బలం తగ్గిందనీ భారత కమ్యూనిస్టు పార్టీ గుర్తించింది.

కొంతకాలం పాటు మాస్కో నాయకులు భారతదేశంలోని కమ్యూనిస్టు వర్గాలలో ఐకమత్యం అవసరమని చెప్తూవచ్చారు. పార్టీ మహాసభలకు పంపిన సందేశాలలోనూ, భారత కమ్యూనిస్టు పార్టీ ఉభయ వర్గాల నాయకులూ మాస్కో వెళ్ళటం జరుగుతున్నది కనుక వారితో ప్రస్తావించటంలోనూ సోవియట్ నాయకులు తమ ఆసక్తిని ప్రకటిస్తూ వచ్చారు. ఎస్. ఏ. డాంగే సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 23 వ మహాసభలో ఏప్రిల్ 6 వ తేదీన మాట్లాడుతూ మాస్కోని సమర్థించారు. ఏప్రిల్ 20 వ తేదీన భారత కమ్యూనిస్టులలో మాస్కో అనుయాయులు సోవియట్ యూనియన్ చేరుకున్నారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం తాలూకు సభ్యుల్ని గురించి యింకా యితర సమస్యల్ని గురించి మాట్లాడటానికి వీరు వెళ్ళారట. ఈ వెళ్ళిన భారతీయులంతా మితవాద కమ్యూనిస్టు పార్టీ కేంద్ర సచివాలయానికి సంబంధించిన వాళ్ళే. అయితే వీళ్ళతో బాటు కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబు రాష్ట్ర కమిటీల కార్యదర్శులు కూడా ఉన్నారు. వచ్చే ఎన్నికలలో కేరళ, పశ్చిమ బెంగాలులు కమ్యూనిస్టులకు చాలా ముఖ్యమైనవి. ఇంకో విధంగా పంజాబు కూడా ముఖ్యమైనది. ఆ రాష్ట్రాన్ని భాషా ప్రయుక్తంగా విభజించడానికి కేంద్రం ఆమోదించింది. ఈ విభజన మూలంగా అల్లర్లు మొదలైనవి సంభవిస్తే కమ్యూనిస్టులు ఆ అల్లర్లలో దూరవచ్చు. పంజాబు రాష్ట్రం టిబెట్ సరిహద్దుల్లో ఉండటం కూడా యిక్కడ గుర్తించవలసిన విషయం. అకాలీదళ్‌తో ఉభయవర్గాల కమ్యూనిస్టులకూ ఉన్న సంబంధాలు అందరికీ తెలిసినవే. అందుచేత పంజాబు కూడా కమ్యూనిస్టులకు ప్రధానమైనదిగానే పరిణమిస్తున్నది.

ఎన్నికల విషయంలో కమ్యూనిస్టులకు పెద్ద బెడద పట్టుకున్నది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టేతర వామ పక్షాలకు పట్టుకోడానికి అతివాద, మితవాద కమ్యూనిస్టు పార్టీలు రెండూ పని చేస్తున్నాయి. ఇందుకోసం ఈ రెండు పార్టీలు ఆ అవతలి పార్టీలకు ఏవో 'రాయితీలు' యివ్వటానికి కూడా సిద్ధపడుతున్నాయి. కేరళ, పశ్చిమబెంగాల్‌లలో అతివాద కమ్యూనిస్టులకు కొంత బలం ఉంది. ఈ రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ 'సీలింగ్' ఉంది. ప్రస్తుతం మాస్కో వెళ్ళి ఉన్న కేరళ, పశ్చిమబెంగాల్ కార్యదర్శులు ఈ రాష్ట్రాల్లో ఎలా పని చేయాల్సిందీ అక్కడి వారితో ఓ పథకాన్ని ఆలోచించి ఉంటారు. ఎన్నికల కోసం ఆ పార్టీలతో సంబంధాలు నెలకొల్పుకునేందుకు కృషి అప్పుడే పలు రాష్ట్రాలలో ప్రారంభం అయింది. ఉత్తర ప్రదేశ్‌లో అక్కడి కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ జెడ్. ఎ. అహమ్మద్ జనసంఘంతోనూ యింకా యితర పార్టీలతోనూ ఏవో సంబంధాలు పెట్టుకుని రాష్ట్ర శాసన సభలో ఎగువ సభకు ఎన్నికైనట్లు గట్టి విమర్శలు ప్రారంభం అయాయి. పార్టీ సిద్ధాంతాలకు పూర్తిగా దూరంగా ఉండే కొన్ని కొన్ని పార్టీలతో ఈ అతివాద మితవాద కమ్యూనిస్టు పార్టీలు చుట్టరికాలు పెట్టుకోవాలని ఆలోచిస్తున్న కారణాల్ని పురస్కరించుకుని అప్పుడే ఉత్తరప్రదేశ్‌లో యిరు పక్షాల సభ్యులూ తమ తమ పార్టీలకు రాజీనామా యిస్తున్నారు.

మాస్కో వెళ్ళిన వారు తిరిగి వచ్చారు. పాశ్చాత్య రాజ్యాలకు అనుకూలమైన వైఖరులను బలపరచవద్దని మాస్కోలో తమకు చెప్పిందని వారంటున్నారు. శ్రీ జి. డి. బిర్లా ఏ అమెరికా నుంచో తిరిగి వచ్చి రష్యా వైపుకు భారతదేశం మొగ్గు చూపటం పనికిరాదని అక్కడి వారన్నారని చెప్పారనుకోండి! అప్పుడు మాలవియాలూ, కృష్ణమీనన్‌లూ ఏమంటారు? భారతదేశం యొక్క సార్వభౌమాధికారానికి పెద్ద దెబ్బ తగిలిపోయిందంటారు. ప్రస్తుతం రష్యా చేస్తున్నట్లు చెప్పబడుతున్న ఈ వ్యవహారాన్ని గురించి మనదేశంలో పత్రికలుగానీ, నాయకులు గానీ ఆట్టే మాట్లాడటం లేదు. అదే ఆందోళన కలిగిస్తున్న విషయం.

మూలం: రామచంద్రఠాకూర్



3

వసంతరుతువునాటి సంధ్యా సమయంలో పాలి తన ఉద్యానంలో కూర్చుంది. ముందున్న వీణ మీద ఆమె వేళ్లు మెల్లగా సాగుతున్నాయి. ఎదురుగానే ఆమె సఖీ, సహచరి అయిన రేవా ఆమెను రెప్పవాల్చకుండా చూస్తూ కూర్చుంది. పాలి దృష్టి అకస్మాత్తుగా రేవాపై పడగానే ఆమె వేళ్లు ఆగాయి. 'ఏమి రేవా?' అందామె.

'స్త్రీ కింత కాఠిన్యం తగదు.'

'నే నలాంటిది ఏమి చేశాను రేవా?' అని స్నిగ్ధమ కోమలంతో ప్రేమపూరితమైన మాటలతో పాలి ఆమెను ప్రశ్నించింది.

'ఏమి చేయకుండా వున్నావేమిటి? అని అడుగు. స్త్రీ తన్ను అందంతో మగవారైన పురుషులకి [illegible] ఇస్తుంటారు. కాని పురుషుల్ని ఇలా [illegible] అంటే తన బుద్ధికి విలువ [illegible]. వివాహమాడవా పాలీ? [illegible] ప్రేమలో దగ్ధమయ్యే యువకులకి కొంత శాంతి లభిస్తుంది.'

'ఇందులో నువ్వు చెప్పిన కొత్త విషయం ఏముంది? కాని నేను ఎవరిని వివాహమాడను?'

'నీ వన్నది నిజమే. వైశాలిలో ఉన్న వాళ్లంతా స్త్రీలే. పురుషులున్నా వాళ్లు వృద్ధులూ, కురూపులూను. నిజమేనా? నీకేం వచ్చింది?'

'హృదయం ఒప్పుకోవడంలేదు. కంపించడంలేదు.'

'ఓహో! నీ మనసు ఎప్పుడూ ఒప్పుకోదు. బాగా పరిశీలించి [illegible] ఒప్పుకోనక పోవడం. పోట్లాడ్డానికి ధనుర్బాణాలు తీసికొని వెళ్లే స్త్రీని, నీ తుపాకుల్ని చూడని స్త్రీని గణించనే కూడదు. విద్యా బుద్ధులలో పురుషులతో తులతూగడానికి వెళ్లి వాళ్లని ఓడించి వేసిన స్త్రీకి హృదయ కంపనానుభావం ఈ జన్మలో లేకాదు, ఎన్ని జన్మలకైనా కలగదు' అని రేవా వ్యంగ్యంగా అంది.

'నీ యీ ప్రశంసకి బహుమానమియ్యనా? ఏమిటీ పేలాపన. నీకు కంపనానుభవం ఎంతుందో చెప్పు చూద్దాం.'

'మళ్లీ ఆ విషయం అడిగావా? అరే, అతణ్ణి చూశావా? చూడు, అటుచూడు...'

పాలి వెంటనే తలను అటుతిప్పి చూచింది దూరంగా తోటకి చివరిభాగంలో ఉన్న పూలమడివైపున రెండు పాగాలు ఒంటరిగా మేడుతున్నాయి. పాలి సైగచేసి చిటిక వేసింది. వెంటనే రేవా పాలి చేతిలో ధనుర్బాణాలు ఉంచింది. ఆమె వింటినారి సంధించి బాణాలు వదిలింది. రెండు పాగాలూ ఒక్కసారిగా గాలిలో ఎగురుతూ నేలబడ్డాయి. అప్పుడే బ్రహ్మదత్తుని అరుపు వినిపించింది. రేవా భయంతో నిల్చిపోయింది. మనుష్యులుగాని, పాగాలు గాని, బాణాలు గాని కన్పించలేదు.

'ఎవరది?' అని పాలి బిగ్గరగా అడిగింది. రేవా కూడా అలాగే జవాబిచ్చింది. తరువాత ఆమె మెల్లగా ఇలా అంది—

'ఆ బ్రాహ్మణుడెక్కడ?'

* * *

స్వర్గతుల్యమైన మాగధీయ భవ్య రాజప్రాసాదానికి ఉత్తరంగా ఉన్న కౌతుక భవనంలో మగధరాజైన బింబిసారుడు ఒక పెద్ద స్వర్ణసింహాసనం మీద కూర్చుంటి ఉన్నాడు. దక్షిణదేశాల నుండీ, సముద్రానికి అవలి వైపు నుండీ వచ్చిన, రత్నమాణిక్యాలు అతని సింహాసనంలో పొదగబడ్డాయి. నర్తనశాలలోని వాలుగుగోడలూ, పరుపూ, ఇంటి పైకప్పులో వారణాసి, మధ్యప్రదేశం, తక్షశిలలకు చెందిన శిల్పం, చిత్రాలూ, లలితకళల ఔన్నత్యాన్ని చాటుతున్నాయి.

మిక్కిలి సన్నని వస్త్రాన్ని ధరించి మగధ రాజు బింబిసారుడు ఒక జరీ తలగడాని ఆని కూర్చున్నాడు. అతని స్థూలముద్దాలైన సుందరమైన భుజాలనూ, పుష్టికరమైన వక్షస్థలాన్నీ స్పష్టంగా ప్రకటించే అతని ఉత్తరీయం ఒక్కోటే యువ సుందరుల చేతులలో మెల్లగా వూగు మయూరపింఛాల వల్లా, చామరాలవల్లా మెల్లగా ఎగురుతోంది. రాజులో దైవత్వము లేకపోయినా అతడు దేవుడులాగ కన్పిస్తున్నాడు.

క్షత్రియరాజులలో బుద్ధుని మొదటి అనుచరుడూ, అతని కంటె అయిదేండ్లు చిన్నవాడూ అయిన బింబిసారుడు ఎంత వీరుడో అంత రసికుడు. అతనికి తనపై ఉండవలసిన గర్వం కంటె అధికంగా అతని ప్రజలకు అతనిపై ఉంది. అతని రాజ్యంలో ప్రజలు సుఖంగా ఉన్నారు. ధాన్యాలతోటీ, ఫలవృక్షాలతోటీ దేశం సమృద్ధమై ఉంది. దానం చేయడంలో శ్రేష్ఠులు ఒకరితో ఒకరు కలహిస్తూ ఉన్నారు. దేదీప్యమానుడైన బింబిసారుని ఎదుట ప్రతి నాగరికుడూ ఆత్మత్యాగం చేస్తున్నాడు. గుణగ్రహణ పారీణుడవడంవల్ల అతని సభకు దూరదేశాల నుండి కళావంతులు వస్తూనే ఉన్నారు.

నేడు ఈ సమయంలో కాశ్మీరం నుండి కర్ణాటకం వరకూ, గాంధారం నుండి యోధకం వరకూ, అలసేంద్రం నుండి ఆవర్తం వరకూ గల ఆటకత్తెలు తమ రూపరాశిని విరజిమ్ముతూ అతని యెదుట నాట్యమాడుతున్నారు. అంగ పరిచాలనం, భావభంగిమల విషయంలో వీరిలో ఎవరు ఎవరి కంటె ఎక్కువ నేర్పుగలవారో చెప్పడం ప్రేక్షకులకు కష్టం.

నేడు క్షేమీ అను వారాంగన మహారాజు బింబిసారుని మనసును అమితంగా ఆకర్షిస్తోంది. రసికులైన యువకులెంతోమంది, క్షేమీ దేవతా శాపం పొందిన కిన్నరో లేక స్వర్గం చేత ఆశ్వీదింపబడ్డ నర్తకో అని అనుకొంటున్నారు. కళ్ళూ, లజ్జా ఆమె ముఖాకర్షణాలు. నాట్యానంతరం, ఆమె కళ్ళు క్రిందుగా వంచినప్పుడూ, స్వయంగా మహారాజు పాదాలచెంత పడ్డప్పుడూ నృత్యాన్ని చూచే ప్రతివ్యక్తీ ఆమెను గౌరవింపగోరుతాడు. వృద్ధుడు, అరసి అయిన మహామాత్యుడు దేవేంద్రుడు సైతం నాట్యమందిరంలో నిర్దోషురాలైన క్షేమీని చూడడానికి వస్తాడు. నేడు అతడు బింబిసారునికి ఒకవైపు క్రిందుగా ఉన్న ఆసనం మీద కూర్చుని ఉన్నాడు. సింహాసనానికి రెండోవైపు అశ్విని దేవతల అవతారం అనతగిన మహారాజు బాలసఖుడు నృత్యావనకుమార భృత్యుడు కూర్చున్నాడు. తక్షశిలా విద్యాపీఠం అతణ్ణి సమర్థుడైన వైద్యునిగా చేసి పంపింది.

క్షేమీ నృత్యం సమాప్తమయింది. కళ్ళు వాలాయి. ఆమె సుందర సుకుమార శరీరం నాట్యమైన తరువాత ఒక చిత్తాకర్షకమైన అభినయంతో మహారాజు పాదాల దగ్గర వాలింది. కాని—

నేడు బింబిసారుడి ఉత్సాహం ఎందుకో క్షీణమైందో తెలియదు. క్షేమీ వినమిత నయనాలు బింబిసారుణ్ణి చూడ్డానికి పైకి లేచాయి. అప్పుడామె విస్మయంతో మాటలుడిగి ఉంది. ఆమె స్వాభిమానం ప్రజ్వలించింది. ఆమెను అలక్ష్యంతో చూడడం అంటే ఆమె సౌందర్యాన్ని క్రూరంగా తిరస్కరించడమే. ఆమెకు ఇంచుకంత కోపం వచ్చింది. 'రసరాజా నేడు అసంతుష్టులవడానికి కారణమేమిటి?' అంది.

ఒకప్రక్క ఆసీనుడై యున్న మహామాత్యుడొక్కడే దీనికి కారణం ఎరుగును.

బింబిసారుడు మందగమనంతో తన శయనాగారంలో ప్రవేశించాడు. శయనాగారానికి క్రిందుగా ఉన్న పెద్ద రాజభవనంలో రాజగాయకుడు మోహిని పుత్రుడు వీణ మీద ఒక చక్కని రాగాన్ని ఆలాపిస్తున్నాడు,



ఇంగితం వైపుకి మనసు మరల్చడానికి రాజు ప్రయత్నింప సాగాడు. కాని అతని హృదయం వ్యధితమైంది.

పదిరోజుల నుండి అతని హృత్తంత్రిపై 'ఆమ్రపాలి', 'ఆమ్రపాలి' అనే నాదం ప్రతిధ్వనిస్తోంది. కోసలదేశపు ప్రసేన జిత్తుడు, కౌశాంబీ కాశీరాజులు మొదలైన రాజులందరూ ఆమ్రపాలిని గురించే చర్చిం చడం అతడు విన్నాడు. రసికత్వానికి ఎప్పుడూ దూరంగా ఉండే మహామాత్యుడు దేవేంద్రుడు కూడా ముఖంలో అసాధారణ మైన భావాన్ని తెచ్చుకొని ఆమ్రపాలినే, ప్రశంసించడం అతడు చూశాడు. నగర శ్రేష్ఠుల దగ్గర పాలిని గురించిన చర్చ తప్ప మరో విషయంలేదు.

ఏడు రోజులయ్యాయి. లిచ్ఛవీయుల నాయకత్వాన్ని వజ్జి భూమిలో గల ప్రజ అంతా మగధను, మగధరాజును తమకు శత్రువులుగ ప్రకటించారు. కాబట్టి ఆమ్రపాలిని గూర్చిన చింత వాళ్ల మన స్సును మరింత వ్యాకులపరచింది. పాలి ఎలా వుంటుంది?

బింబిసారుని సాహస హృదయం పాలిని ఒకసారి చూడ్డానికి తత్తరపడింది. అతని బాల్యస్నేహితులైన సంజయ బ్రహ్మదత్తు లిద్దరూ ఏదో ఉపాయం ఆలోచించడానికి ప్రయత్నించారు. వాళ్ళు వైశాలికి వెళ్ళి ఇంకా రాలేదు. కాబట్టి బింబిసారుని కల

ఆమ్రపాలి

వరం ఉగ్రరూపం దాల్చింది. సౌందర్య ప్రశంస విన్నంతమాత్రాన ఎవరినైనా వెర్రిగా ప్రేమించేవారు మిక్కిలి తక్కువ. ప్రజలు వాళ్ళని కవులని చెప్తుంటారు. కాని పాలిని గురించి విని ఆమెకై ఉన్మత్తులైనవారు లెక్కకు మించి ఉన్నారు. మగధ రాజు బింబిసారుడు వాళ్ళల్లో ఒకడు.

బింబిసారుని ఉచ్ఛ్వాసనిశ్వాసాల్లో ఆమ్ర పాలి ప్రవేశించిందేమో అన్నట్లుంది. అతని పేరులో ఏ యింద్రజాలం ఉందోకాని, అతని పేరు విన్న వారంతా అతనికి రాత్రింబగళ్ళు శత్రువులవుతున్నారు. ఆమ్రపాలీ, ఆమె ఆకర్షణా గొప్ప మహారథుడు సైతం ఆమెతో కలిసి ఉండడమే తనకు గౌరవం అని తలంచు నంతటి ప్రబలంగా ఉంది.

ఆమ్రపాలిని గురించి ఆలోచిస్తూ బింబి సారుడు శయ్య మీద తలనుంచాడో లేదో ముఖ్యద్వారం నుండి సంజయ బ్రహ్మదత్తు లక్కడికి వచ్చి ప్రణమిల్లి కూర్చున్నారు. వారిద్దరినీ చూచి బింబిసారుడు గంతువేసి నిలబడ్డాడు. పాలి సమాచారం వినడాని కాతని హృదయం అతివేగంగా కొట్టుకో సాగింది. అప్పుడా యిద్దరూ ఒకరి నొకరు ఆపుకుంటూ, తగవులాడుతూ వైశాలీ వృత్తాంతం సవిస్తరంగా చెప్ప నారంభిం చారు.

పూర్తిగా ఒక్క జాముసేపు విన్నా బింబి సారునికి ఏమీ విననట్లే ఉంది. చెప్పిన దానినంతా మళ్ళా ఒకసారి చెప్పండని అత డనగా అలసియున్న బ్రహ్మదత్తుడు మళ్ళా చెప్పడానికి సిద్ధపడ్డాడు.

'మహారాజా, ఈ రెండు బాణాల్ని చూశారా? కావలిస్తే మమ్మల్ని చంపగలవు. ఆమె బాణాల వలెనే ఆమె కళ్ళూ, జిహ్వ వాడియైనవే. సౌందర్యానికి సీమయైన ఆ పాలిని గురించి ఏమని చెప్పను మహారాజా! అద్భుతము, ఆమె ఒక దేవి మహారాజా. నేను మూర్ఖుణ్ణి. ఈ సంజయుణ్ణి అడగండి. ఇతను అనేక నాటకాలు చదివేడు. ఎన్నో శాస్త్రాల్ని అభ్యసించాడు. అడిగితే చాలు, పాలిని గురించి వర్ణిస్తాడు.'

సంజయుడు చెప్పడానికి సిద్ధంగానే ఉన్నాడు 'మహారాజా, ఆమెను మాటల్లో వర్ణించడానికి వీలుపడదు. కళ్ళతో చూడందే ఆమెను గురించి కల్పన చేయడం కూడా మిథ్య అవుతుంది.'

బింబిసారు డిద్దరినీ తీక్షణంగాచూశాడు. 'చాలించండిలాంటి మాటలు' అని, వారికి తెలియకుండా మెల్లగా ఒక నిట్టూర్పు విడిచాడు. అనేకసార్లు అడిగిన ప్రశ్నవే మళ్ళీ అడిగాడు 'ఇప్పటికీ పాలి వివాహ మాడలేదా?'

'లేదు మహారాజా!' అని సంజయుడి జవాబునే ఆరవసారి చెప్పాడు.

'పాలి నింతవర కెవ్వడూ వివాహ మాడ లేకపోయాడు' అని అతడు బిగ్గరగా అన్నాడు.


బ్రహ్మదత్తు డిచ్చిన బాణాలు చేతితో పట్టుకొని తిప్పుతూ బింబిసారు డిలా అన్నాడు.


'దీనికి కారణం నిజంగా...'

'అవును మహారాజా, మీరాలోచించేదే.. పాలికి తగినవాడూ, పాలిని పెళ్ళాడు యౌవన సంపన్నుడూ అయిన పురుషుడు ఇక్కడ పుట్టెనో లేదో నేటి వరకెవ్వరూ వినలేదు.

'మహారాజా, రేవా వలన నేనంతా తెలిసి

(45 వ పేజీ చూడండి)





త్వరలో ఆమె లెక్కించదగిన ఆదాయమును కలిగియుండును !

ఇప్పుడు మీ బిడ్డను ఆదాచేయనారంభించనీయండి ఆమెకొరకు స్టేట్ బ్యాంకులో ఒక సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంటును ప్రారంభించండి అమె ఆదాయము పెరుగుచుండజూచుట ఆమెకు ప్రీతి.


రెక్కువల్ల నడపబడే మైనర్స్ సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంట్లను ప్రారంభించవచ్చును

(ఎ) మైనరుకు యుక్త వయస్సు వచ్చేవరకూ అక్కౌంటును నడిపే సహజమైన లేక కోర్టువారి నియమించబడిన సంరక్షకుడు ప్రారంభించవచ్చును యుక్తవయస్సు రాగానే లబ్ధమైనదై తన అక్కౌంటును నడుపుకో నారంభించును

(బి) తామే డిపోజిట్లను వుంచి, సొమ్మును తిరిగి తీసుకొనుచుండగల 14 సంవత్సరములు లేక అంతకు మించిన వయస్సుగల పిల్లలు ప్రారంభించవచ్చును

స్టేట్ బ్యాంక్ సేవ నిమిత్తం

LPE Aiyars S 147 Tu



అప్పుడే ప్రేమించడం మొదలుపెట్టిన అబ్బాయి మనసులో భావాల్లాగా, ఒక్కసారి సినిమా హాల్లో 'క్యూ' పెరిగిపోయింది.

'క్యూ' లో అందరిమొహాల్లోనూ—ఆరో ఏడో అక్షరిచ్చి, ఆ హాలు కట్టించినప్రొప్రైటరుగారి మనసులో అశంత విసుగుంది. అందరిమనసుల్లోనూ వాల్ పోస్టర్మీద హీరోయిన్ నవ్విన నవ్వుంది. అవసరమైతే 'బ్లాక్‌లోనైనా టిక్కెట్టు కొన్తీరా లన్న 'క్యూరియాసిటీ'అందరిలోనూ వుంది. ఎందుకోకాని, వాళ్లందరికీ హీరోయిన్ బొమ్మ చూసేక 'హీరో' తనేనన్న భావం వుంది.

ఆ క్యూలో ముప్పైతొమ్మిదో హీరోగా నిలబడ్డ సుధాకరం సిగరెట్టు వెలిగించి ముందునున్నాయనతో "ఏమిటిసార్! ఇంత డిలే వా? టిక్కెట్లిచ్చేస్తే సొమ్మేం పోయింది? పైగా సొమ్మొస్తుంది. ఔనా సార్! రైటేనా? రెండుకిస్తానన్చెప్పి,రెండున్నరైంది కదా, ఇంకా టిక్కెట్లివ్వక పోవడమేమిటి చెప్పండి. కారణమడిగితే జవాబు చెప్పరు. చెప్పినా చెప్పవలసినటు చెప్పరు. ఏదో తగువైందంటారు. అందువల్ల షో డిలే ఐందంటారు...... మేనేజిమెంటు తెలిపోతే, మానెయ్యాలి....ఏమంటారు?" అని ఆగేడు.

అతనిముందు నిల్చున్నాయనకి నల్లటి వంటిరంగూ, హిట్లర్మీసం వున్నాయి. అవకతవగ్గా కుట్టిన టెర్లిన్షొక్కా జేబులో అయిదు రూపాయల నోట్లు చాలావున్నట్టున్నాయి. కళ్లలో ఎర్రనిషా జీరలున్నాయి. చేతిలో లంకపొగాకు చుట్టుంది. అతను సుధాకరంచెప్పిందంతా విని, చుట్ట నోట్లో పెట్టుకుని దాదాపు లుంగీలావున్న పంచెని మీదకు తోస్కుంటూ, లాయరు వాదన విని తలూసిన జడ్జీలా తలూపేడు.

అప్పుడు సుధాకరానికి చాలా కోపమొచ్చింది. ఆవాటం చూస్తే సంతపాలెం సరుకులావుంది. ఈబైతుకి మేనర్స్ "తెలీదుగాకతెలీదు." అనుకున్నాడతను. "ఇలాటి బ్రూట్స్‌ని బాల్కనీలోకసలు

విలో చేయకూడదు. ఛఛ్" అని కూడా అనుకుని, చుట్ట వాసన భరించలేక,సిగ రెట్టు వెలిగించేడు. 'క్యూ' లో చాలా మంది వాచీలు చూస్కుంటున్నారు. వాచీల్లేనివాళ్లు వాచీలున్న వాళ్లని టైమడిగేరు. "అప్పుడే మూడు దగ్గి రైందా?" అని ఆశ్చర్యపోయేరు. "హు" అని వేడిగా నిట్టూర్చేడు. చాలానిట్టూ ర్పులూ, చాలా సిగరెట్లపొగా కలియడంవల్ల అక్కడంతా వేడిగావుంది. విసుగ్గా వున్నప్పుడు, ఎంత చిన్నవిషయమైనా చాలా బాధకలిగిస్తుంది. కనక—అంత జోరుగా కాయని ఎండకూడా అతివేడిగా వున్నట్టుంది. అందువల్ల అక్కడంతా 'ఇన్‌టాలరబుల్' గానూ, ఇబ్బందిగానూ వుంది.... క్యూలో కొందరు అరుస్తున్నారు. మరికొందరు కూర్చొని వెధవజోకు లేస్తున్నారు. ఇంకా కొందరు ఇంకిపోయిన ఓపికతో ఇష్టంలేనట్టు వంగిపోయినిల బడివున్నారు. వాళ్లందరూ విసుగునీ, ఆశనీ కలిపి కళ్లల్లో వెలిగించుకుంటూ, ఆ కొత్త హాల్లో సినిమాదీపాల్లావున్నారు.

ఒక్కసారిగా సుధాకరానికి 'క్యూ'లోంచి బైటికెళ్లాలనిపించింది. ఆఖరి దమ్ము లాగి సిగరెట్టు పారేసేక, అతనికి సినీ మాలో హీరోయిన్నిచూసేక అడదాహం పట్టుకున్నట్టు, విసుగువల్లో మరెందు వల్లోగాని, చాలా దాహం వేసింది.గొంతు కలో ఏదో బాధ, మనసులో ఇంకా బోలెడు విసుగూ మొలకెత్తి, కలిసి పెరిగి పొంగేయతనిలో.

"ఒక్కమారు బైటికెళ్లొస్తాను. నాప్లేసు కొంచెంచూస్తూంటారా సార్?" అని వెనుకనున్నాయన్ని అడిగేడు సుధాకరం.

వెనుకనున్నాయన సన్నగా నల్లగా ఇందాక పూర్తిప్రాణంవుండి, ఇప్పుడే సగం ప్రాణం పోయినట్టున్నాడు. మరికొద్ది నిముషాల్లో టిక్కెట్లివ్వకపోతే అతవా కొత్తహాలుకి బలైపోయేవాడిలా వున్నాడు. సుధాకరం మాటవిని అతను నీరసంగా తలూపేడు.

సుధాకరం బైటికొచ్చి ఊపిరిపీల్చుకున్నాడు. ఎండలో అతనినీలం టెర్లిన్ చొక్కా విస్తృతమైన నీలిదీపపు కాంతిలా మెరుస్తోంది. అతని వాచీ అతని ఒంటిరంగు లాగే మెరుస్తోంది. అతని ఖరీదైన ఎంబాసిడర్ బూట్లజత ఖచ్చిత మైన కారుచీకటి ఖండంలాగేవుండి, సుధాకరం కాళ్లని కౌగలించుకుని ఖరీ దైన ప్రేమతో కరుస్తూ, మెరుస్తోంది.

ఇంతలో సడన్‌గా అనుకోకుండాఅతని కళ్లూ—రాదనుకున్న హీరోయిన్ వస్తే, ఆమెను చూసిన హీరో కళ్లలామెరిసేయి, అందుక్కారణమైన "రత్నమాల" అతని క్కాస్త దూరంలో కేంటిన్‌కిబాగా దగ్గిరలో తెల్లని టెర్లిన్ చీరలో,తెల్లగా రత్నంలా మెరిసింది.

* * *

రత్నమాల ఎమ్మే చదువుతోంది. సుధా కరానికీ, క్లాసంతటికీ రత్నమాలంటే చాలాఇష్టం. రత్నమాలతో బాటే 'ఎమ్మే ఎకనామిక్స్' చదువుతున్న సుధాకరం సాధార ణంగా క్లాసుకి మానకుండా వెళ్లడానికి గల అతిఅందమైన కారణం ఆఅమ్మాయి.

రత్నమాలెప్పుడూ టెర్లిన్ చీరలేకడు తుంది. ఎప్పుడూ మెళ్లో ఇమిటేషన్ రత్నాలమాల వేసుకొంటుంది. చాలాఅంద మైన అమ్మాయి. ఎంతందంగా నవ్వాలని రూలుందోఎప్పుడూ అలాటి అందమైన నవ్వులే నవ్వుతుంది. ఎప్పుడూ స్క్వేర్ వాచీనేకట్టుకుని, మాటిమాటికీ అవాచీ వైపే చూస్తూంటుంది. ఎప్పుడూలా అమ్మాయి చాలా అందంగావుండి, 'అబ్బాయిలు కోరుకొనే అమ్మాయి'కి ఎగ్జాంపుల్‌గా వుంటుంది.

సుధాకరం రత్నమాలతో ఎప్పుడూ నోటితో మాట్లాడలేదు. కళ్లతోచాలా సార్లు మాట్లాడేడు.రత్నమాలకళ్లుచాలా నాజూగ్గా అందంగా వొంపులుతిరిగిమాట్లాడ గలవు. అందువల్ల సుధాకరానికి రత్న మాలకళ్లంటే చాలాఇష్టం. ఆమెకళ్లని చూస్తూంటే టెక్నికలర్ నీళ్లలో చాలా అందంగానూ గర్వంగానూ గెంతులు వేస్తున్న రెండు తోకల్లేని చేపలు గుర్తు కొస్తాయతనికి. రత్నమాల కళ్లక్కూడా సుధాకరం కళ్లంటే ఇష్టమేనవి సుధాకరం కళ్లూ, మనసూ అనుకుంటాయి. ఎందు వల్లంటే రత్నమాలకళ్లు సుధాకరాన్ని చాలామార్లు పరీక్షగా చూసి నవ్వి సుధా కరం మనస్సుని ముద్దు పెట్టుకొని చూపుల్నక్కడే వదిలేసి వెళ్లిపోతాయి.

ఆమెతో ఎప్పుడూ మాట్లాడకపోయినా అతనికి రత్నమాల తనని దాదాపు ప్రేమిస్తోందని తెలుసు. ప్రేమను సూచించే చూపులు వేరేవున్నాయి. ఆనవ్వులు వేరేవున్నాయి. ఆభావాలు వేరేవున్నాయి. ఆచేష్టలువేరే వున్నాయి. ఆ"వేరే"ప్రేమ" చూపులూ, నవ్వులూ, ఇలాటివన్నీ రత్న మాల రమ్యంగా సుధాకరంకోసం ప్రద ర్శిస్తుంది. అమ్మాయి కనక ధైర్యంగా చెప్పలేక పోయినా ఆమె అతన్నిఅతిగాఢంగా ప్రేమిస్తోంది......... ఆసంగతి సుధా కరానికీ తెలుసు.

ఇంకా పదకొండు మందో ఎందరో అమ్మాయిలు కూడా అతన్ని ప్రేమిస్తు నట్టుగా అతనికి తెలుసు గాని, అతను కూడా రత్నమాలని అంతఅందంగానూ ప్రేమిస్తుండడంవల్ల, రత్నమాలని తల్చు కున్నప్పుడల్లా, చాలాహాయిగా, గర్వంగా మెరిసే రత్నం లాటి భావంఅతని మనసు చుట్టూ మరి వదలనన్నట్టు ముసురు తుంది. అలాజరిగినప్పుడల్లా అతను మన సుని కమ్మేసిన రత్నంలాటి పారవీడన్ని స్మృతుల ఛాయలో చూస్కొని చాలా సంతోషంగా ఫీలవుతాడు.

ఎప్పుడైనా రత్నమాల నోట్సడుగు తుందేమోనని అన్నినోట్సులూ రెగ్యులర్‌గా రాస్తాడు సుధాకరం. మార్కెట్లో దొరికే మామూలు పుస్తకం దగ్గిర్నించి, 'మార్షల్ ఎకనమిక్స్'దాకా అన్నిపుస్తకాలనీ అతను తనదగ్గరే వుంచుకుంటాడు. ఎందుకంటే ఎప్పుడైనా రత్నమాల ఏపుస్తకమైనా అడుగుతుందేమోనని. కాని రత్నమాల అవేవీ అతన్నెప్పుడూ అడగలేదు. మాట్లాడ లేదు. ఇరవైమూడు సార్లో ఎన్నిసార్లో నవ్వింది. ఒసారితను సరికొత్త మోడల్ షర్టు వేస్కుంటే, ఆషర్టుపక్క అవేళ్ల

దాహం

ఎనిమిదిసార్లో, పదిహేడుసార్లో చూసింది. ఓసారి క్లాసులో ప్రొఫెసర్ గారడిగిన ప్రశ్నకతనుచాలా తీవిగానూ, కరెక్ట్‌గానూ జవాబుచెప్తే, అతనిప్రక్క నూర్నల్ ముని మనవరాల్లాగా చాలా 'ఎప్రిషియేటివ్' గానూ, ఎంకరేజింగ్‌గానూ చూసింది.

అప్పట్నించీ సుధాకరం కేంద్రమంత్రి వర్గం దగ్గిర మొదలెట్టి, ఫెమినా బ్యూటీ కంటెస్ట్‌మీదుగా వెళ్లి, ట్విస్ట్ డాన్స్ స్టెప్స్ మీదుగా జారి, చివరికి క్రికెట్ స్కోరుదాకా— అన్నీ కంఠతా పెట్టి, "అమ్మాయిలు అసాధ్యులు గురూ! అప్పడాల దగ్గిర్నించీ అరాచక ప్రభుత్వంవరకూ, వాళ్లకన్నీ ఇంట్రెస్టే. తమేమని మన్ని అడిగేస్తూంటారుసుమా!" అని అతని కెవరో చెప్పేరు. ఎప్పటికైనా రత్నమాల తనని టెస్ట్ చెయ్యడానికి ప్రయత్నిస్తుందేమోనని చాలా ఆత్రుతగా ఎదురుచూసేడు. కాని రత్నమాల ఒకన్ను వేవీ అడగలేదు. అందువల్ల అతని నాలెడ్జంతా చెవిటి అమ్మాయి దగ్గిర పాడిన ప్రేమ గీతంలాగ వేస్టైపోయింది.

రత్నమాలకోసమే పెంచుకున్న ప్రణయ వృక్షంతా అతని ధైర్యంలేని తనమనే పొర వెనుక చిన్నబోయి, రత్నమాలదయలేనితనం, ప్రేమవున్నా, అప్పైన ఆమె కవ్వింపుల మెచ్చదనం అనే గోడ మధ్య ఇరుక్కుపోయింది.

* * *

కాని, ఇన్నాళ్ల నిస్పృహ తరవాత, పగిలిన మబ్బులోంచి వచ్చని మెరుపులాగ రత్నమాలతో మాట్లాడడానికి, ఆమె మనసు కింకా సన్నిహితుడు కావడానికి, సుధాకరానికి అవకాశం వచ్చింది.

సుధాకరం వెంటనే ఆలస్యం చెయ్యకుండా, రత్నమాల దగ్గిరికివెళ్లి, నిలబడి "హలో" అనబోయేడు.

కాని, అదే క్షైముకి రత్నమాల అతని పక్క చూడడంవల్ల, అంతేకాక అతనా కళ్లలోకి చూడటంవల్ల, అతను—సిసిమానీ, ప్రపంచాన్నీ, రత్నమాలనీ, పలకరిద్దామనుకున్న తన ప్రయత్నాన్నీ, అఖరికి తన

దాహాన్నీ కూడా మరిచిపోయేడు.

రత్నమాల కళ్లలో మేగ్నటిజం లాటి మెరుపులున్నాయి. వెలిగిన చంద్రుడి వెనక వెచ్చగా పరుచుకున్న తొలి ప్రణయపు పచ్చని నీడలన్నీ ఆమె చూపుల్లోనే పొంచి, సుధాకరం వైపుమాత్రమే తొంగిచూస్తుంటాయి.

సుధాకరం ఆలోచనలూ, మనసూ— అన్నీ అటే వెళ్లిపోవడంవల్ల, అతను అలాగే నిలబడిపోయేడు. అలాగతను ఆ సినిమా ఆడినన్నిరోజులూ వుండిపోగలడు. కాని రత్నమాలమాత్రం సుధాకరాన్నిగుర్తించి "హలో" అంది.

ఒక వంద వీణలు, వెయ్యి గిటార్‌లు, లక్ష సితార్‌లు—ఇవన్నీ కలిసి చాలా అందంగానూ, శ్రావ్యంగానూ పలికించిన ఆ అతి అద్భుతమైన స్వరంవిని, సుధాకరం కొద్ది క్షణాలపాటు బెదిరి.....అన్నీ జ్ఞాపకం తెచ్చుకుని, "హలో" అన్నాడు.

"సినిమాకె వచ్చేరా?" అనడిగింది రత్నమాల.

"మరెక్కడికి? సినిమా హాల్లో కనబడితే, మరి సినిమాక్కాక కథకనుకున్నావా?" అని, మరెవరైనా అడిగుంటే ఆ ప్రశ్నకి సమాధానం చెప్పేవాడే సుధాకరం. కాని.....అడిగింది రత్నమాల.....మరొకరూ మరొకరూకాదు.....రత్నమాల.......అందువల ,

"అవునండీ. సినిమాకే. మీరూ సినిమాకేనా?" అన్నాడు సుధాకరం.

"వూ!" అని తలూపి, "అబ్బ! ఏం రష్షండీ ..... నాకు టిక్కట్టు దొరుకుతుందో లేదో తెలీదు.....ఐ డవుట్...... అసలె లేడీస్‌కి సెపరేట్ బుక్కింగ్ లేదు కూడాను....." అంది రత్నమాల.

ఏమిటి? రత్నమాలకి టిక్కట్టులేక పోవడమా? అది సినిమా దురదృష్టం..... రత్నమాలింకా టిక్కెట్టు తీసుకోలేదు. అది తన అదృష్టం. టిక్కెట్టు దొరుకుతుందన్న ఆశ ఆమెకిలేదు. తనక్యూలో వున్నాడు.... మనిషికి రెండు టిక్కట్లిస్తారు. చాలు......! వంద టిక్కట్లిచ్చినా తన కక్కరలేదు. రెండే రెండు టిక్కట్లు

దాహం

కోపం తను ఎన్ని ఇక్కట్లైనా సహించ గలడు. రెండే టిక్కట్లు చాలు. జీవిత మంతటికీ ఈ ఒకే ఒక సినిమా చాలు. సినిమా హాల్లో తను వేయబోయే చాలా జోకులకి రత్నమాల నవ్వబోయే రెండే రెండు నవ్వులు చాలు.....చాలు....''

చెదిరిపోయిన మనసుగల సుధాకరం వెంటనే సర్దుకొని - రత్నమాల టిక్కట్టు కావాలంటే "తప్పకుండా తెస్తాను. విత్ యువర్ ప్లెజంట్ పెర్మిషన్" అన్నాడు. రత్నమాల వెంటనే ఒప్పుకుంది. "ప్లీజ్ వెంటనే వెళ్ళండి మరి. ఫస్ట్ సాంగ్ మిస్సవులే లాభంలేదు. రఫీ సాంగండి! మార్వెలస్ సాంగ్... వెళ్ళండి సుధాకరంగారూ.....వెళ్ళండి మరి" అందామె చాలా కంగారుగానూ, అందంగానూ.

"తెస్తాను. ఇదిగో వెళతాను. కాని నాదో చిన్న రిక్వస్ట్. నాకు చాలా దాహంగా వుంది. అందువల్ల మీరు డ్రింకోటి తీసుకోవాలి" అన్నాడు సుధాకరం జోరుగా.

అప్పుడు దోసెడు రత్నాలని గజం ఎత్తునుంచి గలగలా ఒంపినట్టు రత్నమాల నవ్వింది.

ఆ నవ్వు చూడగానే సుధాకరం చాలా గాభరా పడ్డాడు. అదికాక అతనికో కొత్త విషయం తెలిసింది. రత్నమాలకి పై వరసలో. నవ్వినప్పుడు కనబడే నాలుగో పన్ను కాబోలు లేదు. (ఎప్పుడైనా రత్నమాల మరీ అందంగా నవ్వినప్పుడు రత్నంలా రాలిపోయిందేమో!) ఆమె అంత అందంగానూ, అంత జోరుగానూ, అంత విందుగానూ నవ్వినప్పుడు ఆ పన్నులేనితనం స్పష్టంగా తెలిసింది. ఆమె అలా నవ్వుతూంటే ఆ పన్ను లేకపోవడంవల్ల చాలా అందం — ఆ పన్ను వుండివున్నా ఉండని అందం. ఆ నవ్వుతోబాటు నవ్వింది!...ఆ పన్ను లేకపోయినా ఆ నవ్వు, పదో, పన్నెండో రత్నాలుపేర్చి, మధ్యలో వో రత్నపుమేరకు ఖాళీ వదిలేసినట్లు చాలా బావుంది. సగం చంద్రుడువుండి, సగం చంద్రుడు మాయమైపోయినా సగంలేని చంద్రుడు కూడా చాలా అందంగా వున్నట్టు ఒక పన్ను లేకపోయినా రత్నమాల నవ్వు చాలా అందంగావుంది.

ఆ నవ్వునిచూసేక, సుధాకరం తన్నెవరో మేఘాలమీదికి తీసుకువెళ్ళి, మెరుపులమధ్య పడవేసినట్టూ, ఆ మెరుపులమధ్య తనూ వో మెరుపై మెరిసి మళ్ళీ ఒక్కసారి ఉల్కలా భూమ్మీదకు జారిపోయినట్టూ ఫీలయేడు.

రత్నమాల నవ్వాపేసి, "పదండి"అంది. ఇంతకూ ఆమె ఎందుకు నవ్విందో సుధాకరానికి అర్థంకాలేదు....తను క్రాఫింగు దువ్వుకోడం మరిచిపోయేడా? లేక జుత్తు చెరిగిపోయిందా? ఊహు! అయ్యుండదు. తన జుత్తు చెరిగిపోయినా బావుంటుందని బి. ఏ. లో ఉన్నప్పుడు పద్మిని కాబోలు చెప్పింది. ఆ రోజుల్లో ఆమె తన జుత్తు అదెవరో హీరో జుత్తులాగే ఉంటుందని క్లాసమ్మాయిలందరి తరఫునా తురుఫు కొట్టినట్టు వొక్కిచెప్పింది....మరేమిటై ఉంటుంది?......పోనీ అడిగితే.....

కేంటిన్ దగ్గిర డ్రింకు సగం తాగి, "ఏవండీ! ఇందాక ఎందుకలా నవ్వేరు?" అనడిగేడు సుధాకరం.

రత్నమాల అతనివక్క చాలా క్యూరియస్‌గా చూసింది. "ఫీలయ్యేరేంటి కొంపతీసి? సారీ.....ఏంలేదు....మీకు దాహం వేస్తే నేను డ్రింకు తాగడమేవిటండీ?" అంది. అని, ఆగి, వో నాలుగు సెకెండ్లు మళ్ళీ లేని నాలుగోపన్ను కనబడేటట్టు వాజూగ్గా, నవ్వి, "సినిమా టిక్కట్టుకోసం క్యూలో నిలబడి ఇంత అలిసిపోయేరు కదా! రేప్పొద్దున్న యుద్ధానికి వెడితే ఏం చేస్తారూ? అని. అప్పుడు మీ డ్రింక్ తాగడానికి కంపెనీ ఎవరొస్తారూ అని." అంది.

రత్నమాల జోకు వేసింది కనక సుధాకరం నవ్వేడు. నవ్వి, డ్రింకు తాగడం పూర్తి చేసి తన బాటిల్ కేంటిన్‌లోపలికిచ్చేసి, రత్నమాల డ్రింకుతాగేయగానే ఆ బాటిల్ అందుకోడానికి చెయ్యి జాచేడు. అప్పుడు చల్లని డ్రింకుబాటిల్‌తోబాటు, రత్నమాల చేతివేళ్ళు కూడా చల్లగా, హాయిగా అతని చేతివేళ్ళకి తగిలేయి. రత్నమాలకంగారు

పడలేదు. తన చేతినలాగేవుంచి సుధాకరం పక్క మాటిగా చూసింది. సుధాకరం చాలా కంగారుపడ్డాడు. ఎందుకోగాని, ఆమె చేతిలో తన చెయ్యి చిక్కుకొని, బిగుసుకున్నట్టు ఫీలై వెంటనే బోటిల్‌ని ఆమె చేతి లోంచి తీసుకొని కేంటిన్ వాళ్ల కిచ్చే సేడు. "నేనిస్తాను" అని హేండ్‌బ్యాగ్ లోంచి డబ్బుతీయబోయిన రత్నమాలని వారించి, తనే డబ్బిచ్చేసేడు. అప్పుడెందుకో గాని, రత్నమాల హేండ్‌బ్యాగ్‌లోంచి తీసిన తన చేతివైపు చూస్కోడం, తిరిగి సుధాకరం చేతివేపుకూడా చూసి, నిట్టూర్చడం అతను గమనించలేదు. కాని అతనంత త్వరగా డ్రింక్ బాటిల్ తీసుకోడం, ఆమె చేతిని వదిలేయడంవల్ల, ఆమె కొంచెం విసుక్కుని, విచారంగా ఫీలైంది.

ఇంతలోనే "చూసేరా? లైవై పోయింది. నేను వెళ్లి టిక్కట్లు తీస్కొస్తాను" అని ఆమెకి మాటాడ్డానికి కూడా అవకాశం ఇవ్వకుండా సుధాకరం వెనక్కి తిరిగేడు.

"ప్లీజ్. ఐల్ బి వెయిటింగ్ ఫర్ యూ" అంటూ అతని ముందుకొచ్చి ఐదు రూపాయల నోటివ్వబోయింది. రత్నమాల. "నో నో! ప్లీజ్ వెయిట్" అని మాత్రమే చెప్పి, ఆమె చూపులవెనకదాగున్న అతి సొగసైన భావాలని తీసుకొని, ఐదు రూపాయల నోటు నామె చేతిలోనే వదిలేసి గబ గబా క్యూ దగ్గిరకి నడిచేడు సుధాకరం.

జోరుగానూ, ఆత్రుతగానూ వెళ్లి క్యూలోని తనచోటులో నిలబడబోయేడు. కాని "సార్ (మేడం!) ప్రేమకి భువిలో అన్నీ ఆటంకాలే. పచ్చగా ప్రేమతో వెలుగుతున్న అబ్బాయిని చూస్తే అందరికీ జెలసీవే. అందరి చూపులూ, విషపు చూపులుగామారి, (ఎవరో, మీలాటి ఎక్స్‌పెక్షన్స్‌వి తప్ప) చొచ్చుకొని గుచ్చుకుంటాయి.

అందువల్లే ఇందాక సుధాకరం ముందునున్నాయన— "మీ ప్లేసులేదు. ఎగిరిపోయింది" అన్నాడు.

"ఏం! నేనుదాహంవేస్తే అలావెళ్లేను. చెప్పి వెళ్లేనుగా. ఈ ప్లేసునాదే. నావెనకనున్నాయన్ని అడగండి"అని వెనక్కిచూసేడు సుధాకరం. వెనుక నుంచున్న ఇందాకటాయన ఇప్పుడు అక్కడలేదు. వోపిక తోబాటు చచ్చిపోయి ఎప్పుడో వెళ్లిపోయుంటాడు.

"మీదేంటేమిటి? తెలీకడుగుతానూ, రిజర్వేషను చేయించేరా? బావుందండోయ్! మధ్యలోవెళ్లి, మేమూ షికారు కొట్టి, అమ్మాయిల్తో డ్రింకులు తాగగలం ఒళ్లు తెలీకుండావుంటే. ఇదేం సినిమాహాలా, ఇల్లా? వెళ్లండి! అయ్యా వెళ్లండి మరి.." అన్నాడు హిట్లర్‌మీసం ఒగరుస్తూ.

అప్పుడు సుధాకరం కోపంతో ఇందాకటి డ్రింకులా పొంగేడు. తనతోబాటు వాడు రత్నమాలని కూడా అలా అనడంతో చాలా కోపంవచ్చి, "మర్యాదగా మాట్లాడవయ్యా. బి హేవ్ యువర్ సెల్ఫ్" అన్నాడు.

అమాట వినగానే హిట్లర్ మీసం "ఓస్! చాల్చాల్లేవయ్యా! నాలుగు ఇంగిలీసు ముక్కలు పేలగానే సరా! ఉన్నమాటంటే కోపం ఒకటా.....వెళ్లేళ్లు... మళ్లీ మాట్లాడకు....చాలా మందిన్చూసేను కాని, మరి మాట్లాడకుండా వెళ్లు..... మరో డ్రింకుతాగి, ఇంటి కెళ్లి బజ్జో" అన్నాడు. అని, చాలా విట్టీగా మాట్లాడే ననుకొని అందరిపక్కాచూసి, సగర్వంగా నవ్వేడు.

అప్పటికే చాలామంది ఇటే చూస్తున్నారు. వాళ్లలో హిట్లర్‌మీసం బ్రాండు గాళ్లు సుధాకరం పక్క వెటకారంగాచూసి నవ్వేరు.

ఆ వెంటనే సుధాకరానికి చాలా ఆవేశం ఇందాకటికోపంతోబాటు కలిసి, పెరిగింది. అతను కోపంగా, చాలాకోపంగా చెయ్యెత్తి హిట్లర్‌మీసం దవడమీద ఒక్కదెబ్బ కొట్టబోయేడు.

అప్పటికే బుకింగ్ వోపెన్ చేసేరు. జనం ముందుకు వెళుతున్నారు. ఐనా చాలా మందికి క్యూలో సినిమాలే వచ్చడంవల్ల ఇటే చాలా ఆసక్తిగా చూస్తున్నారు. క్యూలో లేని పైవాళ్లూ, మిగతా టిక్కెట్లవాళ్లూకూడా "ఈ ఎంటర్‌టెయిన్‌మెంటు బావుంద"ని ఇటేచూసి, ఇక్కడికే రావడం మొదలెట్టేరు.

హిట్లర్ మీసానికి కూడా కోపంవచ్చి అతనూ చెయ్యెత్తాడు.

కాని, ఇంతలోనే అతి సడన్‌గానూ, అతి వేగంగానూ, ఎవరిమీదా దెబ్బలు పడకుండానే హాలు మేనేజరుగారు అక్కడ ప్రత్యక్షమయేరు. అంతే, వాళ్లిద్దరికీ సర్ది చెప్పి, సుధాకరంతో స్పెషల్‌గా ఎవరూ వినకుండా పక్కకి తీసుకువెళ్లి, "అదేంటి సార్! ఆయనతో మీకేమిటి? చదువుకున్నవారుకదాసార్! ప్లీజ్ డోంట్ బీ ఇరిటేటెడ్" అని చాలా చల్లగా, డ్రింకుబుడ్డీ అంత చల్లగా చెప్పేరు.

ఆ తరవాత హిట్లర్ మీసానికికూడా "వాళ్లు స్టూడెంట్సు కదాసార్! వాళ్లతో మనకి తగువెందుకు చెప్పండి. వాళ్లసలే కోపంవస్తే మంచివాళ్లుకారు. ఏదైనా గొడవైతే మీకూ, మా కొత్త హాలుకీ కూడా డేమేజి తప్పదు. అందువల్ల నా మాట విని దయవుంచి వూరుకోండీ" అని చెప్పేక, సుధాకరానికి తిరిగి క్యూలో పాత ప్లేసిప్పించి నిష్క్రమించేరు మేనేజరు గారు.

"హుఁ! ఎవరికోసం? రత్నమాల సినీమాకివస్తే, ఎవరికోసం ప్లేసిప్పిస్తారు? నన్నూ, రత్నమాలనీ మరెవ్వరూ విడదీయలేరుగాక విడదీయలేరు" అని ఇంకా ఆవేశంగానూ, అందంగా చాలా అనుకున్నాడు సుధాకరం. చాలా ధైర్యంగా, అందరు శత్రువుల్నీ చంపేసిన అరివీర భయంకరుడిలాగ కదలడం ప్రారంభించేడు.

క్యూతోబాటు కదుల్తూ అతను రత్నమాల పక్క చూస్తూనే ఉన్నాడు. రత్నమాలా, అతని పక్క చాలా అందంగా ఎప్రీషియేటివ్‌గా చూస్తూనేవుంది.

తనపక్కసీట్లో కూచోబోయే రత్నమాలనీ, తననీ, తన ప్రేమకు మొదటిమెట్టునీ తా మిద్దరూ కలిసి ఎక్కబోయే బాల్కనీ తలుచుకుంటూ ముందుకు కదులుతున్నాడతను. అప్పు డతనిలో చాలా అందమైన

ఆలోచనలు అదుపు లేకుండా అలుము కుంటున్నాయి.

"రత్నమాలలేని నా జీవితంలో ఇప్పటి దాకా, రత్నంలాటి కొత్త వెలుగు లేనేలేదు.... ఇన్నాళ్ళకి, ఈ చల్లని స్మృతినీడలో నియంతలా సంచరించి, కడుపునిండా తిని పరుపు నిండా పడుక్కుంటాను. అనురాగపు చరిత్రలో మాపేర్లను రత్నాక్షరాలతోరాస్తారు" అని అనుకున్నా డతను. ఇంకా చాలా అనుకోబోయేలోపున హిట్లర్‌మీసం టిక్కట్టు తీసుకుని పక్కకి వెళ్ళిపోయేడు.

అందంగా వణుకుతున్న గుండెల్తో, జేబులోంచి పది రూపాయల నోటుతీసి కౌంటర్‌లో పెట్టి, "టూ టిక్కెట్స్ ప్లీజ్" అన్నాడు సుధాకరం. అని అక్కణ్ణించే రత్నమాలపక్క మళ్ళీచూసేడు. కేంటిన్ దగ్గిర నిలబడి తన పక్క చూస్తున్న రత్నమాల, తన పక్కనే కూర్చోబోయే రత్నమాల చాలా అందంగా కనబడుతోంది. ఎవరెస్ట్ ఎక్కుతున్న పర్వతయోధుడికి సగం దూరంనించి మంచుకొండ మధ్యభాగం కనిపించినట్టు, రత్నమాల సుధాకరం కళ్ళకి తెల్లచీరలో మంచుకొండలాగే చాలా మనోహరంగా కనిపించింది. అత సదృష్టంలాగే చాలా అందంగావుంది. ఎన్నో కష్టాలనుభవించేక స్వయంవరంలో వరించబోయే రాజకుమారుణ్ణి రాజకుమారి పదడుగుల దూరంనించి చూసి నవ్వినట్టు నవ్వుతోంది.

వెనక మన్నాయన తొందర చేయడంతో బుక్కింగ్‌లోకి చూసేడు సుధాకరం. అతని పక్కే చూస్తున్న బుకింగ్ క్లర్కు, "సారీ సార్! టిక్కెట్స్ ఆర్ వోవర్" అన్నాడు.


సుధాకరానికి మొదట-అర్థమవలేదు. అత న్నిర్మించుకున్న రత్నాలమేడ దిగేసరికి అతనికి చాలాసేపుపట్టింది. అర్థమయేక పక్కకి తిరిగి పైకి వచ్చేసేడు. దగ్గిర్లోనే హిట్లర్ మీసం నిలబడి మీసం దువ్వుకుంటున్నాడు. ఆ సమయంలో హిట్లర్ మీసం సుధాకరానికి హిడింబి తమ్ముళ్ళా కనబడ్డాడు. చాలా సిగ్గు, విచారం వేసినా అతనికేం చెయ్యాలో తోచలేదు.

అతని గుండెల్లోనలి తియ్యనిభావాలన్నిటినీ ఎవరో నిస్పృహ, నిరాశలతో లోషన్‌లు వేసి కడిగేస్తున్నారు.

మళ్ళీ ఎందుకోగాని విపరీతమైనదాహం వేసి, గొంతుక పట్టుకున్నాడు సుధాకరం.

ఏంచెయ్యాలో తోచక రత్నమాలపక్క చూడలేనట్టు చూసే డతను.

రత్నమాల ఇందాకటిలాగే తెల్లనిటెర్లిన్ చీరలో, రమ్యమైన రత్నంలా మెరుస్తూ—చాలా అందంగా రత్నాలుపేర్చి, మధ్యలో ఒక రత్నం మరిచిపోయినట్టు నవ్వుతోంది. ●



జరిగిన కథ

తోటమాలి భార్య సింహాచలం తలలో నుంచి జారిపడిన ముద్దమందార పువ్వు వాసును గతంలోకి తీసికెళ్తుంది. గోపాలపురం బదిలీ అయిన వాసు యింట్లో పనిమనిషిగా ప్రవేశించిన సింహాచలం కొద్దికాలం తర్వాత అతని జీవితంలో కూడా ప్రవేశిస్తుంది. రహస్యంగా జరిగిన వారి కలయికను విధి బయట పెట్టబోతున్నదని తెల్సుకున్న సింహాచలం వాసును ఆ ఊరు వదిలి వెళ్ళవలసిందిగా ప్రార్థించటమే గాకుండా అతని పేరును కూడా బయట పెట్టనని వాగ్దానం చేస్తుంది. వాసుకు వివాహం అయి చాలా సంవత్సరాలు కాల వాహినిలో కొట్టుకుపోతాయి. తనకు సాయం చేస్తున్నదిభాస్కరం అని అనుకున్న రవణ ఆ యువ కుటుంబాన్నంతా చూడాలని ఉబలాటపడ్తాడు. కట్టుకథచెప్పి రవణను ఆ ప్రయత్నంనుంచి విరమింపజేస్తాడు భాస్కరం.

6

నేను నిట్టూర్చాను.

ఒక్క అబద్ధాన్ని కప్పిపుచ్చడానికి ఎన్ని అబద్ధాలాడాలో! ఏమిటో నా జీవితం! తెగిన గాలిపటంలా ఎక్కడ ఎప్పుడు ఏ పొదలో, ఆపదలో చిక్కుకుంటుందో!

"ఏమిటాలోచిస్తున్నావు" అన్నాడు భాస్కరం.

"ఆలోచించడానికే వుంది బూడిద. ఒక్క అబద్ధాన్ని కాయడానికి ఎన్నివేల అబద్ధాలాడాలో అని అనుకుంటున్నాను." అన్నాను. నాతోపాటు అతనూ నిట్టూర్చాడు.

"మరో విశేషం జరిగింది" అన్నాడు.

"ఏమిటి" అన్నానాత్రంతో

మా సూర్యానికి, రమణకి మంచి స్నేహంట. ఎలాగ కలిసిందో. ఓనాడు నేను బజారునుంచి వచ్చేసరికి మాయింట్లో రమణ, సూర్యం కలిసి కబుర్లు చెప్పు కుంటున్నారు. నన్ను చూసి అతను, అతన్ని చూసి నేనూ ఆశ్చర్యపోయాము. ఈ సంగతంతా అతను సూర్యానికి చెప్పాడనుకుంటాను. సూర్యం సుమతితో చెప్పుంటాడు. సుమతి నన్ను అడిగింది. నాకు దిక్కుపడినట్లయ్యింది. "ఏం? మీరేదో అంత పెద్ద ఘనకార్యం వెలగబెట్టున్నారని నేను తెల్సుకోకూడదా! అంత పెద్ద జమిందారెవడు బాబూ. మా వాసు కాదుకదా. అతనికి ఒక్కడేగా కొడుకు పైగా వైజాగ్‌లో చదువుకుంటున్నాడు కాదూ" అనడిగింది. ఆలస్యం చేస్తే సుమతి నిజాన్ని పసికట్టేస్తుందేమోనని భయంవేసి ఆదాత వేరే వ్యక్తి పొమ్మని బుకాయించేసరికి ప్రాణం పోయిందనుకో" అన్నాడు.

"నిన్ను చాలాశ్రమ పెడుతున్నాను భాస్కరం, నన్ను క్షమించాలి" అన్నాను. భాస్కరం నాకేసి ఆశ్చర్యంగా చూసి, "ఏమిటా వెర్రి! ఇందులో శ్రమాలేదు. ఫలితమూ లేదు. నా పనులు నేను చూసుకోటం లేదూ. లేనిపోని చాదస్తాలు పెట్టుకుని, బుర్ర పాడుచేసుకోక...లేలే.. పోదాం" అన్నాడు నా భుజం తట్టి. నేను యాంత్రికంగా లేచాను. ఇద్దరం ఇసకలో నడుస్తూ మౌనంగా కారు చేరుకున్నాము. కారు స్టార్టు చేశాను. నా మనస్సులో వున్న కోర్కె బయట పెట్టాలనిపించింది. రమ

జను చూసి ఐదేళ్లకు పైగా అయ్యింది. అతన్ని చూడాలని చాలాసార్లు అనిపించినా, ధైర్యం చాలక, కోర్కె క్షీణించిపోయింది. అలాంటి దీసారి కోర్కె విజృంభించి, అధికమయ్యింది. "భాస్కరం, రమణను చూడాలని వుంది. అయితే నేను అతని కంటపడలేను. నాకా ధైర్యంలేదు. అతన్ని ఎక్కడకైనా తీసుకువస్తే దూరాన్నుంచిచూస్తాను" అన్నాను.

"తప్పకుండా" అన్నాడు భాస్కరం.

కారు దిగి యింట్లోకి వెళ్లేసరికి సుమతి మమ్మల్ని చూసి, "ఇంతవరకూ ఆ రమణన్న తను మీ కోసం కాచుక్కూచున్నాడు. ఇప్పుడే వెళ్లారు" అంది. నా గుండె దడదడలాడింది. సుమతి నాకేసి చూసి, "నువ్వా రమణన్నతన్ని చూడాలోయ్. అచ్చు నీ పోలికే అనుకో. పాతికేళ్ల ముందు నీ ఫోటో చూస్తే యీ నాడతను తీయించుకున్నాడేమో అనిపిస్తుందిస్మీ" అంది. నేనామె ముఖం చూడ్డానికి భయపడ్డాను. "ఆహా అలాగా యీ సారి వచ్చినపుడు చూడాలి" అన్నాను తప్పనిసరిగా.

* *

రాత్రి భోజనాలయ్యాక మేడమీద పక్కలమీదకు చేరాము. భాస్కరం నా మంచంమీద కూర్చుని, "పోనీసూర్యాన్ని నువ్వే అడిగి చూడకూడదూ, నువ్వంటే వాడికి గౌరవమూ, భయమూ, భక్తీ అన్నీ ఉన్నాయి. ఏమంటావ్?" అన్నాడు.

నేనేమంటాను. నాకామాత్రం ధైర్యం వుంటే నా జీవితం యిలా తగులడునా.

"ఏం? పోన్లే.....నేనే ప్రయత్నిస్తాను" అన్నాడు భాస్కరం నీరసంగా. భాస్కరం బాధ పడడం నాకు యిష్టంలేదు. అడిగి తీరాలని నిశ్చయించుకుని, — "ఎప్పుడడగమంటావు? ఇప్పుడే అడిగేస్తే మంచిదంటావా" అన్నాను. భాస్కరం ముఖం కళకళ్లాడింది. "నీ యిష్టం. ఎప్పుడయినా సరే" అన్నాడు. ఇలాంటి విషయాలు రాత్రి పూటే అడగాలనిపించింది నాకెందుకో.

"ఇప్పు డడిగితే నేనలాగ ప్రొఫెసరుగారింటికి వెళ్లినట్టు వెళ్తాను. కాస్సేపు కూర్చుని వస్తాను. ఈలోగా నువ్వు అడిగెయ్" అన్నాడు. "సరే" అన్నాను నేను. భాస్కరం లేచి వెళ్లబోతూ, ఆగి, వెనక్కువచ్చి, "జాగ్రత్తసుమీ, వాడసలే పొగరుమోతు" అని వెళ్లిపోయాడు. నేనో అయిదు నిముషాలు, ఎలా, ఏమని అడగాలో నిర్ణయించుకుని మేడ దిగి క్రిందకు వెళ్లాను. వంటింటి పని పూర్తి చేసుకునివస్తున్నదల్లా సుమతి నన్ను చూసి, "ఏం కావాలి" అంది.

"సూర్యం—సూర్యం కావాలి. నేను మేడమీదుంటాను. కొంచెం పైకి పంపు" అనేసి పైకి వెళ్లిపోయాను. పడకుర్చీలో కూర్చుని, కూర్చుని, ధైర్యంకోసం వో సిగరెట్టు వెలిగించాను. గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఈలోగా సూర్యం వచ్చాడు. "పిలిచారట. అమ్మ చెప్పింది" అన్నాడు. నేను సూర్యంకేసి చూసి, "అవును" అంటూ కుర్చీలోంచిలేచాను.

సూర్యం చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"మీ నాన్నగారికివయస్సెంతుంటుంది." అన్నాను.

సూర్యం ఆశ్చర్యపోయాడు.

"చెప్పు" అన్నాను.

చెప్పాడు. "మీ అమ్మకో" అన్నాను. అదీ చెప్పాడు. చేతిలో సిగరెట్టు పారేసి, మరో సిగరెట్టు వెలిగించి, "కూర్చో" అంటూ నేను కుర్చీలో కూర్చుని, అతను కూర్చున్నాక ప్రారంభించాను.

"మీ చెల్లెలు విజయ పెళ్లయి వెళ్లిపోయింది. యీ వయస్సులో మీ అమ్మకు చేతి ఆసరా ఎవరూలేరు. ఆ సంగతి అలా వదిలెయ్—చేతి ఆసరా కోసమయితే పని మనిషిని, వంటమనిషిని పెట్టుకోవచ్చు—మానసికంగా వాళ్లు ఎంత బాధ పడుతున్నారో నీకు తెలుసా — నీ పెళ్లి వాళ్లకో సమస్యగా తయారయ్యింది. ఇంట్లో కళకళ్లాడుతు నీ భార్య తిరుగుతుంటే చూడాలన్న కోర్కె కోర్కెగానే ఉండిపోయింది." గాంభీర్యంకోసం మరోసారిగాలి పీల్చాను గట్టిగా.

"కోర్కె అసంబద్ధమైనదయితే తీర్చాల్సిన బాధ్యత మనకిలేదు. కానీ సమంజసమైన కోర్కె తీర్చకపోతే వాళ్లెంత బాధపడతారో ఆలోచించావా — ఎన్ని సంబంధాలు చూసినా, నువ్వు వద్దంటున్నావట— నీ మనస్సులో ఏదైనావుంటే చెప్పాలి. అంతేగానీ పెళ్లొద్దు పెళ్లొద్దని అంటే ఎలా - పెళ్లనేది ఆపకూడని, జరిగి తీరవలసిన ఒక కార్యం. మనిషికి అత్యంత అవశ్యకమైనది. పెళ్లొద్దు అని సవాలక్షసార్లు గోల పెట్టినవాళ్లు కావాలోయ్ బాబూ అన్న వాళ్లకన్నా ముందు చేసుకున్నారు. అసలింతకి నీ మనస్సులో ఏదైనావుంటే నాతో చెప్పు" అని అతని భుజం తట్టాను. సూర్యం వదలబోరాడు. విజయం నాదే.

"పిచ్చివాడా! ఎవరినైనా ప్రేమించావా నాతో చెప్పు. నేను మీ వాళ్లకి నచ్చచెప్తాను. ప్రయత్నిస్తాను" అన్నాను. సూర్యం కళ్లు మెరిశాయి. "కూర్చో. కూర్చుని చెప్పు" అంటూ కుర్చీలోకూర్చున్నాను.

వో నిముషం ముప్పావు నిశ్శబ్దంగా గడిచాక, తను శారదని వో లమ్మాయిని ప్రేమించినట్టూ, ఆమె 'లా' కాలేజిలో బి. యల్. చదువుతున్నట్టు చెప్పాడు. ఎకనమిక్స్ ఎమ్మే చదివి ఉద్యోగం చేసుకుంటున్న సూర్యం లా చదువుతున్నమ్మాయిని ఎలా ప్రేమించాడో.....అయినా అది నిర్వివాదాంశం. నేను అతని ప్రేమను సమర్థించి వాళ్ల వాళ్లకి చెప్తానని, నచ్చ చెప్తానని మాటిచ్చాను. సూర్యం నాకేసి చూశాడు.

"వెరీగుడ్. మంచి పని చేశావు. నీకు తగిన అమ్మాయిని నువ్వే వెతికి చూసుకోడంవల్ల అకష్టం మీ వాళ్లకు లేకుండా చేసినవాడివయ్యావు. అయితే ఆమె ఫోటో ఏదైనా నీ దగ్గరుంటే చూపించు నాకివ్వు. వాళ్లని గురించిన విషయాలు కొన్ని చెప్పు" అన్నాను. సూర్యం దిగ్గునలేచి, వెళ్లి ఫోటో పట్టుకువచ్చాడు. అమ్మాయి బాగానేవుంది. సూర్యం నా ముఖంకేసి ఆత్రంగా చూస్తున్నాడు.

నేను గొంతు సవరించుకున్నాను.

"అయితే నీ ప్రేమ సంగతి ఆ పిల్లకు

కాదా? అమె కూడా నిన్ను ప్రేమిం చిందా? వాళ్ళ వాళ్ళు ఒప్పుకుంటారా? వాళ్ళకి.....అంటే ఆ పిల్లకి నిన్ను వివాహం చేసుకోవాలని ఉన్నట్టు తెలుసా'' అన్నాను.

''తెలుసండి. చాలాసార్లు వాళ్ళయింటికి వెళ్ళాను.వాళ్ళనాన్నగారూ, అమ్మగారూ చాలా మంచివాళ్ళు'' అన్నాడు సూర్యం సిగ్గు పడుతూ.

నేను లేచి సూర్యం భుజం తట్టి, ''పరేలే! నువ్వెళ్ళు. రేపు ఉదయం మని ద్దరం వాళ్ళింటికి వెళ్దాం. నువ్వు నిశ్చిం తగా ఉండు. అన్నీ నే చూస్తాను. ఏం'' అన్నాను. సూర్యం కృతజ్ఞతా పూర్వకంగా నా కేసి చూసి, ''థాంక్యూసర్'' అని మెమ్మ దిగా క్రిందికి వెళ్ళిపోయాడు. నేను కుర్చీలో కూలబడ్డాను. జీవితంలో ఒక మంచి పనయినా చేసినందుకు ప్రాణం హాయినిచ్చింది.

సూర్యం క్రిందకు వెళ్ళిన పావుగంటకు భాస్కరం, సుమతి మేడమీదికి వచ్చారు. విషయమంతా వాళ్ళతో చెప్పి, అమ్మాయి ఫోటో చూపించాను. అమ్మాయి వాళ్ళిద్ద రికీ నచ్చింది ''మిగతా విషయాలు రేపు వాళ్ళింటికి వెళ్ళి మాట్లాడుతాను. తరు వాత పెళ్ళి చూపులకు మీరు రావచ్చు. ఏమంటారు'' అన్నాను. ఇద్దరూ సరేనన్నారు. భార్యా భర్త లిద్దరూ నన్ను తెగ మెచ్చు కున్నారు.

రాత్రి పన్నెండింటికి పక్కమీదకు చేరాను. నిద్ర పట్టలేదు. మనస్సులో రాధ మెదిలింది. ఆనాడు నేనూ, రాధా, భాస్కరం సుమతి కలిసివుండే యిల్లు భాస్కరం కొనే శాడు. ఈనాడు ఆ యింట్లో నేను పడు కుంటే ఆనాటి జీవితం గుర్తు రాసాగింది. —మా సంసార జీవితం హాయిగా వో సంవత్సరం గడిచింది. నాన్నగారు వ్యాపా రంలో బాగా డబ్బు గణించడంవల్ల, గణిస్తూండడంవల్ల అప్పుడప్పుడు పెద్ద మొత్తం ఖర్చుల కుంచుకో అంటూ పంపేవారు. మాకన్నా రాధావాళ్ళ ధనికు లవడంవల్ల ఆమెకు అప్పుడప్పుడు వాళ్ళ నాన్నగారు పంపేవాళ్ళు.

కాల గమనంలో, దాని యాంత్రిక చక్రాల క్రిందపడి నేను సింహాచలం సంగతి మరచిపోయాను. ఆరోజు శుక్రవారం. రాధ దేవునికి పూజ చేసింది. నేను బజారునుంచి అప్పుడే లోపలకు వస్తున్నాను. గుమ్మం ముందో మందార పువ్వు పడివుంది. నా కాలి క్రిందపడి, నలగబోయింది. గమ్మునకాలిని వెనక్కు లాక్కుని, పువ్వుతీసి, చేతో పట్టుకున్నాను.

ముద్దమందార!

నా మనస్సులోకి సింహాచలం వచ్చింది. నాకోసం, నా భవిష్యత్తుకోసం సర్వం త్యాగం చేసిన ఒక జీవిని మోసంచేసి, నేను సుఖా లనుభవిస్తూ, ఆమెను మరచిపోయాను. నేను మహా పాపిని. భగవంతుడు యింతవరకూ నా పాపాలకు ఏ విధమైన శిక్షా వేయ లేదు. ఇకముందెలాటి శిక్ష వేస్తాడో.

''ఏమిటా మందారపువ్వును పట్టుకుని అలాగే నిలబడిపోయారు'' అంది రాధ.

నేను ఉలిక్కిపడి ఆమెకేసి చూశాను.

''ఏయ్ మిమ్మల్నే —ఏమిటా పరధ్యాన్నం'' అంటూ రాధ నాచేతిలో మందారపువ్వును లాక్కుని నేలమీదపడేసి ఫక్కున నవ్వింది. నా శరీరం కోపంతో వేడెక్కింది. ''ఏయ్'' అని మిన్ను విరిగేలా అరిచాను. రాధ హడలి పోయింది. గడచిన రోజుల్లో ఆమెను ఒక్క సారయినా కోప్పడలేదు. నా నోట్లోంచి ఉద్ధృతమైన ముక్కరాలేదు. ఆమె భయ పడింది.

నాకు కోపం చల్లారలేదు. నేలమీద పడిన మందార పువ్వుతీసుకుని నాగదిలోకివెళ్ళి లోపల గడియవేసుకుని, మంచంమీదికి చేరాను. నా హృదయం ఎండిపోయింది. మందార రేకులమధ్య సింహాచలం కనుపిం చింది.

గోపాలపూర్ వదిలి ఏడాది దాటింది. సింహాచలానికిపాటికి మగపిల్లాడు పుట్టి ఉంటాడు. అంటేనాకు......

ముచ్చెమటలూ పోశాయి.

రాధ కాస్సేపుపటికి నెమ్మదిగా తలుపు తట్టింది. లేచి వెళ్ళి తలుపు తీశాను.

''వంటయ్యింది'' అంది. — నా మనస్సు యిా లోకంలోలేదు. '' నా కాకలిగాలేదు'' అన్నాను. రాధ కళ్ళవెంట నీరు తిరిగింది. బ్రతిమాలబోయిందిగానీ, నేను అవకాశం ఇవ్వక, వెళ్ళి మంచంమీద పడుకున్నాను. ఇంతలో భాస్కరం, సుమతి వచ్చారు. ''ఏమిటోయ్ ఎన్నడూ లేనిది, మా దిష్టి ఏమైనా తగిలిందేమిటి? లేలే పన్నెం డయ్యింది. అవతల రాధమ్మ కూడ భోజనం చెయ్యలేదు'' అనాడు భాస్కరం.

నాకు బహుశా అందరూ బ్రతిమాలడం వల్లనుకుంటాను. పంతం ఎక్కువయ్యింది. వాళ్ళమాటలకు సమాధానం చెప్పలేదు. సుమతి కూడా నచ్చచెప్పింది. రాధ వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయింది. వాళ్ళి ద్దరూ ఆమె వెనకాల వెళ్ళారు. నేను తల మంచంకోడుకేసి బాదుకున్నాను. ఏడుద్దా మనుకున్నా ఏడుపు రాలేదు. గుండెలో ఏదో మంట పెట్టినట్టయ్యింది.

నే నెలా ఎంత సేపుండి, నిద్రలోకి జారిపోయానో తెలీదుకానీ. లేచేసరికి నాలు గయ్యింది. కళ్ళు నీకడం ప్రారంభించాయి. బయటకు వచ్చాను. రాధ కుర్చీలో కూర్చుని వుంది. రాధ ముఖం పీక్కుపోయివుంది. ఈ విషయాన్ని యింకా పెంచడం మంచిది కాదని, ''రాధా, ఆకలేస్తోంది. తిండానికే మైనా వుంటే పెట్టు'' అంటూ ఆమె పక్కనున్న కుర్చీలో కూర్చున్నాను. రాధ ముఖంలో వేయి దీపాలు వెలిగాయి. గమ్మున లేచి, కన్నీరు పైట చెంగుతో తుడుచు కుంటూ వంటింట్లోకి పరిగెత్తింది. ఇంతలో మళ్ళీ సుమతి, భాస్కరం వచ్చారు. ఆలస్యంచేస్తే వాళ్ళు మళ్ళీ విషయమంతా తవ్వి బయటకు తీస్తారని, ''మాంచి సినిమా ఏదైనా వుంటే చెప్ప వోయ్. వెళ్దాం. భోజనాలు కావలిసొస్తే హోటల్లో చేద్దాం. ఏం?'' అన్నాను. ఈలోగా టిఫిను పట్టుకుని రాధ వచ్చింది. రాధను కూడా అడిగాను. రాధ తలవూపింది. ''అయితే గబ గబ తెములండి'' అన్నాను.

* * *

రాత్రి పడుకోబోయేముందు రాధ నా

దగ్గరకువచ్చి, "నాకో వరం యివ్వాలి" అంది. "వరమా! వరం ఏమిటి" అన్నాను నేను రాధ గాజులు సవరిస్తూ. "వరాలు యివ్వడాలూ, కోరుకోడాలూ యీ కాలంలో ఎక్కడున్నాయి?" అన్నాను. రాధ నెమ్మదిగా నా పక్కన కూర్చుని, "మన జీవితంలో యిలాటి రోజు రాకూడదని నాకు మీరు వరం యివ్వాలి. మీ మనస్సులో ఉన్న విషయం దాచి, నన్ను బాధపెట్టి, మీరు బాధపడేకన్నా నావల్ల ఏదైనా జరగకూడనిది జరిగితే శిక్షించండి. మీ అండన బ్రతకాల్సినదాన్ని. నన్ను నిర్లక్ష్యం చేస్తే బ్రతకలేను" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ నా గుండెమీద వాలిపోయింది.

నా గుండె వేయి ముక్కలయింది.

రాధని నా గుండెకు హత్తుకుని, కన్నీరు తుడుస్తూ, "ఛ. ఏమిటది? నీవల్లేమీ జరగలేదు. ఏమిటో నాకు మనస్సు బాగులేదంతే. ఇంకెప్పుడూ అలాగ చేయనులే. నా మాట విను. నీ కంటనీరు నేను చూడలేను" అన్నాను. రాధ కన్నీరు తుడుచుకుంటూ సరిగ్గా కూర్చుంది. రాధ మనస్సుని మళ్ళించాలని, పక్కనున్నపుస్తకం తీసి రాధ చేతికిస్తూ, "ఈ కథనువ్వు చదువుతుంటే నేను వింటాను. ఇలా నీతల నా ఒళ్ళో పెట్టుకుని, అలా పడుకుని చదువు" అన్నాను. రాధ పుస్తకం అందిపుచ్చుకుని, నే చెప్పినట్టు పడుకుని, కథ చదవ నారంభించింది. పారిపోతున్న మనస్సును అదుపులోకి తెచ్చుకుంటూ కథకి వూకొట్ట నారంభించాను. కాస్సేపటికి రాధ నిద్రాదేవత ఒళ్ళోకివాలిపోయింది. ఆమెకు నిద్రాభంగం కలుగకుండా చేతిలోపుస్తకం తీశాను. ముక్కుమీద పట్టిన చెమట తుడిచాను. కనుబొమ్మలు సరిచేసి, నుదుట పడ్డ ముంగురుల్ని వెనక్కుతీశాను.

తన జీవితాన్ని నా జీవితానికి ముడివేసి, నిశ్చింతగా కాలం గడుపుతున్న రాధ..... వంచకుణ్ణయిన నేను— నామీద నాకే జుగుప్స కలిగింది. అలాగే కూర్చుని రాత్రంతా గడిపాను. తెల్లవారుజామున అయిదింటికి

రాధకి మెలకువ వచ్చింది. కళ్ళు విప్పినాకేసి చూసి, తిరిగి మూసుకోబోయి, మళ్ళీ తిరిగి, గమ్మున లేచింది. "రాత్రంతా యిలా కూర్చునే ఉన్నారా" అంది.

"ఏం చెయ్యను. వో సుకుమారి నా ఒళ్లో తలపెట్టి పడుకుంటే ఆమెకి నిద్రభంగం చేసే సాహసం వుందా నాకు?" అన్నాను. ఆమె కళ్ళు ఆనందంతో మెరిశాయి.

రాధ అమాయకత్వం చూసిన కొద్దీ నాకు మానసిక బాధ అధికంగా ఉండేది. రాధ ముఖంలోకి కొన్నిసార్లు సూటిగా చూడలేక పోయేవాణ్ణి.

కొన్నాళ్ళు జరిగాయి. ఎన్నాళ్ళు జరిగాయో?"

* * *

రాధ ప్రవర్తనలో నాకు ఏదో మార్పు కనుపించింది. మునుపులా ఆమె ఉత్సాహంగా ఉండటంలేదు. ఒకవేళ నా ఆల్బమ్ చూసిందేమో అనే అనుమానం వచ్చింది. పైగా 'ఆ' సంఘటన ఆమె కేదైనా అనుమానం కల్గించిందేమోనన్న అనుమానం కూడా కలిగింది. చాలాసార్లు "ఏం? అలా ఉన్నావ"ని అడిగాను. అడగ్గా అడగ్గావోనాడు ఆమె ప్రసన్నురాలయ్యింది. "నా కోర్కె తీరుస్తే మీ కో మాంచి విషయం చెప్తాను" అంది. ఆమె కళ్లల్లో అనిర్వచనీయమైన ఆనందం వెలుగుతుంది.

"ఏమిటో అది శలవియ్యండి" అన్నాను. ఆమె జడపట్టుకుని విప్పుతూ. "ఏమిటది?" అంటూ నా చేతిలోని తన జడను లాక్కుని "మనిద్దరం మహాబలిపురం వెళ్లాలి. అక్కడ చెప్తాను" అంది.

"వో యస్. ఇంతేకదా! పదయ్యాపూటే వెళ్దాం." అన్నాను. రాధ వెంటనే వో చిన్న లెదర్ బ్యాగ్‌లో తగు బట్టలు సర్దింది. సాయంత్రానికి మహాబలిపురం చేరాము. రాతిరథాలూ, కట్టడాలూ, చెక్కడాలూ మరోసారి చూసి సముద్రపొడ్డు చేరాము.

"ఆ. యిప్పుడు చెప్పు" అన్నాను యిసకలో వెల్లకిలా పడుకుని, తలక్రింద రెండు చేతులూ సరిగా పెట్టుకుంటూ. రాధ నా పొదకునంగా, చొక్కా గుండీలు సరిచేస్తూ, "వో విషయం అడుగుతాను,

ముద్దమందార

ఉన్న దున్నట్టు చెప్తానని మాటివ్వాలి" అంది.

నేను ఉలిక్కిపడి, లేచి కూర్చుని, "ఏమిది?" అన్నాను. సింహాచలం విషయం గాని, రాధ కనిపెట్టేసిందేమోనన్న అనుమానం వచ్చింది. భయం వేసింది. రాధ తన చూపులను వాల్చుకుని, ఇసకలో ఏవేవో పిచ్చి గీతలుగీసి, అవన్నీ చెరిపేసి 'ము' అనే అక్షరాన్ని రాసి, అదీ చెరిపి 'మ' రాసి "చెప్పనా" అంది. దాన్ని చెరిపేస్తూ. "చెప్పు" అన్నాను యాంత్రికంగా. రాధ నాకేసి ఒక్కసారి చూసి, తల దించుకుని, "మీకూ, మందారపువ్వుకూ ఏదో చాలా సంబంధం ఉంది. దాని వెనుక ఏదో ఒక బలమైన గాథ ఉండుండాలని నాకు అనిపించింది. అది చెప్తే వినాలని కోర్కెగా వుంది" అంది.

నేను గట్టిగా గాలి తీసుకోడానికి కూడా భయపడ్డాను.

"చెప్పాలని లేకపోతేమాత్రం వద్దు. కానీ అబద్ధంమాత్రం కల్పించి చెప్పకండి" అంది. కొరడాతో కొట్టినట్టు అయింది నాకు. సింహాచలం విషయం చెప్పాలా, వద్దా అనే సమస్య ప్రాణాంతకంగా తయారయ్యింది.

"పోనీ వద్దులెండి. మీ మనస్సు కష్టపెట్టడానికి నాకు అధికారం లేదు. చెప్ప రాని విషయమైనా, చెప్పేటంతటి విషయంగా పోయినావద్దు. ఆ సంగతి వదిలెయ్యండి" అంది. నాకు ఎందుకో మొండి ధైర్యం వచ్చింది.

"విను రాధా. ఏనాడో నీకు చెప్పాల్సిందసలు" అంటూ రాధ ముఖం చూడకుండా చెప్పవలసినదంతా చెప్పి, "అది రాధా మందారపువ్వు కథ. ఒకనాటి నా నిర్బలత ఒక అమాయిక జీవితం నాశనం చెయ్యడమే గాకుండా మరో అమాయక జీవిని యీ ప్రపంచంలో ప్రవేశపెట్టింది. బహుశా ఆమెకు కొడుకు పుట్టి ఉండచ్చు" అన్నాను. ఆమెకేసి చూసే ధైర్యం చాల లేదు అంతా విన్నాక, రాధ నన్ను క్షమించదు. ఏ స్త్రీ అయినా క్షమించదేమోనని పించింది. కాస్సేపటికి వెక్కిళ్ళు వినబడ్డాయి. రాధ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"రాధా నన్ను క్షమించలేవా" అన్నాను. ఆమె మాట్లాడలేదు.

మరి పది నిముషాలయ్యాక, "రాధా! చెప్పు. నన్ను క్షమించలేవా! నీకు తెలియకుండా యీ బాధను నా మనస్సులో పెట్టుకుని, కుమిలిపోతున్నాను. నువ్వు క్షమిస్తే నా మనస్సు శాంతిస్తుంది." అంటూ ఆమె రెండు చేతులు పట్టుకున్నాను. రాధ తల ఎత్తలేదు. తన చేతులు లాక్కోనూ లేదు. గట్టిగా నిట్టూర్చి, "మీ నీడని బ్రతకవలసిన దాన్ని నేను. మీ తప్పులు ఎంచేశక్తీ, క్షమించే హోదా నాకు ఎప్పుడూ ఒద్దు. నాకే అధికారంవద్దు." అందంతే. రాధ క్షమించదని నాకు తెలుసు. స్త్రీ సహనానికి కెంత మారు పేరయినా, ఆ సహనానికీ హద్దుంది.

మరో అరగంట అలాగే శిలా ప్రతిమల్లాగ కూర్చున్నాము. మౌనం చాలా భయంకరంగా ఉండడంవల్ల, "నువ్వేదో చెప్తాన్నావు కదా" అన్నాను జంకుతూ.

"ఏమీలేదు. చీకటి పడ్తోంది. ఇక వెళ్దాం." అంటూ రాధ లేచి నిలబడింది. ఆమె గొంతులోవున్న స్థిరత్వం నన్ను మరోసారి ప్రశ్నించ నివ్వలేదు.

ఒకరి కొకరు సంబంధంలేని వాళ్ళలాగ యింటికి చేరాము. మూడు రోజులయినా, రాధ ప్రసన్నురాలు కాలేదు. అవదేమోనని భయంవేసింది. ఆమెను బ్రతిమాలాను. విషాదంగా నవ్వి, "బాధ పడరాదనుకుంటే మాత్రం? అది మన చేతులోవుందా.... సరేలెండి. ఈ అసంతృప్తి ఒకటి రెండ్రోజులుండి పోతుందంతే" అంది.

మూడ్రోజులు గడచిన నాల్గోనాటికి రాధ తల్లి వచ్చింది. ఆవిడను చూడగానే నా బుర్ర తిరిగింది. రాధ 'నాకథ' తన తల్లికిరాసి, ఆవిడను తెప్పించిందేమో నన్న అనుమానం కలిగింది.

"రాధని తీసుకు వెళ్లడానికె వచ్చానోయ్" అంది జానికమ్మగారు మధ్యాహ్నం భోజనమయ్యాక.

(సశేషం)

ఐరోపా, అమెరికాలకు ఎగుమతి నిమిత్తం ప్రత్యేకంగా సృష్టితమై బయల్పరచబడ్డ సౌఖ్యానందకరమైన సబ్బు, ఇపుడు ఎన్నికగా భారతదేశంలో అమ్మకమగుచున్నది!

గోద్రెజ్ సాండల్...శుద్ధమైన మైసూర్ చందన నూనె నుండి నైపుణ్యంగా మిశ్రమం చేయబడిన ఉల్లాసకరమైన ప్రశస్తమగు నిలవుండే పరిమళం గలది...ఇట్టి వాటిలో చాలా కాలం నిలవుండే చాలా పెద్ద సబ్బు నేడే దీనిని వాడి చూడండి. దాని హాయిగొలిపే పరిమళం మీ కెంతో ప్రీతిమైనది!

గోద్రెజ్ సాండల్

...అందరూ ఆనందించగల సౌఖ్యదాయకం

సమర్పితం
క్రొత్త
గోద్రెజ్ సాండల్





యాద్

డి. హనుమంతరావు



ఆరోజు న్యూఢిల్లీ ప్లాట్‌ఫాంమీద జనం అంతాకోలాహలంగా వున్నారు. మసక చీకట్లో మారుమూల ప్లాట్‌ఫాంమీద వందలకొద్దీ జనం గుమిగూడి యుద్ధానికి వెళ్తున్న సైనికులకి వీడ్కోలిస్తున్న సమయమది.

ఆఫీసర్లు, సైనికులు హడావిడిగా ప్లాట్‌ఫాంమీద తిరుగుతూంటే వాళ్ల వంక ఆరాధనగా, ప్రేమగా చూస్తున్నారు జనం. కొందరు పెట్టెల్లో కెక్కి అందులో కూర్చున్న సైనికులికి ఏవో తిన డానికిచ్చి టీ పోస్తున్నారు. కొందరుస్త్రీలు చేతులకి రక్షా బంధాల్ని కట్టుతున్నారు. కొందరు మొగాన బొట్టుపెట్టిదండలు వేస్తున్నారు. మిగతా చాలామంది జనం "ఇండియన్ ఆర్మీ జిందాబాద్!"—"భారత మాత ముద్దుబిడ్డలు— మా సైనికులు జిందాబాద్" అంటూయేవోనినాదాలు చేస్తున్నారు. కొందరు ఆడామగా యుద్ధానికి పోతున్న బంధువులకి వీడ్కోలిస్తున్నారు కన్నీటితో.

ఆరోజు కొద్దిపాటి జ్వరం, నలతగా ఉండడం మూలాన తన కంపార్ట్‌మెంట్ లోనే కూర్చొని పోయాడు లెఫ్టినెంట్ రామ్మూర్తి. ట్రాన్సిస్టర్ ట్యూన్ చేసి పాటలువింటూ, బయటయెక్కడా లైట్లు కనబడని మసక చీకట్లలో నీడల్లాంటి మనుష్యులవంక, వాళ్ల నినాదాలవంకా చూస్తూంటే యేవో ఆలోచనలు వస్తున్నాయి.

"ఓ వీరసైనికా! ప్రచండానలమై చెల రేగి శత్రుమూకలిని మట్టుబెట్టు! నిన్ను గన్నతల్లి గౌరవంకోసం గర్వంగా ప్రాణాన్ని త్యజించు. ఆమె నుదుట నీరక్తంతో తిలకముంచు. యుద్ధభూమిలో వెనక్కి చూడక పోరాడి వీరస్వర్గమలంకరించు. తృణప్రాయంగా ప్రాణాల్నిఒడ్డి పైలోకంలో అప్సరసల కౌగిలిలో సర్వసౌఖ్యాలు అనుభవించు !......" అంటూ ఓపది గొంతులు కలిపి ప్రబోధిస్తోంది రేడియో. ఎవరో కవీశ్వరుడు డన్‌లప్పిల్లోమీద అడ్డదిడ్డంగా పడుకొని సుష్టుగా భోంచేసి కిళ్లీనములుస్తూ సిగరెట్ వేళ్ల మధ్య యిరికించి వయ్యారంగా పట్టుకొని ప్రతిగా ముట్టే కిరాయి డబ్బులకి ఇన్‌స్పైరై అందించిన మధురకవిత! రామ్మూర్తి నవ్వుకున్నాడు.

చచ్చిపో అనడం యెంతసులభం! వీర స్వర్గం అలంకరించి, అప్సరసల్ని కౌగిలించు కోమనడం యింకాసులభం! చిక్కల్లా యీలోకపు అప్సరసల్ని కౌగిలించుకోమంటేనే. రామ్మూర్తికి యేదో శిఖరం చివరనిలబడి క్షణంలో క్రిందకి కొన్ని మైళ్లలోతుకి కూలి పడబోయే వాడిలాగా ఒకరకం నిర్లిప్తమైన వైరాగ్యం వొచ్చింది.

అవును, భారతమాత, నుదుట తిలకం, వీరస్వర్గం, అప్సరసలు యివన్నీ యెలా ఉన్నా యెవరో అన్నట్లు మంచంమీద చావు కన్నా యుద్ధంలో చావు సర్వవిధాలా శ్రేష్టం. ఏబాధలేకుండా, యే గ్రెనేడో మీద పడగా క్షణంలో ముక్కలై యెగిరి పోవడం ఎంత సుఖం!

అందులోనూ, తనలాంటి వాళ్లకి అంతకన్నా గౌరవప్రదమైనది యింకేముంది? అతనితల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి మళ్లా పెండ్లిచేసుకున్నాడు. నానా అవస్థలూ పడి ఇంటర్‌దాకా చదివాడు గాని, ఆతర్వాత తండ్రి యింక చదివించననడంతో విరక్తిపుట్టి యింట్లోంచి పారిపోయాడు. యెలాగో సైనికోద్యోగి అయ్యాడు. అయ్యాక తండ్రికి ఉత్తరం రాయలేదు. తండ్రీ అతని గురించిపట్టించుకోలేదు. ఆప్తులైన దగ్గర బంధువులెవరూ లేరు. కమిషన్ పొందిన రెండేళ్ల లోను ఒక్కసారి సెలవు తీసుకుని యెక్కడికీ పోయిన పాపాన పోలేదు. తనసలెందుకు బ్రతుకుతున్నట్టు? అన్న ప్రశ్న చాలాసార్లు వచ్చిందిగాని, దానికి సమాధానం వెతకడం యెప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చాడు. పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చిన వెంటనే, యుద్ధభూమికి తనంతతాను వలంటేరయి ఆ యూనిట్‌కి

తోస్సు చేయించుకున్నాడు యేదో చెయ్యాలని, వేలకొద్దీ పురుగులు యెక్కడో పుట్టి పెరిగి నశించినట్టు కాకుండా జీవితాన్ని యేదో తృప్తితో నింపుకోవాలని అతని పట్టుదల.

యెదురుగా అంతమందిలోనూ మధ్యగా, వాళ్లందరికీదూరంగా స్తంభంనీడని ఏడాది పిండని పనివాణ్ణి యెత్తుకు నిలబడ్డాడు హవల్దార్ ప్రేమ్‌సింగ్. అతనిభార్య ప్రపంచాన్నంతనీమర్చి అతనిచుట్టూ చేతులు వేసి గుండెకు తలాన్చి యేడుస్తోంది, అతను వోదారుస్తున్నా వినకుండా. అదివాళ్ల ఆఖరి కలయిక కావచ్చు.

రామ్మూర్తి నవ్వుకున్నాడు. చచ్చిపో అని వ్రాసిన కవిగారు ఆమె కన్నీళ్ల యెంత వేడో యెరుగడు. అతని చంకనున్న ఆ పసివాడి అమాయకపు చూపులవెనక అతని జీవితాన్ని తారుమారు చేసే యెన్ని విషవలయాలుతొంగి చూస్తున్నాయో కవిగారు ఊహించి యుండరు.

'దేవుడా, నీకు మనుష్యుల ప్రాణాలు కావలిస్తే నన్ను, నాలాంటి ఒంటరిగాళ్లని తీసుకో. నాకోసం యెవడూ యేడవడు!' తనుజేస్తున్న ప్రార్థనలు తనకే హాస్యంగా తోచాయి రామ్మూర్తికి. యిప్పట్నుంచి దేవుడిగురించి ఆలోచించడం దండగని. కొన్నియేళ్లుగా దేవుణ్ణిమర్చిపోయిన వాడి నోట అప్రయత్నంగా ఆప్రార్థన రావడం అతనికి ఆశ్చర్యమనిపించింది.

అతన్నిగురించి యెవరూ యేడవరు! అసలతనికెవరూ ఏమీకారు, యెవరికీతను యేమీకాడు. ! అందుకే రామ్మూర్తి పితృప్రేమ, మాతృప్రేమ, భ్రాతృప్రేమ, పుత్రప్రేమలాంటివన్నీయెదిగీయెదగని రచయితలు, రచయిత్రులు పేరు అచ్చులో చూసుకోడానికి ప్రయోగించే మ ళ యా ళ మంత్రాలనుకునేవాడు! లేకపోతే నాలుగుడబ్బులు పోగేసుకోవడానికి సినిమావాళ్లు ప్రయోగించే గిమిక్కులు! యెవడిమటుకు వాడికి స్వార్థం తప్పించి యెదటవాడి యావపట్టదు. అయితే కొందరు యీ కత్తి మొనలకి తేనెపూస్తారు. తెగినపుడు తియ్యగా ఉండాలని! "మేం ఇంకా దొంగవ్యాపారాలు జేసి లక్షలు గడించాలి. మేం యింకా లంచాలు పుచ్చుకొని మేడలు గట్టాలి. మేం యింకా నీతి నిజాయితీలు గట్టునబెట్టి సన్మానాలు, సత్కారాలు పొందాలి. మేం యింకా యింకా మిగతా వాళ్లకి గోతులు త్రవ్వి మాపదవులు నిలబెట్టుకోవాలి.!...... అందుకని నువ్వెళ్లి యెదటి వాళ్లని చంపు. నువ్వు చచ్చినా సరే వెనక్కిరాకు!" అంటే చేదుగావుంటుంది కాబట్టి, "భరతమాత వేణీబంధాన్ని దుశ్శాసనులు చేతబట్టారు, నువ్వెళ్లి విడిపించుకురా, ప్రాణదానం చేసయినా సరే!" అంటారు.

ఎవరు యీ భరతమాత? యెక్కడుంది? యీ మనుష్యులంధరూకారా? వీళ్లకోసం తను ప్రాణాల్నిత్యజించాలి!

"క్షమించండి, యిలా క్రిందికిదిగి రారూ!" కిటికీ ఊచలబయట ఆమె చాలా తియ్యగా ఆదరంగా పిలిచింది. రామ్మూర్తి ఆమెముఖంలోకి తేరిపారజూచాడు. ఆమె అలా ప్రశాంతంగా చూసింది. ఆమెఅంటే యేదో చెప్పలేని గౌరవం కలిగింది రామ్మూర్తికి. మంత్రం వేసినట్టు లేచి క్రిందికి వెళ్లాడు.

ఆమె అతని చేతికి రక్షబంధాన్ని కట్టి, నుదుటయెర్రగా కుంకుమదిద్దింది.

"మీరు విజయులై క్షేమంగా తిరిగి రావాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నా!" అంది అదే నిశ్చలమైన చూపుతో, నిర్మలంగా మధురంగా వినబడేగొంతుతో.

రామ్మూర్తి తడబడ్డాడు. ఆమెవంక అలాగే చూస్తూ నిలబడి పోయాడు. ఆమె చూపులు తిప్పుకొని వెనక్కి తిరగబోయింది.

"మీరే మనుకోకపోతే ఒక గులాబి మీచేతులతో యివ్వండి." కొంచెంబెరుగ్గా అన్నాడు రామ్మూర్తి.

"క్షమించండి, మర్చిపోయాను. అసలు మీకివ్వాలనే తెచ్చాను. మాదొడ్లోవి!" అందామె కొద్దిగా సిగ్గుపడి, అతని చేతి కందిస్తూ.

ఆమె గుంపులోకలిసి పోయింది. అలాగే చూస్తూ నిలబడ్డాడు రామ్మూర్తి.

ఆమె చల్లని చూపులు, మాటలు అతనికింతకాలం కనబడని భరతమాతరూపాన్ని కొంతవరకు గుర్తింప జేశాయి. అతని చావుకొక అర్థం కనబడినట్టయింది. తను బలికావాలి! క్షుద్రదేవతల తృప్తికోసం గొర్రె పోతులాకాదు! ఆమెలాంటి స్నేహశీల మానరక్షణకోసం! యీ లంచగొండుల, దొంగవ్యాపారాల, పదవీ వ్యామోహాల, ఝూఠా దేశభక్తుల చచ్చు మెప్పుకోసం గాదు. ఆమెలాంటి స్నిగ్ధమూర్తులు, మామూలు అమాయకులు తలెత్తుకు తిరగడానికి! తనలో తెలివివున్నంతవరకు వెనుదిరక్క, శత్రువుల గుండెల్లో చిచ్చు బెట్టాలి. తనసలు తిరిగి రాగూడదు! రామ్మూర్తి ఆవేశంగా ఉద్రేకంతో అనుకున్నాడు. కళ్లలోకి నీళ్లుబికి మెరిశాయి. అతని మనస్సులో కల్లోలమంతా పోయి, తృప్తిగా ప్రశాంతంగా ఉంది.

* * *

కాని రామ్మూర్తి అనుకున్నట్టు జరగలేదు. ఒకరాత్రి పెట్రోలుకి నాయకత్వం వహించిన అతను, శత్రువుల మైన్ ఒక దానిమీద అడుగుపడగా కాలు యెగిరి పోయింది. విపరీతంగా రక్తస్రావమయి స్పృహతప్పింది. కూడా ఉన్నవాళ్లు వెనక్కి తీసుకొచ్చారు. పఠాన్‌కోట హాస్పిటల్లో అతనికి ప్రథమ చికిత్స జరిగింది. ఆ తర్వాత మరివారం రోజులకి, యుద్ధమింకా ముగియకుండానే, వెనక్కి ఢిల్లీ హాస్పిటల్‌కి పంపివేశారు. అతనికి రక్తమిచ్చి మిగిలిన కాలుముక్కని తొడవరకు తీసివేయాల్సివచ్చింది.

ఆరోజు ఆఫీసర్స్‌వార్డులో సిస్టర్‌తలక్రింద ఎత్తుగా దిండ్లు పెట్టగా మంచం మీద పడుకొని దూరంగా కిటికీబయటికి చూస్తున్నాడురామ్మూర్తి.చావగూడదనిఎందరో

వెలల పసికందుల్ని, నవవధువుల్ని వదలి తమదారి తాముచూసుకున్నారు. చావాలని కోరుకున్న తను యిలాచావు బ్రతుకులు రెంటికీ పనికిరాకుండా పోయాడు.

చుట్టూవున్న ఆఫీసర్ల కోసం యెందరో బంధువులు, భార్య, తల్లి,తండ్రి పిల్లలు, సోదరులు వస్తారు. యెన్నో తెస్తారు. కబుర్లు చెప్తారు. వాళ్ళందరికి హాస్పిటల్లో నయమవగానే ఆరు నెలలు దాకా సెలవు ఇస్తారు. యింటి దగ్గర కావాల్సిన వాళ్ళతో హాయిగా గడపవచ్చు. ఆతర్వాత మళ్ళీ ఉద్యోగం. తనకి కిటికీ ఊచలేతోడు. దగ్గిర బంధువు లెవరూ లేరని, దూరపు బంధువుల చిరునామాలు తనకి తెలియవని చెప్పాడు రామ్మూర్తి. యెందరోవస్తారు మంత్రుల దగ్గర్నుంచి, మామూలు సానుభూతి పరులదాకా. కుశలప్రశ్నలు వేస్తారు. యెలాజరిగిందని అడుగుతారు. 'అశ్రుపూరిత నయనాలు' ప్రదర్శిస్తారు. ఔదార్యాలని చూస్తారు. రామ్మూర్తికి ఔదార్యాలు నరకమయి, యెవరన్నావస్తున్నారంటే నిద్రనటించేవాడు.

కొందరు దేశసేవాతత్పరులు, సంఘసేవాభిలాషులు "మేమేమన్నా సహాయం చేయగలమా?" అనడుగుతారు. "నన్ను ఒంటరిగా వొదిలి వెళ్ళండి"! అంటాడు రామ్మూర్తి. అతని గొంతులోని కర్కశత్వం అర్థంగాక, అదోలా చూసి వెళ్ళిపోతారు పాపం, ఆనినాదాల ప్రపంచంలో తేలిపోయే అమ్మాయిలు, అబ్బాయిలు!

"నేను మీకేమన్నా సహాయం చెయ్య గలనా?"

రామూర్తి ఉలిక్కిపడి చూశాడు. ఆ గొంతులో తీపిమొటిసారి అనుభవించిన ప్పుడు పరవసుడైనాడు. ఆతర్వాత యెన్నోసార్లు ఆగొంతు అతనిలో ప్రతిధ్వనించి మైమరపు కలిగించేది. ఆ గొంతు మళ్ళా వినాలని అతని అంతరాంతరాళాల్లో యెక్కడో జరుగుతున్న నిరీక్షణ యీనాటికి ఫలించి కనుల నీరు నించింది. ఆనందం, విచారం రెండూ ఒక్కసారి కలిగాయి. అతనికళ్ళలో వీటిపార మెరుపు ఆమెనుంచి బలవంతాన దాచుకున్నాడు రామ్మూర్తి.

"మీరా!" అందామె ఆశ్చర్యంగా, ఆనందంగా, బాధగా. అతని రెండుకాలు ఉండాల్సినచోట ఖాళీని కప్పిన దుప్పటిని చూడగానే ఆమె దుఃఖమాగలేదు. చెంపల్ని జారే కన్నీటిని తుడవాలనిగాని అతన్నించి చాటు జేసుకోవాలని గాని ప్రయత్నించకుండా ప్రక్కగా కుర్చీలో కూలబడింది.

రామ్మూర్తి ఆమెకేవో వోదార్పుగా చెప్పాలని ప్రయత్నించి చెప్పలేక తలదించుకున్నాడు.

"నేనింకా మీకు జ్ఞాపకం ఉన్నానా?" అన్నాడురామ్మూర్తి నవ్వుతూ కాస్సేపటికి.

"యెలా మర్చిపోగలను?"అందామె. వాళ్ళ యిద్దరిదీ కొన్నియేళ్ళ పరిచయమన్నట్టనిపించింది యిద్దరికీ.

ఆమె అడక్కుండానే అతనికి గాయమెలాగైంది, అతనికి తెలియకుండానే అతన్ని వాళ్ళు వెనక్కి యెలా చేర్చింది, అంతకుముందు అతని అనుభవాలు అన్నీ వివరించాడు రామ్మూర్తి. వెనక్కి వచ్చినందుకు ఆమెకు సంజాయిషీ యిచ్చుకుంటున్న ధోరణి అతనిలో కనబడింది.

"మీ రక్షాబంధమే నన్ను వెనక్కి తెచ్చిందేమో!"

"కాని మిమ్మల్నిలా వికలాంగుల్ని చేస్తుందనుకోలేదు. నావల్ల యేదో లోపం జరిగింది." బాధపడిందామె.

రామ్మూర్తి కారోజు జీవితంలో యెన్నడూలేని ఆనందం కలిగింది. ఆమె గంటకి పైగా అతని దగ్గిరే కూర్చుని ఆమె కధనంతా చెప్పింది. విజిటర్స్ టైం అవగానే యింక మర్నాడు వస్తానని వెళ్ళిపోయింది.

సుశీల తండ్రి, తల్లి పదమైయెనిమిదిలో సింధురాష్ట్రములోని వాళ్ళ వూరు వదిలిపెట్టి యీ దేశానికి తరలివచ్చారు. తండ్రి యిక్కడ కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. సుశీల అప్పటికి ఒకటి రెండేళ్ళపిల్ల. యిప్పుడు కాలేజీలో చదువుకుంటుంది. సుశీల అన్న ఒకరు కొన్నినెలలముందు కాశ్మీర్లో సరిహద్దు కాల్పుల్లో మరణించాడు. అతనూ సైన్యంలో ఉద్యోగి.

మర్నాటి సాయంకాలం అనుకున్న ప్రకారం నాలుగ్గంటలకే వచ్చింది సుశీల. చలనం లేని నీటిలో కలువపువ్వులాంటి ప్రశాంతమైన ఆమె సౌందర్యం, ఆరోజు మరీ మురిపిస్తోంది. మాటలేం లేకుండా అలా కూర్చొని తదేకంగా చూడాలనిపిస్తోంది.

"మీకోసం యివి తెచ్చాను" అంది సుశీల సంచిలోంచి యేవో పాకెట్లు పుస్తకాలు బయటికి తీసి టేబిలు పై నుంచుతూ.

"మీ అభిమాన రచయిత యెవరో చెప్పండి. ఆ పుస్తకాలు తేవడానికి ప్రయత్నిస్తాను". అంది మళ్ళీ.

"నిన్న అడగడం మర్చి పోయాను మాటల ధోరణిలో. మీ కింకేమన్నా కావలిస్తే చెప్పండి, తీసుకొస్తాను." కాసేపాగి అంది.

"ఏమిటి, మాట్లాడరు?" సిగ్గుపడి తలదించుకుంది. సుశీల, నిశ్చలంగా రెప్పార్పక చూసే అతని కళ్ళలో ఆరాధనని తట్టుకోలేక.

"ఇవాళ కాలేజిలేదా?" రామ్మూర్తి అడిగాడు.

"మధ్యాహ్నం మానేశాను".

ఆరోజు ఆమె చేసిన అలంకారమంతా తనకోసమన్న ఆలోచన రామ్మూర్తిని గర్వపరిచింది. ఆమెది మెరుపులా కళ్ళు మిరుమిట్లు గొలపక చూసినకొద్దీ చూడాలనిపించి, సున్నితంగా లలితంగా మనసుని తాకే అందం. ఆ అందానికి తగ్గట్టు సింపిల్‌గా అలంకరించుకొని ఆమె చూపులు కలిగించే ఉన్నత భావాల్ని ద్విగుణీకృతం చెయ్యగల నేర్పు ఆమెకుంది. రామ్మూర్తి దృష్టిలో సౌందర్యానికర్థం అదే.

ఆరోజు రెండుగంటలు రెండు క్షణాల్లా

గడిచి పోయాయి. సుశీల ఏమేమో కబుర్లు చెప్పింది. రామ్మూర్తి గూడా యెన్నడూ లేని ఉత్సాహంతో మాటలు కలిపాడు. ఆమె వెళ్ళిపోవాల్సిన సమయం వచ్చింది.

"సుశీలా, మీకో ప్రార్థన".

"చెప్పండి".

"రేపట్నుంచి మీరె వస్తువులు తేవద్దు నాకోసమని."

"అదేం! నేను మీకేం యియ్యొదగని దాన్నా?"

"అదిగాదు, [illegible] మీరొచ్చి అందించే హాయి ముందు, యీ పుస్తకాల్ను, తినే పదార్థాలు ఏమిటో లాగనిపిస్తాయి. మీరు వెళ్ళాక, నాకింకేం చెయ్యాలని పించదు. చదవాలనిపించదు!

సుశీల ఒక్కసారి అతనివంక చూసి సిగ్గుపడి వెళ్ళిపోయింది.

మరినాలుగు రోజులు గడిచాయి.

ఆసాయంకాలం అతన్ని మరోధోరణిలో చూసింది సుశీల. ఏదోచెప్పలేని నిరాశ, నిస్పృహ గూడుకట్టుకున్నాయి. అతని మాటల్లో ఎప్పుడూ లేనంతగా అతనేదో గూట్లో దాక్కొని మాట్లాడుతున్నట్టుంది. ఆమె యెంత ప్రయత్నించినా అతని ధోరణి మారలేదు.

చివరికి వెళ్ళిపోబోతున్నప్పుడు,

"యివాళ మీరేమిటో లాగున్నారు నేను తెలుసుకో గూడదా?" అంది సుశీల బాధగా.

"మీరు యింకెవ్వరి దగ్గిరకీ వెళ్ళరేం? యీ రెండుగంటలూ నాఒక్కడి దగ్గరే యెందుకు్కుంటారు?" మెల్లిగా అడిగాడు రామ్మూర్తి.

"ఏం, మీకిష్టం లేదా?" క్రిందికి చూస్తూ అడిగింది సుశీల.

"నాబాధల్లా యిది నాకుమరీ యిష్టమయి, ఎప్పుడైనా మీరు రావీలులేకపోతే యెంత బాధపడాల్సి వస్తుందో అని!"

"నాకు రావడానికి వీల్లేక పోవడమంటూ వుండదు. ఎలాగైనా మీకు దగ్గిరగా ఉండలనే శాయశక్తులా ప్రయత్నిస్తాను". ఏదో ఉద్వేగంతో అనేశాక, ఆమాటలు యింకా యేవో యితర

ళాలు చెప్పగా, సెలవుతీసుకొని గబగబా వెళ్ళిపోయింది సుశీల.

అతర్వాత యింక మళ్ళీ మామూలుగా ఉల్లాసంగా కనబడలేదు. రామ్మూర్తి. ఎప్పుడూ యేవో ఆలోచనల్లో మునిగి ఉండేవాడు. అతనేం మాట్లాడకుండా ఆమెచెప్పేవే వింటూండేవాడు. ఒక్కొక్కప్పుడు ఆవినడంలో కూడా పరధ్యానం వచ్చేది. ఆమెనొచ్చుకుని మాటలువూనేస్తే క్షమార్పణ చెప్పుకొని ప్రాధేయ పడేవాడు ఆమె మనస్సు కరిగేదాకా. రోజులు గడిచిపోతున్నాయి. మొదటి రోజుల్నాటి పరిచయం, స్నేహం,యింకా ఆత్మీయమైన సంబంధంగా మారింది. ఆమెరాక ఒక్కక్షణం ఆలస్యమైతేఅతను భరించలేక పోయేవాడు. ఆమె సరిగ్గా నాలుగ్గంటలకి వొస్తుంది. ఆమెవున్నంత సేపూ ఆమెవంకే చూస్తూ ఆమెరూపాన్ని తనలో ఎప్పటికీ చెరగనట్లు ముద్రించుకోవాలని చూస్తాడు. ఆమెవెళ్ళాక తనలో పదిల పర్చుకున్న ఆమెరూపాన్ని మననం చేసుకుంటూ, ఆమెగురించే ఆలోచిస్తూ ఆమెరాకకి నిరీక్షిస్తూ మిగతా సమయం గడిచి పోతుంది.

ఒకరోజు సుశీలతోబాటు, ఆమెతండ్రి కూడా వచ్చాడు చూడ్డానికి. ఆరడుగుల భారీ మనిషి మల్కానీ. చాలా ఆప్యాయంగా పలకరించాడు. రామ్మూర్తికి తండ్రిమాటల్లో యెన్నడూ కనబడని ఆత్మీయత, ఆయన మాటల్లో కనిపించింది. రామ్మూర్తికదంతా విన్నాక ఆయన కనుకొలకుల్లో నీరునిండడం అతన్ని కదిలించింది.

"మీరుచేసిన యీత్యాగం విలువ దేశంలో చాలామందికి అర్థమవదు. యేదో కాలువిరిగి జీవితంలో దగా పడ్డారన్న మామూలు సానుభూతి తప్పించి యెన్ని వేలమంది భారతీయుల అవమానాన్ని, ధన, మాన, ప్రాణనష్టాన్ని బదులు తీర్చుకోడానికి మిమ్మల్నిమీరు బలి పెట్టుకున్నారో ఊహించలేరు. కళ్ళెదుట సర్వం కూలబడి పోతుంటే కట్టుబట్టల్తో, దక్కించుకున్న ప్రాణాల్తో రహస్యంగా యే ట్రక్కుల్లోనో, కంబళి చుట్టల మధ్యనో దాక్కొని తండ్రొకచోట, తల్లొక చోట, పిల్లలు మరోచోట అలా చెల్లా చెదరై పోయిన మాలాంటి వాళ్ళకి బాగా అర్థమౌతుంది.!'' అన్నాడు మల్కానీ.

ఆ తర్వాత రామ్మూర్తికి కొంతనయమయ్యాక అధికారుల ప్రత్యేకఅనుమతి మీద ఒకసాయంకాలం వాళ్ళయింటికి తీసుకు వెళ్ళింది సుశీల. ఆమె తండ్రి, తల్లి ఎంతో ఆదరంగా ఆహ్వానించారు. సుశీల అన్న సూరజ్ కూర్చునే చోటు, పడుకునే మంచం, అతను వాడుకునే టేబిల్ అలాగే యింకా యిప్పుడో వస్తాడన్నట్లు శుభ్రం చేసి ఉంచారు.

"క్రిందటి యాన్యువల్ లీవ్‌కి వచ్చాడు; అంతే, యింక మళ్ళీ చూడలేదు!'' అంది సుశీల తల్లి.

వాళ్ళ జీవితాల్లో యెన్నెన్ని కష్టాలను వించారో, అవమానాలు ఎన్ని సహించారో వూహిస్తున్నాడు రామ్మూర్తి. నిజంగా జరిగినవాటికన్నా వూహించుకున్నవి యింకా భయంకరంగా ఉంటాయి. సుశీల, సూరజ్ ఫోటోల ఆల్బం చూపించింది. అతను కాలేజీ రోజుల్నించీ మంచి హాకీ ఆటగాడు. సెలవులకు యింటికి వచ్చినప్పుడు గూడా, యింటిపట్టున ఉండకుండా యేవో ఆటలపోటీలకని చండీఘర్, లక్నోవగైరా యితర వూళ్ళకి వెళ్తుండేవాడు. తండ్రిలాగే పొడుగ్గా దానికి తగ్గలావుగా ఉండే విగ్రహం అతని చావు వాళ్ళ నెంతగా కదిలించి ఉండలో రామ్మూర్తి అర్థం చేసుకో గలడు. యిప్పుడిక సుశీలే వాళ్ళకి సర్వం.

భోజనమయ్యాక బయటలాన్లో మల్కానీ, రామ్మూర్తి కూర్చొన్నారు. సుశీల లోపలెక్కడో తల్లికి పనుల్లో సహాయపడ్తోంది.

"మీరేమనుకోనంటే కొన్ని విషయాలు చెప్తాను.'' అన్నాడు మల్కానీ మాటల సందర్భంలో.

"చెప్పండి."

"ఈ కాలంలో చాలామందికి పైమెరుగులపై నున్న అభిమానం, గౌరవం మనిషి అసలు విలువమీద ఉండవు. చాలామందికి డబ్బు, డిగ్రీలు, అందచందాలు తప్పించి సంస్కారం, నైతిక విలువలు ఉండవు. చిన్నప్పుడు చదువుకున్న యింగ్లీషు పద్యమొకటి జ్ఞాపకమొస్తోంది. ఆమె అంటుంది, 'నాయీ గులాబి చెక్కిళ్ళ కోసం, మబ్బులాంటి నల్లని కురుల కోసం శరీరపు యితర వంపుసొంపులకోసం నన్ను కోరకు, యివన్నీ రేపు మాయమవచ్చు. కాని యివేవీ లేకపోయినప్పుడు కూడా నన్నింకా నువ్వు కోరేట్టయితే, నీదాన్నవడానికి నాకభ్యంతరంలేదు.!' అని! ఆగేయం మీరు చదివారా?''

"చదివినట్టే గుర్తు".

"మా అమ్మాయి యిలా భౌతిక విలువల్ని మించిన ఉన్నత స్థాయిలో ఆలోచించ గలిగి నందుకు నాకెంతో గర్వంగా ఉంది. దేశంకోసం మీరుచేసిన త్యాగం, ఆత్యాగానికి ప్రతిగా యే పొగడ్తలూ, సానుభూతులు కోరని మీవినయం, ఎవరూ లేని యీ వొంటరితనాన్ని యెదుర్కొంటున్న మీ మనోనిబ్బరం, ఆమెని కదిలించాయి. అసలు మొట్టమొదటి రోజు మీరామెనుంచి గులాబి అడిగి తీసుకొని ఆమెకిచ్చిన ప్రత్యేకత, ఆమె మిమ్మల్నెన్నటికీ మర్చిపోకుండా చేసింది.

ఆ సంగతి వాళ్ళఅమ్మ ద్వారా నాకు మొన్న గాని తెలిసిందికాదు! జీవితంలో తనకో ప్రత్యేకమైన విలువనిచ్చిన వ్యక్తికి సహచారి కావడం కన్నా ఆనందకరమైంది యింకోటుండదు. అందులోనూ ఆవ్యక్తి ఉన్నత లక్ష్యాలు గలవాడు, ఆదర్శంగా నడుచుకునేవాడు అయినప్పుడు అంతకన్నా కావల్సిందేముంటుంది?''

రామ్మూర్తికి యీ సమస్యని యెప్పటికో అప్పటికి యెదుర్కోక తప్పదని తెలుసు. ఆమెచూపులు, మాటలు ఆమెకి తన యెడలఉన్న సద్భావాన్ని యేమాత్రం దాచలేదు. అందుకే అతను లోలోపల మధన

వదిలేసాడు? — యేమని సమాధానమివ్వాలా అని. సుశీలయెంతో అందమైనది, చదువుకున్నది. ఆమె శారీరక సౌందర్యంకన్నా, కళ్లలో వెలిగే ఆత్మీయమైన ఆమె సౌందర్యం, అతన్ని ముగ్ధుణ్ని చేస్తోంది. ఆ కళ్లు అతన్ని సర్వదా వెంటాడి, ఊహకందని యేవో ఉన్నత శిఖరాలవైపు పిలుస్తాయి. వాటి లోతుల్ని అందుకోమని ప్రాధేయ పడతాయి! అయితే—

తన స్వార్థంకోసం ఆమెకో అవిటివాణ్ని అంటగడ్తాడా? ఆమెసౌందర్యానికి సౌహార్దానికి ప్రతిఫలం, జీవితానికి వ్యర్థుడైన తనతో ఆజీవితాంతం సహచర్యమా?

"మీరు యిప్పుడే చెప్పక్కర్లేదు. బాగా ఆలోచించండి. సుశీల మనసారా, మీ సహచారిణిగా జీవితాంతం మీకు సేవ చెయ్యాలని కోరుకుంటోంది. నాకు కొడుకయినా, కూతురయినా ఆమె ఒక్కతే. యీ యిల్లు, నేను సంపాదించిన కాస్తో కూస్తో అంతా ఆమెదే. పైగా సుశీల పెద్దచదువు చదువుతోంది. నేనున్నంతకాలం ఆమె ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేకపోయినా, ఆతర్వాత మీ కిష్టమైతే, సుళువుగా యేదో ఉద్యోగం సంపాదించగలదు. మీరు నిశ్చింతంగా విశ్రాంతి తీసుకోవచ్చు. మీకే లోటు జరగదు. మీ కోసం మా చేతనయినంత చేయగలిగామన్న తృప్తి మాకుంటుంది. అన్నింటి కన్నా ముఖ్యం, సుశీల ఆనందం. ఆమె కింతకన్నా కావాల్సిందేం లేదు...."

రామ్మూర్తి జీవితాని కంతకీ అది కఠిన పరీక్ష. ఎప్పుడూ లేనంతగా సరైన దృష్టితో వ్యవహరించాలి. అందుకు యెంతో నిబ్బరం కావాలి. రామ్మూర్తి ఒక నిర్ణయానికి వచ్చాడు.

"క్షమించండి. సుశీల చాలా యోగ్యురాలు. ఆమెకి తగినవాడు నాకన్నా యెంతో ఉన్నతుడయుండాలి. ఆమెని నేను మనస్ఫూర్తిగా గౌరవించిన మాట నిజం. కాని యెప్పుడూ ఆమె నా దృష్టితో చూడలేదు... పైగా నా కింతకుముందే మరొకరితో వివాహం నిశ్చయమైంది!"

మల్కానీ ఆశ్చర్యపోయి చూశాడు.

"మీకెవరూ లేరన్నారు! అసలు యీ సంగతి సుశీలతో మాచాయగానన్నా యెప్పుడూ చెప్పినట్టు లేదే!..యిది నిజమా?"

రామ్మూర్తి మాట్లాడలేదు.

"పోనిండి, మీ వ్యక్తిగత విషయాలు సరిగ్గా తెలియక మీకేమన్నా యిబ్బంది కలిగిస్తే....మన్నించండి....ఆమె యెవరో, అదృష్టవంతురాలు!"


ఆతర్వాత రామ్మూర్తిని తిరిగి హాస్పిటల్లో దిగబెట్టింది సుశీల. దారిలో ఆమేం మాట్లాడలేదు. తిరిగి వెళ్లిపోతుంటే ఆమె యేదో మాట్లాడబోయింది. ఆ గొంతు వణకడం గమనించాడతను.

"మీరు నా దగ్గర దాస్తారనుకోలేదు! అయినా, యిది అందరికీ చెప్పక్కర్లేని వ్యక్తిగత విషయమన్నమాట నిజమే ననుకోండి. కాని యేమిటో, మీకూ నాకూ మధ్య యెలాంటి దాపరికాలు ఉండవనుకోడం నాదే పొరబాటు......!"

రామ్మూర్తి కెలా చెప్పాలో అర్థమవలేదు.

"సుశీలా, నన్ను క్షమించండి. యీ జీవితంలో నేనెవ్వరితోనైనా మనసు విప్పి మాట్లాడ్తుంటే అది మీ ఒక్కరితోనే!... యీ సంగతి చెప్పడానికి యింతకుముందు ఆ సందర్భం రాలేదు, అంతేగాని మీనుంచి దాచాలనిగాదు. నన్నర్థం చేసుకోండి."

"ఆమెకి నా అభినందన లందజేయండి." సుశీల వెళ్లిపోయింది.



ఆ తర్వాత కూడా రోజూ 'ఆమె' యెప్పట్లా వచ్చి కబుర్లు చెప్తూనే వుంది. కాని ప్రశాంతమైన ఆమె చూపులు మరింత ప్రశాంతమయ్యాయి. నిర్మలమైన తృప్తి ఆనందాలతో వెలిగే ఆమె మొగంలో కాంతి కొంత కొడిగట్టినట్టయింది. కాని ఆమెని చూసినప్పుడల్లా రామ్మూర్తి గుండెలో రేగే భరించలేని అలజడి ఆమె కర్థం గాదు. యెంతటి దైన్యాన్ని, విషాదాన్ని అతను దిగమింగాడో, ఎలాగో నవ్వుతూ పలికే మాటల వెనక అతనెంతటి వ్యథ పోగుజేసుకున్నాడో, ఆమె ఊహించలేదు.

మరికొన్ని రోజులకి అతన్నిపూనా, 'ఆర్టిఫిషల్ లింబ్ సెంటర్' మార్చారు. ఆఖరి రోజు అతనికి వీడ్కోలివ్వడానికి స్టేషనుకి వచ్చి, రైలు కదలబోతుండగా చెయ్యాడిస్తూ నిలబడ్డ సుశీలకి, అతను ప్రతిగా చెయ్యి ఆడించక, గిరుక్కున వెనక్కి తిరిగి మొగందాచుకున్నప్పుడు, యేదో అర్థమయినట్టయింది.!

కర్రకాలు తగిలించుకొని నడవడానికి ప్రయత్నిస్తున్నాడు రామ్మూర్తి. సాయంకాలాలు ఆరుబయట కుర్చీ వేయించుకుని, ఒక్కడూ ట్రాన్సిస్టరు పాటలు వింటూండడమొక్కటే అతని కాలక్షేపం. ఒకోసారి ఆ పాటలు యేవో జ్ఞాపకాలు తెస్తాయి, యెన్నటికీ విడవక వెంటాడే జ్ఞాపకాలు! వెంటాడి, గుండెని నమిలే జ్ఞాపకాలు!

"కభీ తన్ హాయియోంమే, హమారీ యాద్ ఆయేగీ...." యెలుగెత్తి సాగదీసి పాడుతోంది ముబారక్ బేగం. పాటలో తన్మయుడై వింటూంటే రామ్మూర్తి కళ్లు చెమర్చాయి.

"ఈ పాట కోరినవారు..... ఢిల్లీనుంచి సుశీలా మల్కానీ..." అని ప్రకటించింది రేడియో. ●



పరీక్షణం

ఉన్నవ విజయలక్ష్మి

జ రి గి న క థ

తన్నాదరించేవారులేక ఆత్మహత్య చేసికోబోతున్న రాధను ఆ ఊరి డాక్టరు వేణు రక్షిస్తాడు. వేణు రాధల పరిచయం ప్రేమగా పరిణమిస్తుంది. తమ పరిచయం విషయం స్నేహితురాలు పార్వతికిచెపుతూ, తమ వివాహం జరుగుతుందని నమ్మకంలేదని, తన జీవనోపాధికి తనకేదైనా మార్గం చూపించమని కోరుతుంది. పార్వతి సరేనంటుంది ఒక సందర్భంలో క్షణికోద్రేకానికి లోనై హద్దుల నతిక్రమిస్తారు వేణు, రాధ. తను పెళ్ళికై తలిదండ్రులను వొప్పిస్తానని వెళ్ళిన వేణువద్దనుంచి ఉత్తరం రాలేదని రాధ కలవరపడి, నిరాశచెంది, ఉద్యోగాన్వేషణకై పార్వతి వద్దకు వెళ్ళిపోతుంది. పార్వతి సాయంవల్ల ఉద్యోగం లభిస్తుంది రాధకు. అనుకోకుండా రఘు తల్లిదండ్రులు రావటంతో రాధగుట్టు బట్టబయలవుతుంది.

13

కొడుకూ కోడలు ఒకరి ప్రక్కగా వొకరు, ఇంచుమించు చెట్టాపట్టాలు వేసుకున్నట్లు మేడ దిగిరావడం చూసిన జానకమ్మగారి కళ్ళు భగ్గున మండిపోయాయి.

"ఇంకా ఈవిడగారు తెమలలేదల్లే వుందే?" అంది చిరచిరలాడుతూ.

"తను రాదమ్మా ఇంకా వంటపని అదీ ఉందిగా. మనం వెళ్దాం. నాన్నగారు రెడీగా ఉన్నారా?"

"ఆ. ఆయన తెమిలి ఏ జామయింది. నీకోసమేచూస్తూ వాకిట్లో కూర్చున్నారు" అంది, కొర కొర కోడలివంక చూస్తూ.

"బుష్‌కోటు బటన్సు విరిగిపోయాయి. అవి కుట్టించుకుని తొడుక్కువచ్చేసరికి ఆలశ్యం అయిపోయింది" అంటూ తల్లికి సంజాయిషీ చెప్పుకొని కారు దగ్గరికి వెళ్ళాంతా.

"వూరంతా అదివరకు చూసిందేకదా. ఏదైనా సినిమాకివెళ్దాం" అంటూ కొడుకుని అనుసరించింది జానకమ్మగారు.

"బ్రతికించావుతల్లీ. ఎప్పుడొస్తారో అని నేను బెదురుతూ కూర్చొ నక్కర్లేకుండా, రాధతో మాట్లాడుకోడానికి రాత్రి తొమ్మిదిన్నరదాకా గడువిచ్చావు" అని మనస్సులోనే అత్తగారికి కృతజ్ఞత తెల్పుకుంది పార్వతి.

తలుపు చప్పుడు విని కళ్ళు తుడుచుకుని లేచి వెళ్ళి తలుపుతీసింది రాధ. పార్వతి మవునంగా లోపలికొచ్చి తలుపులు దగ్గరగావేసింది. కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"ఇంతక్రితం మాయింట్లో జరిగిన గొడవంతా వినిపించేవుంటుంది. అవిడైనా ఏదో సర్దుకుపోతారనుకున్నానుకాని ఎదుటి మనిషిని యింతగా అవమానిస్తారని అనుకోలేకపోయాను. నన్ను క్షమించురాధా. నిన్ను పిలిచి ఇంట్లో పెట్టుకుని చెప్పుతీసికుని కొట్టినట్లు చేశాం చివరికి" అంది రాధ రెండు చేతులు పట్టుకుని.

ఇంతవరకు నిగ్రహించుకున్న దుఃఖం ఒక్కసారి పొంగి పొరలినట్లయింది. ఆచేతులలో అలాగే వాలిపోయి పార్వతి భుజం మీద తల ఆనించి ఆ దుఃఖోద్వేగం ఉపశమించేదాకా రోదించింది రాధ.

"నా మాటకేం. నన్ను గురించి ఆవిడ అంత నీచంగా వూహించుకుంటున్నారే అన్న బాధకన్న, మీరు కూడ అవమానాలపాలు కావలసి వచ్చిందనేదే నన్నెక్కువ బాధిస్తోంది. నన్ను తోబుట్టువులాగే ఆదరిస్తున్నారనే సంతోషం, పరితృప్తి తప్పితే అసలిలాంటి అనుమానానికి ఆస్కారం ఉంటుందనే విషయమే నాకు తట్టలేదిన్నాళ్ళు. నా గురించి మీ కుటుంబంలో కూడ కలతలు రావడం నేను సహించలేను.

నా బ్రతుకు నడి సముద్రంలో నావలా వున్న స్థితిలో నన్నాదరించావు. మీ మేలు ఎప్పటికీ మరిచిపోను. ఇప్పుడు నాకో బ్రతుకు తెరువు దొరికింది. బ్రతికి తీరాలనే ఆకాంక్ష బ్రతకగలననే ఆత్మవిశ్వాసం కలిగాయి. నే నింక ఎక్కడైనా యిల్లు చూసుకొని వెళ్ళిపోతాను ఒకటి రెండు రోజులలోనే".

"నేనూ అదే చెప్దామనుకుంటున్నాను. ఈవిడిలా రోజూకోరకంగా గొడవలుచేస్తుంటే భరించడం నీకూ నాకూ కూడా కష్టమే. ఎక్కడవున్నా మా సహాయం నీ కెప్పుడూ ఉంటుంది. ఇలా చెప్పవలసి వచ్చినందుకు నా కెంతో సిగ్గుగావుంది. నీ కిచ్చిన మాట చివరిదాకా నిలబెట్టుకోలేకపోయిన మా అశక్తతకి మన్నించు."

"ఇందులో నీవు సిగ్గుపడవలసిందేమీ లేదు. నీకు చేతనయినదంతా చేశావు. ఇంకా నా దురదృష్టమే నన్ను వెంటాడుతూ ఈమాత్రం ప్రశాంతంగా బ్రతికే అవకాశం కూడ లేకుండా చేస్తోంది. కొత్త యింట్లో క్రొత్త వాతావరణంలో ఇంకా ఎన్ని చిక్కులు పడాల్సివస్తుందోనని తలచుకుంటేనే వళ్ళు జలదరిస్తోంది. అయినా ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. మన్వేమీ బాధపడకు" అని రాధే పార్వతికి ధైర్యం చెప్పింది.

"అలాగని తొందరపడి ఏదో వో ఇల్లు కుదుర్చుకోకు. అన్ని విధాల అనుకూలమైన ఇల్లు దొరికేదాకా ఇక్కడే ఉండు మరేం ఫరవాలేదు."

"అన్నట్లు మీ ఇందిరమ్మగారు కట్టించిన క్రొత్త బ్లాకులో క్లాసులుపెట్టారా?" అంది చటుక్కున ఏదో జ్ఞాపకంరాగా.

"ఇంకా లంతమంది పిల్లలేరీ. వచ్చే సంవత్సరం దాని అవసరం రావచ్చు.అయినా

ఇంకా కొన్ని పనులు కూడ ఉండిపోయి వట్నున్నాయి. ఎందుకలా అడిగావు? అది నా కిస్తారేమోననా?"

"అవును. ఏం. మీాదటికి అది వాళ్లకి కావలసివస్తే అప్పుడే నువ్వింకో ఇల్లు చూసుకోవచ్చు. రెండు గదులు బాతురూము, లెట్రిన్ ఉన్నాయిగా. పోనీ అడిగిచూస్తే సరి. వెళ్దాం పద" అంది పార్వతిలేస్తూ.

"నువ్వు కూడ ఎందుకూ. మళ్లీ అదో గొడవ రావడానికా. నే నొక్కదాన్నివెళ్ళి కనుక్కుంటాలే."

"మరేం భయంలేదు. నీతో అన్ని సంగతులు మాట్లాడ్డానికి నాకు వీలుగా ఉండాలనే వాళ్లని ప్రయాణంచేసి తీసుకు పోయారు. మా అత్తగారికి సినిమామీాద మనసుపోయింది. అందుకే మనకి కావలసి నంత వ్యవధివుంది. నేను చీర మార్చుకుని వస్తాను. నువ్వూ తయారయి తలుపులు వేసేసిరా" అని లేచింది పార్వతి.

*   *   *

పార్వతి చెప్పినదంతావిని నిర్ఘాంతపోయింది ఇందిరమ్మగారు.

"అసలు మీా రిద్దరూ ఈవేళప్పుడు రాగానే ఏదో విశేషం ఉండి ఉంటుందను కున్నాను. ఉంటారమ్మా అలాంటి మను ష్యులుకూడ. వాళ్లకి నచ్చచెప్పడానికి ప్రయత్నించి ఏం లాభంలేదు.

"ఆ బ్లాకు తయారయిపోయిందిలే. దాని అవసరం వచ్చినప్పుడు చూసుకోవచ్చు. అం దాకా రాధ ఉండడానికి నాకేమీా అభ్యం తరంలేదు. కాకపోతే చిన్న చిన్న పనులేవో ఉండిపోయాయి. పనివాళ్లు వచ్చినప్పుడు కాస్త ఇబ్బందిగా ఉంటుందనుకో. దానికీ సర్దుకోవచ్చు.

"మొన్ననే మంచిరోజు చూసి ఆ గదులు కడిగించి కాసిని పాలు పొంగించాం. ఇప్పుడే వచ్చి అందులో చేరవచ్చు" అందావిడ.

పార్వతి రాధ మొఖాలు చూసుకున్నారు. "ఇదేదో ఋణానుబంధమే" అన్న భావం కలిగింది వారికి.

"ఔను పార్వతీ మళ్లీ మీావాళ్లు వచ్చే లోగా మీా ఇల్లు ఖాళీ చేసేస్తే బాగుం టుందేమో.

ఉన్న సామానుతో సగంపైగా నీదేకదా. మిగతాది ఏ రెండు మూడు రిక్షాలలో సరిపోతుంది. ఎలాగో త్వర త్వరగా సర్దు కుని వచ్చేస్తాను" అంది రాధ పార్వతి ఏమాటా చెప్పేలోగానే.

"సరే. అలాగే చేద్దాం పద. నిన్ను మళ్లీ ఇక్కడ దిగబెట్టి నే నింటికెళ్ళి పోతాను" అంటూ పార్వతి లేచింది.

"మళ్లీ నువ్వు రావడం ఎందుకు. నే నొక్కదాన్ని రాగలను. నీ కింట్లో బోలెడు



నిరీక్షణ

కాని అదీ ఉంది కూడానా."

"నా కా మాత్రం తృప్తైనా ఉండనీ. నువ్వేమీ అభ్యంతర పెట్టకు. ఆ కాస్త వంటవాళ్ళు వచ్చేసరికి చెయ్యలేకపోనులే." అంది పార్వతి.

పార్వతి బాధపడుతోందని గ్రహించిన ఇందిరమ్మగారు, "సరే నీ యిష్టం. నీ కా మాత్రం బాధ ఉండడం సహజమే. మేమందరం వద్దని చెప్పినంతమాత్రాన పోయేదికాదు" అంది.

ఓ గంటలో వచ్చేస్తామని చెప్పి రాధ పార్వతి ఇంటి ముఖం పట్టారు.

* * *

సోఫాలో వెనక్కి వాలి, కళ్ళమీద అర చేయి ఆనించుకుని భావనా ప్రపంచంలో విహరిస్తున్న వేణు, భుజాలమీద మృదువైన స్పర్శ తగలడంతో ఉలిక్కిపడి కళ్ళ మీదనుండి చేయి తీసేసి ఎదురుగావున్న స్నేహితుడిని చూసి నవ్వడానికి ప్రయత్నిస్తూ సర్దుకుని కూర్చున్నాడు.

"ఎంత సేపయింది నువ్వొచ్చి" అన్నాడు డాక్టరు శ్రీరామ్ వేణు ప్రక్కనికూర్చుంటూ, అంతని మొఖంలోకి పరీక్షగా చూస్తూ.

"ఆ. అరగంట యుంటుందేమోలే" అన్నాడు వేణు పరధ్యానంగానే.

"ఏమిటో నీ బాధ. ఎంతడిగినా చెప్పవు కదా. నీలో నీవే కుమిలిపోవడంతప్ప.

ఏదైనా కాలక్షేపం అయినా వుంటే కాస్త మనుష్యులలో పడతావేమోనని బలవంతాన ఈ ఉద్యోగంలో చేర్పించాను నిన్ను. అయినా నీ బాధ నిన్ను వదలలేదు. సరే. ఇదేమిటో చూడు" అంటూ వో కవరు జేబులోనుండి తీసి వేణుచేతిలో పెట్టాడు శ్రీరామ్.

దానిమీది ఎడ్రసుచూస్తూనే తెల్లబోతూ, "ఇదేమిటి? ఈ ప్రకాశరావు గారి తాలూకెవరైనా ఇక్కడున్నారా? ఆయనకి వాళ్ళు వ్రాసిన ఉత్తరం నీ చేతి కెందు కొచ్చింది" అన్నాడు కొంచెం కుతూహలంగా.

"అదంతా వో కథలే. ఆ ప్రకాశరావు గారి బావమరిదేట ఆంజనేయులని మా ఆస్పత్రిలో ఉన్నాడు" అన్నాడు వేణు మొఖంలోని భావాలని పరీక్షగా గమనించుతూ. తనాశించిన ఫలితం కనిపించడంతో మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు. "రెండు మూడు రోజులక్రితం వంటిమీద స్పృహైనా లేని స్థితిలో ఎవరో తీసుకొచ్చి అతన్ని ఆస్పత్రిలో ఎడ్మిట్‌చేసి వెళ్ళిపోయారు. రెండింజక్షన్లు ఇచ్చాక తెలివి వచ్చింది. అయినా ఆరోగ్యంపూర్తిగా పాడయిపోయిందేమో. ఇంకా కొన్నాళ్ళు ఆస్పత్రిలో ఉండాల్సివస్తుంది. అతను శారీరికంగా కంటె మానసికంగా మరీ బాధ పడిపోతున్నాడు. తనెన్నో పాపాలు చేశాననీ, వాటికి ప్రాయశ్చిత్తంలేదనీ, తను బ్రతికుండి ఎవరి మొఖం చూడలేననీ, ఇలాగే జబ్బుతో తీసుకుని చచ్చిపోతాననీ ఒకటే గొడవ. మందుకూడ తీసుకోనంటాడు.

"కొంచెం మంచి మాటలతో నెమ్మదిగా అతని అమనస్సులో ఉన్నదేమిటో కనుక్కో. ఇతను చెప్పకపోతే వాళ్ళ వాళ్ళెవరైనా వచ్చినప్పుడు అడుగు. నయానో భయానో మందు మాత్రం మింగించు, అని చెప్పాను నర్సుతో.


"అయ్యో అతని కెవరూ లేనట్టున్నారండీ! అంత వళ్ళు తెలియని స్థితిలో ఉన్నప్పుడు కూడ అతనికోసం ఎవరూ వచ్చినట్టు లేదు" అన్న దామె.

"అయితే అందుకే బాధ పడుతున్నాడేమో అసలు ఎక్కడున్నారో ఏమిటో. తెలుసుకో' అని చెప్పి నేను వార్డులోంచి వచ్చేశాను."

సాయంత్రం డ్యూటీ అయిపోయాక వచ్చేస్తూ మళ్ళీ ఆ నర్సు అడిగాను యథాలాపంగా ఆ పేషెంటు సంగతి.

"నేను మొదట ఎన్ని విధాల అడిగినా ఆయన ఏమీ చెప్పలేదు. 'నా పాపాలకి నిష్కృతిలేదు నా మొఖం ఎవరికీ చూపించలేను. అందుకే నన్ను చచ్చిపోనివ్వండి' అన్న మాట తప్ప ఇంకో గొడవేలేదు. చివరికి ఎన్నో విధాల బ్రతిమాలి ఎన్ని పాపాలు చేసినా దానికి శిక్ష అనుభవించడం అయిపోయింది. కనక ప్రాయశ్చిత్తం జరిగినట్లేనని, తను పశ్చాత్తాపపడి వారిని క్షమార్పణ కోరుకుంటే ఈ ఆవేదన తగ్గిపోయి, మనసూ ప్రశాంతంగా నిర్మలంగా ఉంటుందనీ నచ్చ చెప్పాను."

"సిస్టర్. నే నొక అమాయకురాలి జీవితంతో చెలగాటమాడాను. ఆమె బ్రతికుందో చచ్చిపోయిందో కూడ నాకు తెలియదు. అయినా ఆమెతో ఎలాంటి కళంకమూలేదని, ఆమెని వెతికి తెచ్చుకుని పూర్వంలాగే ఆదరించమని వాళ్ళవాళ్ళని అర్థించేదాకా నాలో ఈ ఆవేదన చల్లారదు. వాళ్ళకి ఉత్తరం వ్రాసేశక్తి కూడ నా చేతుల్లోలేదు. నామీద దయవుంచి ఆ ఉపకారం చేసిపెడతారా?" అంటూ ప్రాధేయపడ్డాడు.



"అలాగే వ్రాస్తాను. ముందు మీ రీ మందు త్రాగేయండి" అన్నాను.

"ఏమనుకున్నాడో ఏమో నోరుతెరిచాడు. మిగతా పేషెంట్సందరికీ కూడ మందులిచ్చి, వో కాగితం కలం తీసుకుని వో కుర్చీ అతని మంచం దగ్గరగా జరుపుకుని తీరుబడిగా కూర్చున్నాను ఉత్తరం వ్రాయడానికి. అబ్బ ఎంత పెద్ద ఉత్తరమో చూడండి. దీని కింకా స్టాంపులు అతికించాలి" అంటూ ఈ కవరు చూపించింది నర్సు.

"సభ్యత కాదనుకుంటూనే, కుతూహలం ఆపుకోలేక ఉత్తరం తీసుకుని చదివాను. ఆ వూరు నీ ఇదివరలో ఉద్యోగం చేసి వదిలి వేసిన వూరే కావడంతోనూ, అందులో వున్న పేరు కూడ నీదే కావడంతోనూ, కొండంత ఉత్సాహంతో నీకు చూపించుదామని తీసుకొచ్చాను. దీనివలన నీ సమస్య పరిష్కరింపబడి, నువ్వూ అందరిలాగా సంతోషంగా ఉండగలవనిపిస్తోంది. తీసి చదువు" అన్నాడు.

వణుకుతున్న చేతులతో దాన్ని విప్పి చదువుకోడం మొదలుపెట్టాడు వేణు.....

బావగారూ,

ఈ సంబోధన, క్రింద సంతకం చూస్తూనే క్రోధావేశాలతో ఈ ఉత్తరం చింపిపారవేయ వద్దని నేను మొదట్లోనే మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. ఉత్తరం చివరిదాకా చదివితే మీ కనేక విషయాలు తెలియగలవు. ఇందులో నన్ను క్షమించమని నేను ప్రాధేయపడటం లేదు. నేనా అర్హత ఏనాడో పోగొట్టుకున్నాను. కాని అమాయకురాలైన రాధ ఉనికి తెలుసుకుని ఆమెని తిరిగి ఎప్పటిలా ఆదరిస్తారనే ఆశతో ఈ ఉత్తరం వ్రాయిస్తున్నాను.

అసూయతో, ప్రతీకార జ్వాలతో నేను జరిపిన అక్రమాలకి ఆమె ఆత్మహత్య చేసుకుందేమోననికూడ నాకు అప్పుడప్పుడనిపిస్తుంటుంది. అలా జరిగిననాడు నా పాపానికి శిక్ష అనేది కూడ ఉండదేమో. కాదు, ఆమె ఎక్కడో బ్రతికే ఉంటుంది సుఖంగా. అని నాకు నేనే ధైర్యం చెప్పుకుంటూంటాను. నా అపరాధాన్ని మీముందు ఒప్పు

నిరీక్షణ

కుని ఆమెలో ఎలాంటి దోషము కళంకము లేవని మీకు తెలియజేయడం నా బాధ్యతగా గుర్తించాను ఇన్నాళ్ల తరువాతయినా.

మొదటిసారిగా రాధని మీ ఇంట్లో చూసీ చూడగానే నాలో ఏవో వింత కోరికలు మేల్కొన్నాయి. అంతక్రితమే రాధ భర్త పోయాడనీ, ఆమె మీ దగ్గరే ఉంటోందనీ అక్కయ్యద్వారా వినివుండడంచేత, నెమ్మదిగా ప్రయత్నిస్తే రాధని లొంగదీసుకోవచ్చుననే ఆశ ఆక్షణంలోనే కలిగింది.

క్రమంగా రాధతో పరిచయం చేసుకుని ఏదో మంచి చెడూ మాట్లాడుతూ ఆమెతోనే ఎక్కువసేపు ఖబుర్లు చెపుతూ కూర్చొబోయేవాడిని. నేను ఎంత చనువుగా ఉందామని ప్రయత్నించినా ఆమె ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండేది.

ఓ రెండు మూడు నెలలు ఓపికగా ఆమె స్నేహంకోసం ప్రయత్నించాను. ఏమీ లాభం కనిపించకపోవడంతో నాలో సహనం చచ్చిపోయింది. అదీ కాకుండా రాధ కూడ ఇంట్లో వాళ్లకి భయపడి నాకు అలా దూరంగా ఉంటోందేమో. అసలు నా ఉద్దేశ్యం తనకి అర్థం అయిందో లేదో అనుకొని చొరవచేసి యింకొంచెం చనువు తీసుకోవాలనుకున్నాను.

ఓరోజున మీరెవరూ ఆ చుట్టుపట్లలేని సమయంచూసి నెమ్మదిగా వంటింట్లోకి వెళ్లి పీటవాల్చి ఉకూర్చున్నాను. నన్ను చూసి మొఖం చిట్లించుకుంది రాధ. నే నదేమీ గ్రహించనట్లు రాధతో ఖబుర్లు మొదలుపెట్టాను. కాస్సేపు అదీ యిదీ మాట్లాడి మాటిగా అర్థం అయ్యేలా నా ఉద్దేశ్యం తెలియజేశాను. అంత చిన్న వయస్సులో భర్తని పోగొట్టుకున్న తను, మోడులాంటి జీవితం గడపడం ఏమీ బాగుండలేదనీ, తన సుఖం తను చూసుకోవడంలో తప్పేమీలేదనీ చెప్పాను. నా మాటలను విన్న ఆమె మొఖంలో కళ్లల్లో క్రోధం, అసహ్యం అవమానం నేను స్పష్టంగా చూడగలిగాను.

ఏం గొడవ చేస్తుందో. మీరంతా వచ్చేస్తారేమో, ఎలా తప్పించుకోవడమా అని అని ఆలోచిస్తూంటే ఎంతో సౌమ్యంగానే నన్నడిగింది రాధ.

"నామీద అంత అభిమానం ఉన్నప్పుడు మీరే నన్ను పెళ్లి చేసుకోకూడదా" అని.

ఆ ప్రశ్నతో నాలో కోపం హద్దులు దాటిపోయింది. తన భావాలు కూడ నావాటికనుకూలంగా వుంటాయేమోనని ఓ ప్రయత్నం చేసి చూశానేకాని, తనని పెళ్లి చేసుకుని, యావజ్జీవితం నా మెడకొక గుదిబండని తగుల్చుకోవాలని నే నెప్పుడూ అనుకోలేదు. అసలు, వితంతుని వివాహ చేసుకోగలిగేంత విశాలహృదయమూ, అభ్యుదయ భావాలు నాలోలేవు.

తన కలాంటి కోర్కెలేమీ లేవని తప్పించుకోకుండా, నన్ను పెళ్లి చేసుకుంటావా అని సవాలు చెయడం నన్నవమానించడంగానే భావించుకున్నాను. అంతక్రితంవరకు ఆమెమీదవున్న వ్యామోహావు మత్తు విడిపోయి పగ, ప్రతీకారేచ్ఛ స్థావరమేర్పరచుకున్నాయి. ఎలాగైనా ఆమెని అవమానించాలనీ, ఆమె బ్రతుకు నలుగురిలో నగుబాట్లు పాలయేలా చేయాలనీ దృఢంగా సంకల్పించుకున్నాను.

తగిన సమయంకోసం చూస్తున్న నేను అనుకోకుండా మార్యం మేష్టారితల్లి వూరికివెళ్లి ఆయన ఒంటరిగావున్న అవకాశం వినియోగించుకున్నాను. రాధ ఆయనకి వ్రాసినట్లు నేనే ఓ ఉత్తరం పుట్టించి మీకూ చూపించాను.

ఆ ఉత్తరంచూసి అక్కయ్య రాధని నానా మంటలు అంటూంటే నేను తృప్తిగా సంతోషంగా వూపిరి పీల్చుకున్నాను. అసలు మొదటినుండీ అక్కయ్యకి రాధంటే అభిమానంలేదు. తలచెడి తనకి భారంగా వచ్చిందని విసుక్కుండేది కూడాను. ఆసంఘటనతో రాధంటే అసహ్యం కూడ కలిగింది. కాని మీరు మౌనంగా ఉండిపోవడంతో ఇంక ఎక్కువకి ఏమీ చేయలేకపోయింది.

(సశేషం)

వారఫలం

17-6-1966 శుక్రవారం మొదలు
23-6-1966 గురువారం వరకు.

మేషం : ఈవారం బాగా ఉంటుంది. వృత్తిలో పోటీదారిపోటీని యెదుర్కొని అనుకూలతను సాధించ గలరు. వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో మిత్రుల సహకారం లభిస్తుంది. ఇదివరకు కొన్ని వ్యవహారాల చిక్కుల్లో వుండిపోయిన డబ్బు యిప్పుడుచేతికి వస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాలు బలహీన పడే సంఘటనలు జరుగుతాయి. కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా నెరవేరతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. శుభకార్యాల విషయంలో మీ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

వృషభం : వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం వలన ముందుముందు యిబ్బంది కలుగుతుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. ప్రయాణాలు కొంచెం శ్రమమీద ఫలిస్తాయి. సాంఘిక కార్యక్రమాల్లో పలుకుబడి బాగా ఉంటుంది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది.

స్త్రీలకు—కుటుంబవ్యవహారాలు బాగాఉంటాయి. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మిథునం : వారంప్రారంభంలో వృత్తివ్యాపారాల్లో ఆందోళన కలిగించే పరిస్థితులు ఏర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో యితరుల జోక్యంవలన నష్టం వస్తుంది. ఉద్యోగంలో మీరు చేయవలసిన నిర్ణయాలు వారం మధ్యలో చేయడం మంచిది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం అధికం కాగలదు. ఆర్థిక వ్యవహారాలు వారాంతంలో అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగాఉంటుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. అనుకూల వార్తలను వింటారు.

కర్కాటకం : కొన్ని వ్యవహారాల్లో వ్యయ ప్రయాసలకు గురిఅయినా, మొత్తం మీద తగిన ప్రతిఫలం లభించగలదు. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో స్వల్ప భేదాభిప్రాయాలువచ్చి సద్దుకొంటాయి. వృత్తిలో మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మివ్యవహరించడం తగదు. ఆరోగ్యం బాగా ఉంటుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

సింహం : ఈవారం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. వృత్తిరీత్యా చేసే ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. వారాంతంలో సామాన్యమైన పనులకుకూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

కన్య: వృత్తివ్యాపారాల్లో మీకు యిది వరకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. ఆదాయంతో నిమిత్తం లేకుండా సమయానికి యేదోఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది. ఉద్యోగంలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. బంధు మిత్రులను కల్సుకొంటారు.

తుల : వృత్తివ్యాపారాల్లో ఆకస్మికంగా ఆందోళన కలిగించే పరిస్థితులు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో యితరుల జోక్యం వలన నష్టం వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలను భాగస్వాములనిర్ణయానికి వదలి వేయడం మంచిది. ఉద్యోగంలో భేదాభిప్రాయాలు వస్తాయి. వారం మధ్యలో మంచి పరిస్థితులు యేర్పడతాయి. పైవారిలో గౌరవం లభిస్తుంది. కుటుంబవ్యవహారాలు బాగానే ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు శ్రమమీద ఫలిస్తాయి.

వృశ్చికం : ఏ వ్యవహారంలోను ఆరంభంలో కనిపించిన అనుకూలత ఆఖరువరకు నిలవదు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాల్లో అధికారులు మీ యెడల అనుకూలంగానే ఉన్నా, యితరుల జోక్యం వలన ఆటంకాలు వస్తాయి. నూతన వ్యాపారాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారం భారీఎత్తున చేయడంవలన ఆర్థికంగా ఒత్తిడివస్తుంది. ఉద్యోగంలో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు.

స్త్రీలకు—కుటుంబకార్యక్రమాలలో మార్పులు వస్తాయి. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.



ధనుస్సు : పూర్తిగా నెరవేరువరకు యే వ్యవహారాన్ని నమ్మడానికి అవకాశంలేదు కాబట్టి వృత్తివ్యాపారాల్లో సామాన్యమైన ఫలితంతో సంతృప్తి పొందడం మంచిది. ప్రయాణాలు కొంచెం శ్రమ మీద ఫలిస్తాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి సామాన్యంగా ఉంటుంది. స్థిరాస్థి వ్యవహారాల్లో కొత్త సమస్యలు తలయెత్తవచ్చును. కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు—అనారోగ్య సూచనలు ఉన్నాయి. పుణ్యకార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం : ఇతరుల దృష్టిలో యిది మీకు యోగవంతమైన సమయమేకాని మీకు మాత్రం సంతృప్తికరంగా ఉండదు. మీరు స్వంతంగాచేసే వ్యాపారాల కంటె భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడంవలన ముందుముందు యిబ్బంది కలుగుతుంది. ఉద్యోగంలో ముఖ్యమైన పనులు మీరు స్వయంగా చూడడం మంచిది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

కుంభం : వృత్తి వ్యాపారాల్లో శ్రమ కలిగినా, దానికి తగిన ప్రతిఫలం లభించడంవలన యీవారం సంతృప్తికరంగానే ఉంటుంది. వృత్తిలో కొంత మంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభించగలవు. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. శుభమూలంగా వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా, నిర్లక్ష్యం చేయడం తగదు. విలాస వస్తువులు కొంటారు.

మీనం : వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు అనుకొన్నట్లుగా నెరవేరతాయి. వృత్తిలో యిదివరకు చేజారిపోయిన అవకాశాలు కూడా యిప్పుడు తిరిగి లభిస్తాయి. వ్యాపార రీత్యా చేసే ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. స్వల్ప అనారోగ్యం చేయవచ్చును. పైవారిలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్

ఆలోచించే యంత్రాలు

ఏదైనా ఒక్కసారి చెప్తే చాలు ఏకసంధాగ్రాహిలా యంత్రం చేసుకుపోతుంది!

(గత సంచిక తరువాయి)

ప్రోగ్రామింగ్

(కార్యక్రమాన్ని నిర్దేశించడం)

మనకు కావలసిన లెక్కను కంప్యూటరు చేయగలగాలంటే మనం దానికి తెలిసిన భాషలో మాట్లాడాలి. అదిగో ఆ పనినే "ప్రోగ్రామింగ్" అంటారు. ఉదాహరణకు 4 అనే సంఖ్యను పంపిస్తే "గుణించు" అనే ఆజ్ఞకు సంకేతం కావచ్చు. 7 అనే సంఖ్య "కూడు" అనే ఆజ్ఞకు గుర్తు కావచ్చు. 17 అనే సంఖ్య "దీని తరువాత వచ్చే సంఖ్యను స్మృతి విభాగానికి పంపించు" అనే అర్థాన్ని ఇవ్వవచ్చు....ఈ విధంగా అవసరమైన ఆజ్ఞలన్నింటికీ అంకెల రూపంలో గుర్తులు పెట్టుకుంటారు. ఈ గుర్తులు కంప్యూటరును తయారు చేసిన పద్ధతిని బట్టి ఉంటాయి. వేరు వేరు కంప్యూటర్లకు వేరు వేరు సంకేతపు పద్ధతులు ఉంటాయి.

"2 ను 2 పెట్టి గుణిస్తే ఎంత వస్తుంది?" అని ప్రశ్న వేయాలనుకుందాం ఉదాహరణకి. ఈమాట కంప్యూరుకి అర్థం అయేలా చెప్పడానికి బోలెడంత తతంగం ఉంది. మచ్చుకి ఈ ప్రోగ్రామింగు ఎల్లా ఉంటుందో చూపిస్తాను.

P1=50 (అంటే పంపబోతున్న ప్రోగ్రాము ను స్మృతి విభాగంలో 50 వ గదిలో నిలువ చెయ్యి అని అర్థం)

102 f 0 (యంత్రం మొదలు పెట్టే వరకూ ఆగు.)

59 f 10 [అందుకునే విభాగంలోనుంచి ఒక్కసంఖ్యను (2) తీసుకుని నిలువలో ఉంచు]

19 f 10 (ఆ నిలువను 10వ గదిలో ఉంచు.)

59 f 10 [అందుకునే విభాగంలోనుంచి ఒక్కసంఖ్యను (2) తీసుకుని నిలువలో ఉంచు.]

12 f 10 (పదవ గదిలో ఉంచిన సంఖ్యకు నిలువలో ఉంచిన సంఖ్య కలుపు.)

59 f 24 [నిలువలో ఉన్నజవాబును (4) వెలువరించే టేపు మీద వ్రాయి.]

101 f 0 (ఆగు.)


S 50 (ప్రోగ్రామింగు పూర్తి అయింది. స్మృతి విభాగంలో 50వ గదిలో ఉన్న ఆజ్ఞతో మొదలుపెట్టి, దాని ఆజ్ఞలను పాలించు—అంటే ఇంక లెక్కచేయడం మొదలుపెట్టు అని అర్థం.)

కేంబ్రిడ్జి గణిత పరిశోధనాలయంలో ఉన్న EDSAC అనే కంప్యూటరు ప్రోగ్రాం ఇది. దీనినే టేపు మీద చిల్లుల భాషలో వ్రాస్తే, ఇక్కడి బొమ్మ 3లో చూపినట్లుంటుంది.

నిజానికి అన్ని కంప్యూటరులలోనూ ప్రోగ్రామింగు ఇంత కష్టంగా ఉండదు. కొన్ని కంప్యూటర్లలో మామూలుగా ఎదురయ్యే గణిత ప్రక్రియన్నీ ముందుగానే లోపల ఎలక్ట్రానిక్ పద్ధతులతో "వ్రాయబడి" ఉంటాయి. అంటే కంప్యూటరుకి ఈ గణిత ప్రక్రియలన్నీ ముందుగానే తెలుసునన్నమాట. "గుణించు" అని ఆజ్ఞను పంపిస్తే చాలు స్మృతి విభాగంలో అంతకు ముందే నమోదు అయిఉన్న ఆజ్ఞలను బట్టి యంత్రం గుణిస్తుంది. "ఫలానా ద్విఘాత సమీకరణాన్ని సాధించు" అని ఆజ్ఞాపిస్తే చాలు, దానిని సాధించే పద్ధతులు మాటిమాటికీ చెప్పనక్కరలేదు. దానికి అంతకుముందే తెలిసి ఉంటాయి. ఇటువంటి "అనుభవం" గల "తెలివైన" కంప్యూటర్లతో పని బహువేగంగా జరిగిపోతుంది.

ఇంతకన్న వేగంగా లెక్కలు చేయడానికి కంప్యూటర్లలో కొత్తపద్ధతులు ప్రవేశ పెట్టేరు. పాత పద్ధతి ప్రకారం చేయవలసిన గణిత ప్రక్రియలన్నీ ఒకదాని తరువాత ఒకటిగా నడుస్తాయి. ఉదాహరణకి: $(2+3) \times (5-2)^2 \div (7+4-3)$....అనే లెక్క చేయాలంటే ముందర $(2+3)$ ఎంతో కనుక్కొని ఒక చోట జాగ్రత్త చేస్తుంది. తరువాత $(5-2)$ కనుక్కొని దానిని అదే సంఖ్య పెట్టి గుణించి ఒకచోట ఉంచుతుంది. తరువాత ఈ రెంటినీ గుణిస్తుంది. తరువాత $(7+4-3)$ తెలుసుకుంటుంది....

ఈ విధంగా ఒక ప్రక్రియపూర్తి అయే వరకూ మరో ప్రక్రియ అందుకోదు. దీని వల్ల పని చాలా ఆలస్యమవుతుంది. కొత్త పద్ధతిలో ఏక సమయంలో రకరకాల గణిత ప్రక్రియలు కంప్యూటరులోని వివిధ



p1=50 102f0 59f10 19f10 59f10 12f10 59f24 101f0 s50

(3వ బొమ్మ)

భాగాలలో కొనసాగుతూ ఉంటాయి. ఆ ప్రక్రియ పూర్తి అయాక ఆగి, జవాబును ఎక్కడికి ఎప్పుడు పంపమని ఆజ్ఞవస్తే అక్కడికి అప్పుడు పంపుతుంది. ఈ ప్రోగ్రామింగులో ఏ పని ఎల్లా చెయ్యాలో చెప్పాలెదు, ఆ పని ఎప్పుడు చెయ్యాలో కూడా చెప్పాలి. ఇటువంటి కంప్యూటర్లతో మన ఊహకు అందని మహావేగాలు సాధ్యం అవుతున్నాయి.

క్లిష్టమైన కంప్యూటర్ ప్రోగ్రామింగు కూడా ఇటీవల సులభతరమవుతోంది. ప్రోగ్రామింగు చాలాభాగం ఆ యంత్రమే చేసేస్తుంది. స్థూలంగా ఏయే ప్రక్రియలు చేయాలో దానికి మనిషి చెప్పాలి. చిల్లుల-టేపుకి బదులుగా కాగితం మీద చేతితో మనకు కావలసిన లెక్క వ్రాసి చూపిస్తే కంప్యూటర్ గ్రహించి లెక్క చేసి, జవాబును అందించే సౌకర్యం మరికొద్ది కాలంలోనే సాధ్యమయే సూచనలున్నాయి. అంతేకాదు, వ్రాత కూడా అవసరం లేకుండా, మనం నోటితో అడిగితే చాలు అవి గ్రహించి పని చేసే రోజులు కూడా ఎంతో దూరంలో లేవు.

కంప్యూటర్లకు ప్రోగ్రాము తయారు చేయాలంటే వందల కొద్దీ వేల కొద్దీ విషయాలు టేపు మీద చిల్లుల భాషలో వ్రాయాలి. ఈ పనిలో నిష్ణాతులైన వారికే రోజులు, వారాలు పడుతుంది. ఎంత జాగ్రత్తగా చేసినా అప్పుడప్పుడు తప్పులు పోవచ్చు. ఇటువంటి తప్పులు జరిగితే ఆ విషయాన్ని కంప్యూటరే గ్రహించి, వెలువరించే టేపు మీద ప్రింటు చేయగలదు. "మరి కాస్త జాగ్రత్తగా ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రోగ్రాము చెయ్యరాదూ?" అని ఒకానొక కంప్యూటరు సలహా చేసిందిట! (తప్పు జరిగితే ఇల్లా వ్రాయుమని దానికి ముందుగానే నేర్పి ఉంటారని వేరే చెప్ప నక్కరలేదు.) వేలూ, లక్షలూ ట్రాన్సిస్టర్లతో, డయోడులతో, ఇంకా రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలతో బహు జటిలంగా అడవిలా ఉండే ఈ యంత్రాలలో ఏ భాగమైనా పాడైతే తెలుసుకోవడం చాలాకష్టం. అటువంటి సమయాలలో కొన్ని కంప్యూటర్లు లోపం ఎక్కడుందో తామే స్వయంగా

ఆలోచించే యంత్రాలు

నాకవసరం కదాని కొన్నా, దాన్తో మొత్తంబిజి
నా ఖర్చులన్నీ దానిపైపెట్టి లెక్కవేస్తే
ఈ ఖర్చు లేవిటని నిలదీసి అడుగుతుంది!



గ్రహించి తెలియజేస్తాయి! "స్మృతి విభాగంలో మూడవ అరలో Z. 7856 అనే డయోడు పాడైనట్లుంది చూడు" అని సలహా చేస్తుంది!

కంప్యూటర్లు చేసే పనులు

కంప్యూటర్లు చేసే పనులు ముఖ్యంగా మూడు ఉన్నాయి.

వాటికి ఉన్న అపారమైన "జ్ఞాపకశక్తి", జ్ఞాపకం ఉంచుకున్న విషయాన్ని అతి వేగంగా వెతికి బయటికి తీయగలగడం— ఈ రెండింటి విషయంలోనూ ఈ కంప్యూటర్ల ప్రజ్ఞకి మానవుడు దాసోహం అనక తప్పదు. ఇన్నిన్ని విషయాలను జ్ఞాపకం ఉంచుకునే శక్తి మనిషికిలేదు. వీటికిగల ఈ పత్యేక ధర్మాన్ని ఉపయోగించి ఆఫీసులలో ఫైళ్ళు జాబితాలు, చిరునామాలు, అవర్డర్లు, జమ, ఖర్చులు, ఎడ్రస్సులు.... వగైరా వ్రాసి, అవసరమైనప్పుడు బయటికి తీసేపని ఈ కంప్యూటర్లు అద్భుతంగా చెయ్యగలవు. పెద్ద పెద్ద లైబ్రరీలలో కోట్లసంఖ్యలోఉన్న పుస్తకాలు, వాటలోని ముఖ్యమైన విషయాలు సంగ్రహంగా ఈ కంప్యూటర్లు జ్ఞాపకం ఉంచుకుని, కావలసినప్పుడు అందించగలవు. ఆసుపత్రులలో రోగుల జాబితా, వాళ్ళ రికార్డులు అన్నీ జ్ఞాపకం ఉంచుకుని డాక్టర్లకి అవసరమైనప్పుడు అందించగలవు. మెటీరియా మెడికాలోని వేలకొద్దీ మందులు, వాటి లక్షణాలు సకల విధాల రోగాలూ వాటికి అవసరమయే మందుల జాబితాలు జ్ఞాపకం ఉంచుకుని "ఫలానా లక్షణాలున్నాయి ఈ రోగికి ఏం మందు ఇమ్మంటావు?" అని అడిగితే తన దగ్గర ఉన్న సమాచారాన్నంతా క్షణాలలో తిరగవేసి, జవాబు ఇవ్వగలదు! ఇటువంటి ఉపయోగాలు అనంతం. అప్పుడే కొన్ని దేశాలలో కంప్యూటర్లను ఈ పనులకై వినియోగిస్తున్నారు.

రెండవ ఉపయోగం అతివేగంగా లెక్కలు చేయగల శక్తి వీటికి ఉండడం. అసలు ఈపనికోసమే మొట్టమొదట వాటిని శాస్త్రజ్ఞులు సృష్టించారు. ఉదాహరణకు కొత్తరకపు విమానం ఒకటి తయారు చేయాలంటే దాని వివిధ భాగాల మీదగాలి వత్తిడి, ఆ వత్తిడికి ఆ భాగం ఏ దిశలో ఎంతగా వంగేదీ, ఆ వంగడంవల్ల మొత్తం విమానం ఏవిధంగా ఒరిగేదీ, దానిస్థిరత్వం ఏవిధంగా మారేదీ......మొదలైన లెక్కలు కోట్ల సంఖ్యలో చేసి వాటి ఫలితాలను అంచనా వేయవలసిఉంటుంది. ఈ లెక్కలు క్లిష్టమైనవి కావుకానీ, అనేకులు గణిత శాస్త్రజ్ఞులు ఏళ్లతరబడికూర్చుని గుణిస్తేగాని ఈ లెక్కలు తేలవు. ఇప్పుడు ఈ పనిని అంతా కంప్యూటరు కొద్దివారాలలో పూర్తి చేయగలదు! ట్రాంబేలోని "అప్సరస" వంటి అణు రియాక్టరు నిర్మించాలంటే కోట్లకొద్దీ లెక్కలు చెయ్యాలి. వీటన్నింటినీ కంప్యూటరు కొద్ది వారాలలో ముగిస్తుంది.

వేలూ లక్షలూ పరమాణువులు ఒక నిర్ణీత క్రమంలో అతుక్కుని జీవుల శరీరాలలోని మాంసకృత్తులు అనబడే రాక్షసి అణువులు ఏర్పడ్డాయి. ఈ బృహదణువులలోవున్న పరమాణువులు ఏ వరుసలో ఒకదానికొకటి ఏ దిశలో ఏంతెంత దూరాలలో అతుక్కుని ఉన్నాయో తెలుసుకోడానికి కోట్లకొద్దీ లెక్కలు చెయ్యాలి. అటువంటి పని కంప్యూటరు సునాయాసంగా చేసేస్తుంది. కంప్యూటర్లు ఎల్లప్పుడూ అంకెలతోనే కుస్తీలు పట్టవు. కొన్ని కంప్యూటర్లు అనువాదాలుకూడా చేస్తాయి. ప్రస్తుతం ఇంగ్లీషులో నుంచి రష్యనులోకి, రష్యనులోనుంచి ఇంగ్లీషులోకి కంప్యూటర్లనుపయోగించి అనువాదాలు చేయించడానికి బాగా కృషి జరుగుతోంది.

ఏ మనిషి అయినా ఒక కొత్త భాషను నేర్చుకోవాలంటే ఆ భాషలోని పదాలు వాటి అర్థాలు వేలసంఖ్యలో గుర్తుంచుకోవాలి. ఈ పని కంప్యూటర్లు అత్యుత్తమంగాచేయగలవు. కాపోతే వ్యాకరణం విషయంలోనూ, జాతీయములు, నుడికారములు విషయంలోనూ కాస్త ఇబ్బంది ఉంది. ఒక్క ఉదాహరణ చూపిస్తా. White అంటే తెలుపు అని అర్థం. Wash అంటే కడుగుట అని అర్థం. ఈ రెండుమాటలకు వేరు వేరుగా అర్థం చెప్పడం కంప్యూటర్‌కి చాలా సులభం. కాని ఈ రెండు మాటలూ కలిపితే White wash అంటే "సున్నంవెయ్యడం" అని అర్థం చెప్పగలగాలి. అంటే White అన్నమాట కనబడగానే "తెలుపు" అని అనువదించెయ్యకుండా, కాస్త ఆగి, అటూ, ఇటూ చూసుకుని, చుట్టు పక్కల ఉన్నమాటలవల్ల ఈ మాటకు అర్థం మారుతోందేమో గ్రహించగలగాలి ఈ యంత్రం. మనిషి ఈ పనిని సులభంగానే చేయగలుగుతున్నాడు. ఇప్పుడు ఈ పనిని కంప్యూటర్లు కూడా చేస్తున్నాయి! జాతీయములు, నుడికారములు, నానార్థాలు కలిగిన పదాలు ముందుగానే కంప్యూటరుకి తెలిపి, ఈ మాటలు వచ్చినప్పుడు, ఆగి చుట్టు పక్కలి మాటలు పరిశీలించాలనీ, వాటితో కలిసితే వచ్చే వివిధార్థాలు, వాటిలో సరియైన అర్థాన్ని ఏరుకునే పద్ధతులు...... వగైరా అంతా సిద్ధాంతాల రూపంలో తెలియజెయ్యాలి. అప్పుడు సరియైన అనువాదాలు చేయగలుగుతాయి— కంప్యూటర్ల వాక్య నిర్మాణ శక్తి ఇంకా అధ్వాన్నంగా ఉంది. ఇది ఏ భాషకు ఆ భాషే ప్రత్యేకత. ప్రస్తుతం RUSDIC అనే కంప్యూటరు 60,000 మాటలను గుర్తుంచుకుని రష్యను భాష నుంచి ఇంగ్లీషులోకి ప్రావ్దా పత్రికను, రష్యన్ శాస్త్రీయ సమాచారాన్ని ప్రతిరోజూ అనువదిస్తోంది. ఇది చేసే అనువాదం "బాట్లరు ఇంగ్లీషులా" ఉంటుందికాని, అర్థం అవుతుంది. ఫరవాలేదు. ఉదాహరణకి మాజీ ప్రధానమంత్రి కృశ్చేవ్ చేసిన ప్రసంగానికి దీని ఆంగ్లానువాదం చూపిస్తాను.

"Sevan-year school/plan we began good, comrade. Are carried out and overfulfil industrial plan, grow storage in National economy. Great will people, it/its selfless labour, socialist Competition millions..."

ఒకసారి ఇటువంటి యంత్రమే "Spirit is willing but flesh is weak" అనేవాక్యాన్ని రష్యనులోకి "సారాబాగానేఉంది కాని, మాంసమే కుళ్ళిపోయింది" అని అనువదించిందిట! — త్వరలోనే చక్కని భాష వ్రాయగల యంత్రాల సృష్టి జరుగుతుందనడానికి సందేహం లేదు. ఈ యంత్రాలు సెకనుకి 500 మాటల చొప్పున అనువదించగలవంటే వీటివేగం వూహించవచ్చు.

ఇంక మూడో ఉపయోగం చూద్దాం. ఆలోచించడం, కార్యకారణ సంబంధాలను గ్రహించడం లాభనష్టాలను బేరీజువేసి ఫలానా పని చెయ్యడం మంచిది అవునో కాదో నిర్ణయించడం....వంటి పనులు— ఇంత వరకు మనిషిమాత్రమే చేయగలడనుకుంటున్న ఈ పనులు — కంప్యూటర్లు చేయగలుగుతున్నాయి! మొదటి రెండు పనులు కన్న ఇది విలక్షణమైనది. చరిత్ర గమనాన్నేమార్చి వేయగలంతటి పటిష్టమైనది ఈ శక్తి.

దీనికే మరికొంత వివరణ అవసరం. 2 ని 2 పెట్టి గుణిస్తే 4 వస్తుంది. అన్న జవాబులో సందిగ్ధత ఏమీలేదు. దీనికి ఖచ్చితమైన జవాబు ఇవ్వడంలో ప్రత్యేకత ఏమీలేదు. కాని "రేపు వాన కురుస్తుందా?" లేకపోతే "రాబోయే ఎన్నికలలో కాంగ్రెసుకి ఎన్ని సీట్లు వస్తాయి?" వంటి ప్రశ్నలువేస్తే జవాబు మరీ ఖచ్చితంగా ఇవ్వడం సాధ్యంకాదు. వీటికి జవాబు చెప్పాలంటే ఎన్నెన్నో విషయాలూ ఎంతెంతో పూర్వ చరిత్ర తెలియాలి. ఈ సమాచారాన్ని అంతా దగ్గర పెట్టుకుని, సాధ్యాసాధ్యాలు బేరీజు వేసి, "రేపటి వాతావరణం బహుశా ఇల్లా ఉండవచ్చు" అనీ, "వచ్చే ఎలక్షన్లలో ఫలానా పార్టీకి ఎక్కువ వోట్లు వచ్చే అవకాశం లేకపోలేదు" అనీ సమాధానాలు ఇవ్వవచ్చు. దీనికి హేతువాదం కావాలి. తార్కిక దృష్టికావాలి. ఇది మనుష్యులకు మాత్రమే ప్రత్యేకత అనుకుంటున్నాం.

నువ్వు తప్పు చెప్పి తెల్వడం కొనసాగిస్తావని
నేనీ కంప్యూటర్ మాటకి విలువిస్తున్నా
-నంటావా!



"మీరేకాదు, మేమూ ఈ పనులు చెయ్యగలం. ఇంకా మాట్లాడితే మీకన్న బాగా వూహించగలం" అని మనిషితో మనిషి నిర్మించిన యంత్రాలు పోటీ పడుతున్నాయి. ఈ పనులను అవి "దివ్య దృష్టి" వంటి మానవాతీత శక్తివల్ల చేస్తుందని భ్రమపడకండిసుమా! అవి లెక్కలుకట్టి చెప్తాయి. అవును. మనం చేసే పని కూడా ఇంచు మించు అంతే. రక రకాల వాతావరణ పరిస్థితులు, గాలి వేగం, దిశ, ఉష్ణోగ్రత, గాలిలోని నీటి ఆవిరి, మేఘాలు, గాలిలో తేలుతున్న దుమ్ముకణాలు వాటి సైజువంటి లక్షలకొద్దీ విషయాలను, వాటికిగల పరస్పర సంబంధాలను ఏ పరిస్థితులు ఎలా ఎలా ఉంటే వాతావరణం ఎలా ఉండే అవకాశం ఉన్నదో, మనకు తెలిసిన విజ్ఞానం యావత్తూ ముందుగా కంప్యూటరుకి అందించాలి. ఈ సమాచారాన్ని తీసుకుని, లక్షల కొద్దీ సంభవత్వాలను, అవకాశాలనూ ఒక దాని తరువాత ఒకటి వరుసగా గుణించి, అన్నింటికన్న ఎక్కువ సంభవత్వం దేనికి ఉన్నదో తెలుసుకుని, మనకు చెప్తుంది. ఈ పని మనిషికన్న లక్షలకొద్దీ రెట్లు వేగంగా చేస్తుంది. ఇన్ని రకాల సంభవత్వాలను గుణించడానికి మనిషికి వ్యవధిలేదు. అలాగే ఎలక్షన్ల విషయమూనూ. దేశ పరిస్థితి, పార్టీల స్థితి, అందులోని ప్రముఖులకు గల పలుకుబడి, వారిమీద ప్రజలకు గల గౌరవం, నమ్మకమూ, రకాల తరగతులు, అంతస్తులు వాటిమధ్య విద్వేషాలు, ఎలక్షన్లముందు జరిగిన యుద్ధాలు, క్షామములు, అన్యాయాలు, వాగ్దానాలు, తగ్గించిన పన్నులు, వాటికి ప్రజల

ఆలోచించే యంత్రాలు

రియాక్షను....వంటి లక్షలకొద్దీ విషయాలను ముందుగా కంప్యూటరుకి అందిస్తే రక రకాల సంభవత్వాలను బహువేగంగా పరిశీలించి, గుణించి ఏది జరగడానికి ఎక్కువ అవకాశముందో నిర్ణయిస్తుంది.

ఈ యంత్రాల "ఆలోచనా ధోరణి" చిత్రంగా ఉంటూంది. ఇది కొత్త సంగతులను స్వయంగా నేర్చుకుంటుంది. తాను తయారు చేసిన యంత్రం, తాను నిర్దేశించిన సిద్ధాంతాల పరిమితులలోనే పని చేసే యంత్రం—తాను అడిగిన ప్రశ్నకు ఒక్కొక్కప్పుడు ఎలాంటి సమాధానం ఇస్తుందో ఆ మనిషి ఊహకి అందదు! దీనికి ఒకటి రెండు ఉదాహరణ లిస్తాను.

(ఇంకా ఉంది)

కొన్నాను'

'ఏ రేవా నీతో వచ్చిందా?'

'లేదు మహారాజా, మన పంచాయతీదార్లు రేవాను వెళ్లగొట్టవలసిందిగా, ఆజ్ఞాపించారు. మీరంతా ఎరుగుదురు కదా మహారాజా. వర్ష కారణంవల్ల రేవా ఒక వాడు ఆవలి ఒడ్డున సారధి వెంట ఉండిపోయింది. కాని పంచాయతీదార్లు రేవా పతితురాలన్నారు. స్వర్గస్థులైన పెద్దలూ వృద్ధులూ రేవా పతితురాలన్నారు. కోపం వల్ల నాకూ అట్లే అనిపించింది. కాని మహారాజా, నిజానికి వైశాలిలో ఉండికూడా ప్రతి లిచ్ఛవీయుడూ పాలిని చూస్తాడు. కాని రేవా యెదుట చూడ్డానికి నేటివరకూ ఎవ్వడూ సాహసించలేదు. మహావాముడు ఆమెను పెంపుడు ఎంచుతాడు. ఔనా సంజయా?'

సంజయుడు మందహాసం చేసి బింబిసారుని వైపు చూచి అన్నాడు 'ఆమ్రపాలి ఉన్నచోట తానూ వుందునని రేవా బ్రహ్మదత్తుడికి మాటిచ్చింది. ఇదీ నిజమే. కాని రేవాను తీసుకురావాలంటే ఒకటే మార్గముంది. అది పాలినిక్కడకు తేవడమే....పాలి నిక్కడకు తెచ్చే శక్తి మావంటి విప్రులకి లేదు.'

'మహారాజా, నిజమే. సంజయుని వంటి వేలకొలది బుది మంతులు పాలి ముందు అల్పులు. రేవా ఉండకపోతే తెలిసి ఉండేది. ఆమ్రపాలి అట్టి వీరవనిత. బుద్ధిమంతురాలు. సుందరి. ఆకర్షకమూ, అద్భుతమూ, అద్వితీయమూ, అవర్ణనీయమూ, అ............'

'చాలు, చాలు, బ్రహ్మదత్తా, హద్దు మీరకు' అని సంజయుడు బ్రహ్మదత్తుణ్ణి మధ్యలోనే ఆపి వేశాడు. తరువాత బింబిసారుని వైపు చూచి, చేతులు జోడించి మృదుహాసంతో యిలా అన్నాడు—

'మహారాజా, మీ నిద్రను ఇంకా భంగపుచ్చడానికి మాకధికారంలేదు. కాని చివరి కీవ్మాత్రం చెప్పగోరుతున్నాను, చెప్పనా?.. మహారాజా, పాలికి తగిన పురుషుడు ఒక్కడే ఉన్నాడు. అతడు మగధరాజా బింబిసారుడు'.

ఇలా చెప్పి సంజయుడు, బ్రహ్మదత్తుడు

ఆమ్రపాలి

(12వ పేజీ తరువాయి)

ఏమైనా చెప్పడానికి ముందే అతణ్ణి మోచేత్తో కొట్టి లేవనెత్తాడు. తరువాత నియమప్రకారం వారిద్దరూ ఆజ్ఞ తీసుకొని శయనగృహం నుండి వెలుపలికి పోయారు.

పాలి బాణాలను చేతిలో తిప్పుతూ బింబిసారుడు వాటిని రెప్ప వాల్చకుండా చూడసాగాడు. రాజ గాయకుడు మోహినీ పుత్రుడి గీతం పంచమ స్వరంలో ఒప్పుతోంది. ఆ గీతంలోని లోపాన్ని పూరించడానికో అన్నట్లు ఒక యువతి కంఠస్వరం ఆ ధ్వనితో కలియసాగింది.

బింబిసారుని ప్రాణాలూ, శరీరం, హృదయం ఏదో అనివార్య ఆకర్షణచే ఆకర్షితాలవుతున్నన్నాయి. అతనికళ్లు బాణాల్ని చూస్తున్నా చూడనట్లే ఉన్నాయి. అతని వీనులు మోహినీపుత్రుని గీతం ఆలిస్తున్నా విననట్లే ఉన్నాయి. ఇప్పటికే బింబిసారుని కర్ణాలలో సంజయుని తియ్యని మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి. 'పాలికి తగిన పురుషుడు ఒకడే ఉన్నాడు. అతడు మగధరాజా బింబిసారుడు.'


మహామాత్యుడు దేవేంద్రుడు ఇంకా రాజప్రసాదానికి ముఖ్యమైన ప్రవేశద్వారం దగ్గరే నిల్చున్నాడు. బ్రహ్మదత్తుణ్ణి పంపి ఒంటరిగా ఉన్నసంజయుడు నమస్కరించి అతనిదగ్గర నిలబడ్డాడు. మహామాత్యుడు నవ్వి సంజయుని భుజంమీద చెయ్యివేసి అన్నాడు—

'నీవంటిపురుషుడు నాదగ్గరవున్నంత వరకూ నేను ఏమైనా చేయగలను, సంజయా. బుద్ధిప్రధానమైన రాజకీయపు ఎత్తుల వెత్తడంతోపాటు మూర్ఖుడుగా అగుపించడం సామాన్యమైనవని పనికాదు..........'

'గురుదేవా, శిష్యుని ప్రశంసించడం గురువుకు తగదు' అని సంజయుడు వినయంతో అన్నాడు. దేవేంద్రుడు నవ్వాడు. సంజయుడు మళ్లీ అన్నాడు— 'మహారాజా ప్రతిఅణువులోనూ ఇప్పుడు ఆమ్రపాలి రమిస్తోంది'.

'ఇంతమాత్రానికే సంతోషించకూడదు. సంజయా. వివాహం కూడా.......' ఇలా అని దేవేంద్రుడు అకస్మాత్తుగా వూరుకున్నాడు. అతడు వాత్సల్య పూరితమైన తనహస్తంతో సంజయుని వీపు నిమిరి, వెళ్లడానికి అతనికి అనుమతి ఇచ్చాడు. సంజయుడు వెళ్ల సాగాడు.

మోహినీ పుత్రుడి గీతం హృదయంగమమైన రాగంతో వినిపిస్తోంది. అతని ప్రేయసి కూడా అతని కంఠంలో తన కంఠం కలుపుతూ రాగాలాపం చేస్తూ వుంది. దూరంగా పోతున్న సంజయుని వీపు చూస్తుండగా దేవేంద్రుడికి బాల్యం



జ్ఞాపకం వచ్చింది.

మహామాత్యుడికి బాల్యం తరువాత యౌవనం జ్ఞాపకం వచ్చింది. యౌవనాన్ని గురించిన ఉన్మత్త స్వప్నం అతని కళ్ల యెదుట మిలమిల మెరియసాగింది. వైశాలిలో ప్రతి మార్గం ఒక్కొక్క రాజభవనం అతని కళ్లయెదుట వచ్చినిల్చున్నాయి. స్వయంగా లిచ్ఛవీయుడు కాకపోయినా పుట్టినది మొదలు లిచ్ఛవీయుడికి మాతృభూమి పట్ల ఎంత అనురాగం కలిగించబడుతుందో వైశాలిమీద అతనికంత ప్రేమా ఉంది. వైశాలిమీద తన తల్లికి గల అపరిమితానురాగం మళ్లీ అతని మనస్సులో ఉదయించింది. వైశాలిని మగధతో కలిపే దృఢసంకల్పం మళ్లా వేగిరపాటు పొందింది.

మహామాత్యుడికి యుద్ధం నచ్చలేదు. అతడు బుద్ధుని అనుచరుడు. మహారాజా బింబిసారుని యుద్ధప్రేమ, సాహసం అతనికి బొత్తిగా నచ్చలేదు. లిచ్ఛవీయులు శత్రువులపై పగసాధించే క్రూరులు, అవిధేయులు. కాని వాళ్లు పవిత్ర హృదయులు. వాళ్లని నీచులనడానికి వీల్లేదు. ఈవిషయం మహామాత్యుడు చక్కగా ఎరుగును. లిచ్ఛవీయుల దౌర్బల్యాన్ని అతడు ఒక మాంత్రికుని కంటే ఎక్కువగా ఎరుగును. కాబట్టి నవ్వుతూ సంతోషంతో ప్రాణాన్ని అర్పించే వాణ్ణి కత్తితో ఎదుర్కోవడం నిరర్థకం అని అతని కనిపించింది. అందుచేతే మహామాత్యుడు దేవేంద్రుడు ఒక్క లిచ్ఛవీయుని రక్తబిందువైనా నేల బడనీయకుండా వైశాలిని తీసికోగోరాడు. ఇదే అతని దృఢనిశ్చయం. ఈ దృఢనిశ్చయాన్ని అతడొక్కడే ఎరుగును. సంజయుడు ఎరగడు. మందగమనంతో మహామాత్యుడు తన భవనం వైపు పోగుతున్నాడు. అతనికి మూరు అడుగులకు వెనకే అతని అంగరక్షకులూ ఉన్నారు.

బింబిసారుని హస్తాల్లో బాణద్వయం ఇంకా ఆడుతోంది. మోహిని పుత్రుడూ అతని ప్రేయసీ పాటనింకా పాడుతూనే

ఉన్నారిః

*   *   *

దీనికి జవాబేమిటి? మహానామా?......

లిచ్ఛవీయుడైన అభయుడు తన విజయానికి చాలా గర్వించి మీసాలు మెలవేస్తూ మహానామునివైపు తీక్షణంగా చూడసాగాడు. అతని ముఖంలో ఉపేక్షతో కూడిన గంభీరహాసం యొక్క అస్పష్ట రేఖ తొలుకాడుతోంది. కాని మహానాముని చూపు అభయుడివైపుంది. అతని నేత్రాలు గవాక్షంనుంచి దూరాన్ని కనబడే ప్రాసాదం మీద లగ్నమయ్యాయి. అతని హృదయం

రాజభవనంలోని ఉద్యానవనంలో విహరిస్తున్న పాలి వైపుంది. అతని మనస్సు ముసలిదైనా శక్తిమంతమైన వణకుతున్న వేళ్ళగుండా అభయుని మెడపై కూర్చుంది .... అభయుని మాటలు అతని ధ్యానాన్ని భంగపరచాయి. అతడు వెనక్కి తిరిగాడు. అందమైన రెండు మదిరా పాత్రలుతీసికొని అభయుడు అతని ఎదుట నిల్చున్నాడు. అతడు అభయుని వైపు రెప్పవాల్చకుండా చూడసాగాడు— 'అసంభవం, అభయరాజా, శక్తిగాపాధ్యం కాదు, ఇదికాజాలదు'. 'కాదా?'....మధ్యవైపు చూస్తూనే అభయుడు అడిగాడు. 'కాదు, కాదు' అనే మహానాముని మును పటి వలె విశ్వయంతో ఉన్న స్వరం వినిపించింది.

'కాజాలదా?' అని అభయుడు మళ్ళీ అడిగాడు.

ఈసారి అతడు కళ్ళపైవైపు త్రిప్పాడు. అతనిముఖంలో తొణికిలాడే మందహాసం కొంత తగ్గిపోయింది.'కాదు, కాదు,కాదు' అంటూ మహానాము డొక్కసారిగా అభయుడిదగ్గరకు గెంతి వచ్చాడు. కాని అభయుని కంటి రెప్పసైతం చలించలేదు, అతడు అతని వైపు అలాగే చూస్తూ అదిజరిగే తీరాలి మహానామా' అన్నాడు.

'అభయా, మన వయసిపుడు యుద్ధ భూమిలో మాగధీయులతో పోరాడ్డానికి, భిక్షకులమై ప్రపంచంలో మూలమూలలా ఉపదేశం చేయడానికే ఉంది.కన్నె తను వివాహమాడ్డానికి కాదు.'—ఇలా అని మహానాముడు ఒక ఉన్నతాసనందగ్గరకు వెళ్ళి అందుంచబడ్డ కత్తినీ, ముకుటాన్నీ తీసి ద్వారంవైపు పోడానికి వెనుదిరగ్గా అభయుడు అతని మార్గానికి అడ్డపడ్డాడు. అతని ముఖంలో ఇంకా వెనకటి భయంకరహాసం ఉంది—

'మహానామా, నాకు వయస్సుగాని, ఉపదేశంకాని అక్కర్లేదు. ఆరెండూ నాదగ్గర కావలసినంత ఉన్నాయి!'

అమాటలు వినగానే మహానాముడు ఒక్కసారి వేగంగా పళ్ళుకొరికి, కళ్ళు ముడిచాడు. కత్తిపిడి కాఠిన్యం వహించింది. కాని ఒక్కక్షణం గడచిన తర్వాత అతడు తన్నాపుకొని 'పాలి లభించడం అసంభవం' అన్నాడు.

చిరునవ్వుతోవున్న అభయుని ముఖం వెంటనే గంభీరమైంది. రాక్షస రూపాన్ని ధరించినట్లు అతడు మహానాముని కెదురుగా ఒకక్షణంలో వచ్చి నిలబడ్డాడు. 'నేను పాలిని తీసుకుంటాను' అని నిశ్చితమైన గాంభీర్యంతో అన్నాడు.

'అభయరాజా, మహానాముని కత్తి అడ్డపడుతుంది' అని చెప్తూండగా మహానాముని కళ్ళు నిప్పులు కక్కుతున్నాయో అన్నట్లు విస్ఫురితాలయ్యాయి. అభయుని ముఖంపై మళ్ళీచిరునవ్వు మొలకెత్తగా అతడిలా అన్నాడు. —'మహానామా, అభయునిముందు ఇంతవరకు ఎవని కత్తి ఖండితం కాకుండా ఉంది?'

'మహానాముని విచ్చుకత్తిని ఇంతవరకు లిచ్ఛవీయుడగు అభయుడు దగ్గరనుండి చూళ్ళేదు. శరీరాన్నుండి ప్రాణాన్ని ఎడబాపడానికే ఆకత్తి ఒరనుండి వెలువడుతుంది' అని మహానాముడు అవతలకు వెళ్ళాడు.


ఆయన వెళ్ళేటప్పుడు చేయవలసిన సామాన్యమైన శిష్టాచారాన్ని కూడా అభయుడు చెయ్యలేదు. అతడు అలాగే తన ఆలోచనల్లో మునిగి కొన్ని క్షణాలు నిలబడ్డాడు.

తరువాత ఒకహస్తం మెల్లగా పైకెత్తి మద్యపాత్ర పెదవులకు తగిల్చి 'అభయరాజు తానుకోరింది పొందగలడు' అని..... అతడు గవాక్షంవైపు వెళాడు. అతని చూపులు దూరంగా కన్పించే మహానాముని ప్రాసాదంపై బడ్డాయి. ప్రాసాదంలోని ఉద్యానవనంలో తిరుగాడే పాలి అతనికి జ్ఞాపకానికి వచ్చింది. 'పాలి నాది. అమెను నాదాన్నిగా చేసుకుంటాను' అని అతడు గొణిగాడు. మెల్లగా రెండవ పాత్ర గూడా నోటికందిచ్చి మెల్లగా నవ్వాడు. నవ్వుతూ అతడు వెనక్కి తిరిగిచూచి ఆగిపోయాడు— ద్వారానికి మధ్యగా సుధీరుడు నిలబడ్డాడు. అతని తలనిండా, భుజాల్లోనూ ఇప్పటివరకూ కట్లుకట్టబడి ఉన్నాయి. అతని శరీరం కుప్పించింది. పిడికిళ్ళు గట్టితనం వహించాయి. పళ్ళని పెదాలు వేగంగా ముడుచుకుపోయాయి. ముఖం కోపంవల్ల ఎర్రబడింది. అభయుడు మందహాసంచేసి, 'ఏమిసంగతి సుధీరా?' అని ప్రశ్నించాడు.

'నన్ను సుధీరుడని పిలవకు. శత్రువని చెప్పు నేటినుండి మనమిద్దరం జీవితాంతం పరస్పర శత్రులం!' ఇలా చెప్పగానే సుధీరుడు క్రిందపడిపోయాడు. అభయుని చేతిలోంచి పాత్రలు రెండూ పడిపోయాయి.........

'పాలి మయమైన సుధీరుని మెదడు వేడెక్కింది. ఆకోపస్వభావం హానికరంకావడంవల్ల అతడు మూర్ఛపోయాడు. తన పాలిని 'నాదాన్నిగా చేసుకుంటాను' అని వేరొకడు చెప్తే సుధీరుడు ఎలా సహించగలడు? అసంభవం. సుధీరుని మానసిక వ్యథను తెలిసికోడానికి అభయునివంటి రాజనీతిజ్ఞుడికి ఎంతోకాలం పట్టలేదు.

(సశేషం)


అతిత్వరలో విడుదల!
అమరావతి చిత్ర వారి.
పాదుకా
పట్టాభిషేకము
సంగీతం
ఘంటసాల
దర్శకత్వం: టెక్నికల్ యూనిట్
నిర్మాత: పి. ఆర్. రెడ్డి

నవ్యతా నాణ్యతా ఉన్న చిత్రం



రాజశ్రీ, రామారావు.

అగ్గిబరాటా

సామాన్య ప్రేక్షకునికి కనువిందు కలిగించే కత్తియుద్ధాలు, వినోదాన్నందించే మంత్రాలూ మాయలూ, ఆకర్షణీయమైన నృత్యాలు మొదలైన వాటితో నవ్యతను, నాణ్యతను మేళవించి శ్రీ విఠల్ ప్రొడక్షన్స్ అండ్ కో వారు నిర్మించిన జానపద చిత్రం అగ్గిబరాటా. జానపద చిత్ర నిర్మాణంలో అందెవేసిన చెయ్యి అన్పించుకున్న విఠల్ ప్రొడక్షన్స్‌వారు పూర్ణా పిక్చర్స్ వారితో కలిసి శ్రీ విఠల్ ప్రొడక్షన్స్ అండ్ కో అనే కొత్త పతాకం క్రింద ఈ చిత్రాన్ని తీశారు.

మహారాజును అంతమొందించి ఒక వైపు దొంగగా మరో వైపు దళపతిగా రాజ్యాన్ని కొల్లకొడుతూ, దేశంలో అరాచకం ప్రబలేలా ప్రవర్తించి రాజ్యాన్ని, రాకుమారిని హస్తగతం చేసుకోవాలనుకున్న గజపతికి అగ్గిబరాటా పేరుతో పేరుడైన ఓ పల్లెటూరి యువకుడు—రాజా— అడుగడుగునా అవాంతరాలను కల్పించి అతని ప్రయత్నాలన్నిటినీ వమ్ము చేసి మృత్యు ముఖంలో ఉన్న మహారాజును రక్షించి మహారాజా కోరికపై రాకుమారిని, రాజ్యాన్ని చేపట్టాడు.

ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, రాజనాల, రమణారెడ్డి, ముక్కామల, మిక్కిలినేని, బాలకృష్ణ, మోతుకూరి సత్యం, గణేశ్, రాజారెడ్డి, కె. వి. ఆర్. ఆచార్య, డాక్టర్ శివరామకృష్ణయ్య, ఎ. ఎల్. నారాయణ, కోటేశ్వరరావు, కోళ్ల సత్యం, కృష్ణమూర్తి, రాజశ్రీ, వాణిశ్రీ, సుధాబాల, విద్యశ్రీలు నటించారు.

అగ్గిబరాటాగా ఎన్. టి. రామారావు ప్రదర్శించిన నటన ప్రతిభావంతంగా ఉంది. రాకుమారి వాసవిగా రాజశ్రీ చక్కగా నటించింది. దళపతిగా రాజనాల నటనలో చెప్పుకోదగ్గ లోపాలేమి లేకపోయినా ఉచ్చారణ దోషాలు లేకుండా ఉండి ఉన్నట్లయితే యింకా బాగుండేది. మంత్రాలు, మాయలు నేర్చిన భభం బసవయ్యగా రమణారెడ్డి హాస్యం ప్రేక్షకులకు చక్కలిగింతలు పెడుతుంది. మిగతా నటీనటులందరూ తమ తమ పాత్రలను అర్థం చేసుకుని నటించారు.

శ్రీ విజయా కృష్ణమూర్తి అందించిన సంగీతం చిత్రం మంతటా వీనుల విందుగా ఉంది. పాటలన్నీ విన సొంపుగా ఉన్నాయి.

ఛాయాగ్రహణం విషయంలో శ్రీ వరదరాజన్ చక్కని నేర్పును ప్రదర్శించారు. వినూత్నంగా చిత్రాన్ని రూపొందించడంలో దర్శకుడు శ్రీ విఠలాచార్య చూపిన ప్రతిభ చిత్రంలో ప్రతిబింబిత మవుతుంది.

అక్కడక్కడ చిన్న చిన్న లోపాలున్నా మొత్తంమీద చిత్రం విసుగు లేకుండా వినోదాత్మకంగా ఉందని చెప్పవచ్చు.

—మాధవ్ ●

'శతచిత్ర సుందరుడు'

హీరో కాంతారావు



శతచిత్రయాత్రలో ఘనవిజయాలు చూరగొన్న శ్రీ కాంతారావును కోదాడు సభలో అభినందిస్తున్న కేంద్ర మంత్రి శ్రీ సంజీవయ్య.

త్రను నటించిన చిత్రం మ్యాగ్రోజా లాడితేనే గొప్ప.

తను మూరు చిత్రాలలో నటించితే ఏంత గొప్ప? చాలా గొప్ప. కాని యీ ఘనత సాధించడం చాలా కష్టం.

గొప్ప సంగతి యెలావున్నా యిది చాలా సంతోషం కలిగించే సంగతి! నటుని జీవితంలో యిది మరుపురాని అనుభూతి. అతని అనుభవానికి ప్రతిభకు, అతడు పడ్డ కష్టాలకు, చేసిన శ్రమకు అది ఫలితం.

తెనుగు వెండితెర మీద శత చిత్రయాత్ర చేసిన మరో హీరో పేరు, 'ఆకాశరామన్న' అనే జానపద చిత్రంలో సెంచురీ చేసిన నటుల ప్రత్యేక జాబితాలో చేరింది. ఆ పేరే మిటంటారా? తాడేపల్లి లక్ష్మీకాంతారావు.

కోదాడ్‌కు కొత్తకళ

మే 18 వ తేదీ నాడు ఎండ మామూలుగానే మండిపోతూ వున్నా విజయవాడ హైదరాబాదు 'హైవే' ప్రక్కనే నల్గొండ జిల్లాలో గల చిన్నగ్రామం 'కోదాడ్' అమితోత్సాహంతో కొత్త తోరణాలు కట్టుకొంది. 'రాదారి' ప్రక్కనే గల 'బారకా సంత' ఆవరణలో ప్రత్యేక వేదిక కట్టుకుంది! అక్కడేదో తిరణాల కాబోలు అనుకున్న వాళ్ళు కూడా సంగతి తెల్సుకుని చూసి పోదామని వుండిపోయారు. ఆ వేదిక ముందు కత్తి పట్టుకున్న రాజకుమారుని రంగుల బొమ్మ వుంది.

వాళ్ళు తెల్సుకున్న కారణం యేమిటో యిక చెప్పనక్కర లేదనుకుంటాము. "కాంతారావుకు ఘనస్వాగతం" అని వుంది అక్కడ. తెనుగు ప్రేక్షకుల అభిమాన జానపద చిత్ర కథానాయకుడు కాంతారావుకు ఆ రోజున సన్మానం జరగబోతున్నది. మూడు నాలుగుమైళ్ల దూరంలోనే వున్న గుడిబండ గ్రామమే నటుడు తాడేపల్లి లక్ష్మీకాంతారావు జన్మస్థలం. అతని స్వస్థలం. కాంతారావంటే పడుతున్న 'గర్వమంతా నాడు అలంకారంగా, ఉత్సాహంగా, జన సమూహంగా పరవళ్ళు తొక్కింది.

1953 లో హెచ్. యం. రెడ్డిగారి చేతి చలవతో 'ప్రతిజ్ఞ' అనే చిత్రంలో వెండితెర మీద పుట్టి అనేక కానేక కష్టనష్టాలకోర్చి—వేషం జానపదమే అయినా లేక పౌరాణికమే అయినా సరే తారాపథ మెక్కడమే లక్ష్యంగా పెట్టుకుని 'ఆకాశ రామన్న'తో మూరు సినిమాలపూర్తి చేసుకున్న నటుడు కాంతారావును—అతని పుద్దేశంలోనే ఒక అద్భుతమైన మైలురాయి అయిన 'జయసింహ' శతదినోత్సవంలో అభినందించిన శ్రీ దామోదరం సంజీవయ్య తిరిగి 18 వ తేదీ నాటి సన్మానసభకు కూడా అధ్యక్షత వహించారు.

ఆయన వేలాది ప్రజల ఉత్సాహంతో కళకళలాడుతున్న సన్మానోత్సవాలను అపూర్వమని, మనోహరమని మరుపురానిదని అభివర్ణించారు. కేంద్ర పరిశ్రమల మంత్రికి యీ సభానిర్వహణ ఆనందదాయకమైన శ్రమ నిచ్చింది.

మద్రాసు నుంచి 80 మంది దాకా సినీ నటీనటులు, సాంకేతిక నిపుణులు, దర్శకులు, విజయవాడ నుంచి ప్రముఖులు, కాంతారావు శ్రేయోభిలాషులు అయిన సంపన్నులు దార్లు వచ్చి యీ సన్మాన సభలో పాల్గొన్నారు. కట్టలు తెంచుకున్న యీ ఉత్సాహాన్ని కంట్రోలు చేయడమే శ్రీ సంజీవయ్య పడ్డ ఆనందదాయకమైన శ్రమ!

కోదాడు గ్రామవాసులతోపాటు చుట్టుపట్లగల అనేక గ్రామాలనుంచి ప్రేక్షకులువచ్చి వేల సంఖ్యలో ఉత్సవాలలోనూ, వూరేగింపులోను పాల్గొన్నారు. సాయంకాలం ఆరుగంటలకు సలభై నాలుగు జతల ఎడ్లు పూన్చిన పూలరథం కాంతారావు దంపతులతో బయలుదేరింది. కోలాహలంగా, కన్నుల పండువుగా వూరేగింపు సాగింది.

కాంతారావు దంపతులు పూలరథంలోను వారివెంట శకటాలలో మద్రాస్ నుంచి ఉత్సవంలో పాల్గొనేటందుకు వచ్చిన నటీనటులు సన్మానసభా వేదిక చేరుకునేసరికి ఇసుక వేస్తే రాలని జనం ఆబాలగోపాలం ఆనందాతిరేకంతో విరగబడి చూశారు.

వేదపండితుల ఆశీర్వచనంతో సన్మానం ప్రారంభమైంది. నూతన వస్త్రాదులతో పూలమాలలతోను నటునికీ, అర్ధాంగి శ్రీమతి హైమవతికీ ఘనమైన సన్మానం జరిగింది. సన్మానసంఘం తరపున కమిటీ అధ్యక్షుడు శ్రీ జి. అప్పయ్య సన్మానపత్రం సమర్పించారు. అందులో "ఎక్కడో ఓమారుమూలనున్న ప్రాంతం మన కోదాడ నేడు చరిత్ర ప్రసిద్ధికెక్కింది" అని పేర్కొన్నారు. అటుతర్వాత స్థానిక నాటక సమాజాల పక్షాన, పరిసర గ్రామాలలోని వేర్వేరు కళాసంస్థల తరఫున నటునికి సుమారు 20 దాకా సన్మానపత్రాలు సమర్పించబడ్డాయి. ఒకరు నటునికీ, సభాధ్యక్షులకు కూడా చక్కని చేతికర్రలను బహూకరించారు.

శ్రీ సంజీవయ్య రాక కొంచెం ఆలస్యమైంది. ఆయన రారు అనుకున్న నిర్వాహకులకు, ప్రేక్షకులకు 'రావడం'తో నిజంగా కొండందుకున్నంత ఆనందమైంది. జాగా చాలక ఎండగాడ్పులలోను, పసిపిల్లలతోను త్రొక్కిసలాటకు గురి అవుతున్న ప్రజావాహినిని ప్రశాంత పరచడంలో శ్రీ సంజీవయ్య చాలా నేర్పు, ఓర్పు ప్రదర్శించారు "కాంతారావు వెండితెరమీద నటుడు. ఒక మహత్తర విజయాన్ని చేపట్టినవాడు. అతనికి జరుగుతున్న అపురూపమైన, అనన్యసామాన్య విశేషమైన సన్మానసభకు తమను ఆహ్వానించడం బహుశా తాము కూడా రాజకీయ నాటకరంగంలో బహువేషధారి కావడమేనేమో" నంటూ ఆయన చమత్కరించారు తనకు వేయబోయిన పూలమాలలను కూడా ఆయన శతచిత్ర విజయభారంతోను, హితుల, సన్నిహితుల ఆదరసత్కారాదులతో "క్రుంగి" పోతున్నానని అసందంగా, వినయంగా కూర్చున్న కాంతారావుకే వేసేస్తూ, అతని మెడల భారాన్ని మరి కొంచెం పెంచారు.

శ్రీ కాంతారావు తనకు జరిగిన ఘనమైన సత్కార సన్మానాలకు సమాధానం చెప్పేముందు మాతృమూర్తిని వేదిక మీదకు తీసుకుని వచ్చి ఆమె పాదపూజ చేశారు ఆ దృశ్యం ప్రేక్షకులను కదిలించింది. తన విజయానికీ, తన నూరు చిత్రాల సుదీర్ఘ యాత్రకు కారణభూతులైన వారందర్నీ పేర్కొంటూ కృతజ్ఞత చెప్పడమేగాక శ్రీ కాంతారావు తన నట జీవితాన్ని ప్రేక్షకులకు సంగ్రహంగా వివరించాడు.


కొన్నిచోట్ల అతను చలించిపోయాడు. ప్రేక్షకులు కూడా అతని సహజ వినయ సంపదకు ముగ్ధులయ్యారు.

ఫ్లాష్ బ్యాక్

నిజంగా నటుడు కాంతారావు కొంతమంది అనుకున్నకన్నా తొందరగానే యీ "నూరు చిత్రాల రేసులో గుర్రంలా దూసుకుంటూ వచ్చాడు 63 జూన్‌లో సచిత్ర వారపత్రిక పాఠకులకు క్షుణ్ణంగా పరిచయమైన యీ వెండితెర అందాల 'రాజకుమారునికి' అప్పటి క్రెడిట్‌లో 60 చిత్రాల దాకా వున్నాయి! అక్కడే నూరు చిత్రాల గమ్యాన్ని చేసి అతను రేసు గుర్రంలా పుంజుకోవాల్సిన, పుంజుకోగల అవసరాన్ని అవకాశాన్ని పేర్కొనడం కూడా జరిగింది. మరి మూడేళ్ళు తిరిగే సరికి మిగతా నలభై చిత్రాలు కాంతారావు ప్రేక్షకజన రంజకంగా నటించి, నూటొక్కటో చిత్రం విడుదలయ్యే తరుణంలో కూడా అదే నిగర్వంతో, వినయాన్ని ఒక కంట, విజయాన్ని మరో కంటా ప్రదర్శిస్తూ నిలబడి సన్మానాలను స్వీకరించాడు. పట్టుదలను, ప్రతిభనూ నిరూపించుకున్నాడు.

అపురూప దృశ్యం

తెర మీద ప్రతిజ్ఞ నాటినుంచి నేటి వరకూ అగర్భ శత్రువులుగా నటించే రాజనాల కాంతారావు లిద్దరూ తెర వెనుక ఒకర్ని ఒకరు విడిచి వుండలేని స్నేహితులన్న సంగతి వేలాది ప్రేక్షకులకు యీ సన్మాన సభలో వెల్లడైంది. "రాజనాల కాంతారావులు వేర్వేరు కాము" అంటూ కాంతారావు వేదిక మీద తన మిత్రుణ్ణి కౌగిలించుకుని— తన సన్మానంలో కొంతభాగమతనిది కూడా అన్నట్లు ఒకే పూలమాలను— రాజనాలతో



తెరమీద నూరు చిత్రాలలో, ప్రత్యేకంగా జానపద కథానాయకునిగా ప్రఖ్యాతి గాంచిన నటుడు కాంతారావు నిజ జీవితంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సంసారయాత్ర చేస్తున్న గృహ యజమాని. చిత్రంలో సొంతం ఊళ్లో కట్టుకొంటున్న దాబాలో [illegible] దగ్గర నిలబడ్డ అతన్ని, కుటుంబాన్ని చూడవచ్చును.

కలిసి పేయించుకున్న దృశ్యం— ఆ యిద్దరి స్నేహం అలాగే మరింతగా వర్ధిల్లాలని ప్రేక్షకుల చేత అనిపించుకున్నది.

తెలుగు చిత్ర నటుడు కాంతారావు తన సమాధానంలో అన్న కొన్ని మచ్చుతునక వాక్యాలు మాత్రం యిక్కడ వ్రాస్తాను.

"శ్రీ హెచ్. యం. రెడ్డిగారు విత్తనం నాటితే, శ్రీ విఠలాచార్యగారు నీరుపోసి పెంచారు...." "నా నటనా జీవితం ఏడు రంగుల ఇంద్రధనస్సుగా వెల్లి విరియడానికి కారణభూతులైన అప్పుటందరికీ నా హృదయ పూర్వక నమోవాకములు." "దాదాపు తెలుగు సినిమాకాశంపై ప్రకాశించే తారలందరితోను కలిసి నటించాను. తెరపై సహనటీనటులతో అన్నతమ్ముడు, తండ్రి, కుమారుడు, భర్త, ప్రేమికుడు, మిత్రుడు, విరోధి యిలా ఎన్ని బాంధవ్యాలున్నా నిత్యజీవితంలో మాత్రం నాకందరూ 'మిత్రులే! నేను అందరికీ అప్తుణ్నే"

శ్రీ కాంతారావు కోదాడువాసులు తనపై అత్యంత ప్రేమాభిమానాలతో, గౌరవ మర్యాదలతో సన్మానం చేసిన వేదికను 'రంగస్థలంగా' రూపొందించే టందుకుగాను "ఉడుతాభక్తిగా పదివేల రూపాయలు నను

కాంతారావు

ర్పిస్తున్నాను" అని ప్రకటించినప్పుడు హర్షధ్వానాలు మిన్నుముట్టాయి.

మద్రాసు నుంచి కుమారి కృష్ణకుమారి, కుమారి రాజశ్రీ, పద్మశ్రీ నాగయ్యలు వస్తారని ఉత్సాహంపడ్డ ప్రేక్షకులు మొదట కొంచెం నిరుత్సాహపడ్డా, త్వరలోనే కార్యక్రమాల హడావుడిలో ఆ విషయమే మరిచిపోయారు. శ్రీయుతులు రాజనాల రామకృష్ణ, చలం, సత్యన్నారాయణ, జగ్గారావు, బాలకృష్ణ, రాజబాబు జంటగా వాణిశ్రీ, శారదా మున్నగు సహనటులు తమ మిత్రుణ్ణి ప్రేమపూర్వకమైన ప్రశంసలతో అభినందించారు.

శ్రీయుతులు జెవర్జి (వాణీఫిలింస్), కామరాజు(పూర్వా) కొండాలక్ష్మణబాపూజీ (మాజీ మంత్రి), వాసుదేవరావు (ఎం. ఎల్. ఏ), డా. చంద్రశేఖర్, వేణుమాధవ్ మున్నగు ప్రముఖులు కాంతారావుకు ఉజ్వల భవిష్యత్ నాకాంక్షిస్తూ ప్రసంగించారు. దర్శకుల్ని పి. యస్ రావు, ఎస్. డి. లాల్ లు, రచయితలు పి. నారాయణరెడ్డి, "మహారథులు కాంతారావును 'తెలంగాణా జాతిరత్న'మని ప్రశంసించారు. మద్రాసు సినీ జర్నలిస్టు సంఘం తరపున శ్రీయుతులు మాగాపు రామన్, కె. కె. శర్మ (కాగడా)లు కాంతారావును అభినందించారు.

చలం, శారద యిటీవల మంచి పాపులర్ అయిన తమ 'లైలా మజ్నూ' హాస్య నాటికను ప్రదర్శించారు. నేపధ్య గాయకులు ఎస్. జానకి, స్వర్ణలతలు, జి. వి. రాజా పార్టీ ఆర్కెస్ట్రాతో కమ్మని సంగీత కచేరీ చేశారు. నటీనటుల కార్యక్రమాలు, వినోదప్రదర్శనలు అర్ధరాత్రి దాకా బ్రహ్మాండమైన సందడిగా జరుగుతూనే వున్నాయి. విడిదిగా యిచ్చిన "నాగార్జున కాలనీ"లో తెల్లవార్లూ సందడిగానే వున్నది. శ్రీ కాంతారావు తమ సమాధానంలో యీ 'క్వార్టర్స్'ను విడిదిగా యిచ్చిన ఇంజనీర్ శ్రీ లక్ష్మణరావుకు కృతజ్ఞత తెలిపారు. ఎంతైనా భాగ్యం. క్వార్టర్సులోని సిబ్బంది అంతా ఎంతో ప్రేమాదరాలతో 'దూరాభారం' నుంచి వచ్చిన కాంతారావు మిత్రులకు, స్నేహితులకు, హితులకు, సహనటీనటులకు యేర్పాట్లు చూశారు.

'ప్రతిజ్ఞ'—
భూలోకంలో యమలోకం

నటుడు కాంతారావు తెర మీద నూరు చిత్రాల ఘనతను, తెరవెనుక సంసారిక చక్కని మర్యాద తెలిసినవాడు, నిగర్వి అనే పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్నవాడు. ఐదుగురు పిల్లలూ, సొంత యిల్లూ, స్వార్జితమైన కీర్తి, అస్వార్జితమైన ఘనతగలవాడు. అతనికి యింకా మంచి అవకాశాలు, మంచి భవిష్యత్ అకాంక్షిస్తున్నాను.

—వీరాజీ ●



ఇటీవల బందరు నోబుల్ కాలేజీ పునరుద్ధరణనిధికి ప్రముఖ సినీకళాకారులు ప్రదర్శించిన "అంతా ప్రేమమయం" నాటకంలో సూర్యకాంతం, జగ్గయ్య, గుమ్మడి, అంజలీదేవి, సావిత్రి, అక్కినేని నాగేశ్వరరావు, పద్మశ్రీ నాగయ్య. (ఫొటో. యం వి మోహన్‌రావు, విజయవాడ)

సినిమా

ప్రేమలో ప్రమాదం

'ప్రేమలో ప్రమాదం' చిత్రాన్ని జోసెఫ్ తలియత్ డైరెక్టు చేస్తున్నారు. 1958 వ సంవత్సరంలో జోసెఫ్ తలియత్ బి. ఏ ప్యాసుకాగానే చిత్రకళ, శిల్పకళలో కృషిచేసి పెద్దహస్తులయ్యారు. వీరు డైరెక్టు చేసిన ప్రథమచిత్రం 'జ్ఞానసుందరి'. తమిళచిత్రమయినా ఇది ఆంధ్రదేశంలో కూడా విజయవంతంగా నడిచింది. అప్పటినుంచి అనేక తమిళ చిత్రాలకు ప్రొడ్యూసర్, డైరెక్టరూ కావడమేకాక, హిందీలోకూడా 'పాయల్' అనే చిత్రాన్ని నిర్మించారు.

"ముగ్గురుపిరులు"చిత్రంలో యీయన తెలుగుదేశానికి పరిచితులైనారు. కొత్త నటీ నటులతో తయారైన యీ చిత్రం తమిళదేశంలోనూ, తెలుగుదేశంలోను పేరు తెచ్చుకొన్నది. తరువాత 'ఇరవుం పగలుం' అనే చిత్రాన్ని మరల కొత్త వారలతో తీశారు. ఈ చిత్రంకూడా తమిళదేశంలో పేరు పొందింది. దీనిలోకూడా అందరూ కొత్త నటులే. అంతతో జోసెఫ్ తలియత్ తారలను తయారుచేసే డైరెక్టరు అని పేరు పొందారు.

ఇప్పుడు వారి సిటాడెల్ స్టూడియోలో నిర్మిస్తూవున్న రెండవ తెలుగుచిత్రము 'ప్రేమలో ప్రమాదం'. దీనిలో తారాగణం కృష్ణకుమారి, సూర్యకాంతం, పండరీబాయి, జయంతి, వాణిశ్రీ, రమప్రభ, రాధాకుమారి, విజయశ్రీ, రాధ, రామకృష్ణ, రాజనాల, చలం, రాజబాబు, చదలవాడ కుటుంబరావు, రావి కొండలరావు మొదలైనవారు నటిస్తున్నారు. మాటలు, పాటలు—ముద్దుకృష్ణ, సంగీత దర్శకత్వం—టి. ఆర్. పాప, ఫొటోగ్రఫీ—లాకాస్. ఈ చిత్రంలో శృంగారం, హాస్యరసాలతోపాటు సస్పెన్సు, స్టంటులూ పుష్కలంగా ఉంటాయి. నిర్మాతలు—సిటాడెల్ స్టూడియోస్, డిస్ట్రిబ్యూటర్స్—నవయుగఫిలింస్.



'భక్తపోతన'లో పద్మిని

'ప్రేమకానుక'

తమిళంలో నిర్మించిన'పిలవానం'చిత్రాన్ని కెసిహెచ్ ఫిలింస్‌వారు తెలుగులో 'ప్రేమకానుక' గా అనువదించారు.


ఈచిత్రంలో దేవిక, రాజశ్రీ,శివాజీ గణేశన్, నాగేష్‌లు నటించారు. మాటలు, పాటలు, అనిసెట్టి సంగీతం శ్రీటి ఏ రాజా నిర్వహణ వసుమూర్తి వెంకటరాజు, ఛాయాగ్రహణం కర్ణన్ కూర్పు షణ్ముగం, ఈ చిత్రం త్వరలో ఆంధ్రదేశంలో విడుదలవుతుంది.

దిల్ దియా దర్ద్ లియా

కే ప్రొడక్షన్స్‌వారు ఈస్ట్‌మన్ కలర్‌తో నిర్మించిన 'దిల్ దియా దర్ద్ లియా' ఆంధ్రదేశమంతటా విడుదలయింది.

ఈచిత్రంలో మొట్టమొదటి సారిగా దిలీప్‌కుమార్, వహీదా రెహమాన్‌లు నాయికా నాయకులుగా నటించారు.

ఇతర పాత్రలలో శ్యామా, ప్రాణ్, రెహమాన్, జానీవాకర్, మృదూ, సజ్జన్, ఎస్ నజీర్, రాణి ఉన్నారు. దర్శకత్వం ఎ ఆర్. ఖార్‌దార్, సంగీతం—నౌషద్, ఛాయాగ్రహణం—ద్వారకదివేచా నిర్వహించారు.




'సంగీతలక్ష్మి'లో జమున ఎన్. టి. రామారావు.

అవీ - యివీ...

వివాహం

శ్రీ పి. జి. శేషాద్రి (వాహిని పిక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్, మద్రాసు) ప్రథమ పుత్రిక చి. సౌ. కృష్ణవేణికి చి మదనగోపాల్‌కు మే 6 వ తేదీ ఆదివారం మద్రాసులోని వాహిని స్టైర్య కళ్యాణ మండపంలో వైభవంగా వివాహం జరిగింది.


రాబోవు కొత్త చిత్రాలు - పులిచెర్ల
నేడే చూడు! ప్రేమించి చూడు
వివాహబంధం
స్త్రీ సాహసం
దేవత
సతీ సక్కుబాయి!
అత్తాయ్! మొత్తం వడ్లు దంచావా? ఇంకా ఉన్నాయా? ఆఁయ్!
పులిచెర్ల

పుస్తకాలు

అండర్ ది గ్రీన్-పెయింట్ 1966

(సినిమా వార్షిక సంచిక)

సంపాదకుడు: దేవేంద్ర ప్రతాప్ లాంబా. 168 పేజీలు, వెల: అయిదు రూపాయలు. ప్రతులకు: అండర్ ది గ్రీన్ పెయింట్, మహల్మీ మహల్ థర్డ్ రోడ్, ఖార్, బొంబాయి—52.

ఎనిమిది సంవత్సరాల క్రితం వ్యాపార సినిమా వారపత్రికగా స్థాపించబడింది. ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆరు వార్షిక సంచికలు వెలువడినాయి. అయితే యింతకు పూర్వం వెలువడిన వార్షిక సంచికలు కొంతభాగం సైక్లోస్టైయిల్ చేయబడి, కొంతభాగం ముద్రించ బడటం జరిగింది. వార్షిక సంచికల ముద్రణ సంఖ్య కూడా అధికంగా లేకపోవటంచేత యింతకు ముందు అవి సామాన్య పాఠకునికి అందుబాటులోకి వచ్చేవికావు. కాని ఈసారి సంచిక పూర్తిగా ముద్రించబడి ఎక్కువ సంఖ్యలో వెలువరించి అందరికీ అందుబాటు కావటానికి కృషి జరిగింది. పూర్తిముద్రణతో వెలువడిన అండర్ ది గ్రీన్ — పెయింట్ మొట్ట మొదటి సినిమా వార్షిక సంచిక యిది. హిందీ చిత్రరంగంలోని ప్రముఖులు, యితరులు వ్రాసిన ఉపయోగకరమైన వ్యాసాలెన్నో యిందులో ఉన్నాయి. హిందీ చిత్రపరిశ్రమకు సంబంధించిన ముఖ్యమైన వ్యక్తుల చిరునామాలు కూడా ఈ సంచిక చివరి పేజీలలో యివ్వబడినాయి. ఆకర్షణీయమైన ఛాయాచిత్రాలు, ముద్రణ చక్కని గెటప్‌లతో రూపొందింపబడింది.

ఉరితాడు

డిటెక్టివ్ నవల. రచన: శ్రీ కొమ్మూరి సాంబశివరావు. 216 పేజీలు. వెల: నాలుగు రూపాయలు: ప్రతులకు: ఆంధ్రరత్న బుక్ డిపో, మారీసుపేట, తెనాలి—2.

డిటెక్టివ్ సాహిత్యంలో రచయిత చెయ్యి తిరిగినవారన్న విషయం సువిదితమే. అపరాధ పరిశోధక నవలలో ప్రధానంగా ఉండవలసిన లక్షణం పాఠకునికి ముందేం జరుగుతుందో అనే ఆసక్తిని కల్గించడం. రచయిత చొప్పించిన సంఘటనలన్నీ కేవలం వూహించినవే అయినా మనకళ్లెదుట జరుగుతున్న వాస్తవాలా అన్నట్లు ఉండటం చాలా అవసరం. అపరాధ పరిశోధనక నవలా రచనలో సిద్ధహస్తులైన రచయిత ఈ నవలలో చక్కని కథా గమనాన్ని, సస్పెన్సుని తీసుకొచ్చారు. అక్కడక్కడ కొన్ని సంఘటనలుమాత్రం వాస్తవదూరంగా కన్పిస్తాయి పాఠకునికి. అయినా ఈ నవల మొదలుపెడితే చివరివరకూ విడువకుండా చదివించగలదనటంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు.

సినీజనత

శ్రీ వి. కోటేశ్వరరావు సంపాదకత్వాన హైదరాబాద్‌నుంచి వెలువడిన సినీజనత తెలుగు పక్ష పత్రిక ప్రారంభసంచిక మా కార్యాలయం చేరినది.

ఈ పత్రిక ఆవిష్కరణోత్సవ సందర్భంలో ప్రముఖు లందించిన శుభాకాంక్షలు, సినిమారంగానికి సంబంధించిన వివిధ విషయాలపై వ్యాసాలు వర్తలు, స్వర్గీయ లాల్‌బహదూర్‌శాస్త్రికిచిత్రాంజలి, మద్రాసు ముచ్చట్లు మొదలగువాటితో చక్కగా ఉంది. 8 పేజీలు. వెల: 20 పైసలు. సాలు చందా: అయిదు రూపాయలు.

సామెతలు

శ్రీ గట్టినేని రావ స్వామిచౌదరి రచించిన సామెతలు మా కార్యాలయం చేరింది.

తెలుగుభాషలోగల ఎక్కువ జాతీయములను కూర్చి పాఠకులకు అందించుటలో రచయిత చేసిన కృషి ప్రశంసనీయమైనది. ప్రతి ఆంధ్రునికీ ఈ పుస్తకం ఆవశ్యకత ఎంతోవుంది. ఈ పుస్తకంలో మొత్తం 1116 సామెతలు ఉన్నాయి.

50 పేజీలుగల ఈ పుస్తకం వెల: రూపాయి, ఇరవైఅయిదు పైసలు. ప్రతులకు: శ్రీ వెంకటేశ్వర గ్రంథమాల, చినగాదెలవర్రు, తెనాలితాలూకా. గుంటూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు వ్రాయాలి.

కావ్యాంజలి

పద్య గేయ సంపుటి: రచన: సుగం 44 పేజీలు. మూల్యం: ఒక రూపాయి.

చక్కని పద్య గేయాలతో కావ్యాంజలిని తెలుగు నుడికారమును సులభ శైలిలో అందరికీ అర్థమయే రీతిలో రూపొందించారు రచయిత. గ్రామీణ జీవితము, ప్రకృతిక రమణీయకత వీరి రచనలో ప్రతిబింబితమవుతున్నాయి. నిత్య జీవితంలో కర్షకుడు పొందే అనుభూతులను వీరి రచనలో మనం చూడవచ్చు. అంతేకాకుండా దేశభక్తిని ఉద్బోధించే విధంగా ఉన్నవారి పద్యాలు పాఠకునిలో భావావేశాలను రేకెత్తిస్తాయి. చక్కని భావాలతో రచనను సాగించగల ప్రతిభకల రచయిత ముందు ముందు పాఠకులకు మంచి మంచి కావ్యాలనందిస్తారని ఆశించవచ్చు.

వెండితెర నవల

ఆట్లూరి శరత్‌బాబు రూపొందించిన 'పరమానందయ్య శిష్యుల కథ' వెండితెర నవల మా కార్యాలయం చేరింది. ఈ వెండి తెర నవల సినిమా కథను చక్కగా వివరిస్తూ మధ్యలో మాటలు, పాటలు, చక్కని చిత్రాలతో రూపొందింపబడినది.

100 పేజీలుగల ఈ వెండితెర నవల వెల: ఒక రూపాయి. ప్రతులకు : ఆట్లూరి శరత్‌బాబు, మారుతీనగర్, విజయవాడకు వ్రాయాలి.

—మాధవ్

బ్రిటన్

'బ్రిటన్' ఎన్ అఫిషల్ హాండ్‌బుక్ 1966 ఎడిషన్: సెంట్రల్ ఆఫీస్ ఇన్‌ఫర్మేషన్, లండన్. వెల: రు 14—00 . దొరికేచోటు—మానేజరు, హెచ్. ఎమ్. ఎస్. ఓ. సేల్స్ సెక్షన్, బ్రిటిష్ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్, చాణక్యపురి, న్యూఢిల్లీ—21.

ఈ పుస్తకంలో బ్రిటన్‌కి సంబంధించిన సమాచారం సమగ్రంగా, ఆకర్షణీయంగా ఇచ్చారు. దేశం, ప్రజలు, ప్రభుత్వం, అందులోని వివిధ శాఖలు ప్రణాళికలు, ఆర్థికపరిస్థితిని మొదలయిన విషయాలని గురించేకాక చర్చిలు, క్రీడారంగం గురించి కూడా ఎంతో సమాచారం ఈగ్రంథంలో ఉంది. చక్కటి ముద్రణ మాత్రమే కాక కొన్ని ఫొటోలు, మాప్‌లు, బొమ్మలు దీని ప్రత్యేక ఆకర్షణ.

—కె. వి. ఆర్.

Edited Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6&7 Thambu chetty Street Madras-1. Phones Editorial, 21747; Other depts; 29766. Chief Editor: S Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA



రా జ శ్రీ

నిగనిగలాడు నల్లని కేశములకు

రెమి

కేస్టర్ హేర్ ఆయిల్

CRITERION RP: 838